# ఆంధ్రపత్రిక

సచిత్ర వార పత్రిక






4 అణాలు

7-5-52

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY



**ఉత్కంఠిత**

పి. ఆర్. రాజుగారు (మద్రాసు) పోస్టరు పద్ధతిలో రచించిన చిత్రం

సంపుటము 44 7-5-52 సంచిక 35

# ఆంధ్రపత్రిక


సం. చం. రు. 12/- సచిత్రవారపత్రిక విడిప్రతి 4 అ.

Founder : K. NAGESWARA RAO

నందన సంవత్సర వైశాఖ శుద్ధ త్రయోదశి బుధవారము

## ఈవారం ముఖ్యవిషయాలు





పార్లమెంట్ భవనం



పార్లమెంట్ సభామందిరం

వ్యాఖ్యలు, విమర్శలు:

# రిపబ్లిక్ అధ్యక్షుని ఎన్నిక


సర్వజనులకూ వోటింగు హక్కు లభించిన తరవాత ప్రప్రథమంగా రిపబ్లిక్ అధ్యక్షుని ఎన్నిక మే 2వ తేదీన ఢిల్లీలోనూ రాష్ట్ర ముఖ్యపట్టణాలలోనూ జరిగింది. కొద్దిమంది మినహా రాష్ట్ర శాసనసభ్యులు పార్లమెంట్ సభ్యులూ అందరూ ఎన్నికలో పాల్గొన్నారు. చిన్న రాష్ట్రంలో పార్లమెంట్ సభ్యులు రాష్ట్ర శాసన సభ్యులు మొత్తం 474 మందిలోనూ 426 మంది ఎన్నికలో పాల్గొన్నారు.

ఈపోటీలో మొదటి లెక్కింపులోనే డా॥ రాజేంద్రప్రసాద్ గారివిజయంతథ్యం. కాని ఏకగ్రీవంగా జరగవలసిన ఎన్నిక కమ్యూనిస్టులు, ప్రజాపార్టీలవల్లనూ, అభ్యుదయ నిరోధకులు మత ప్రధానమైన రాజకీయాలను కోరేవారివల్లనూ పోటీ అనేది వచ్చింది. మొదట రాజ్యాంగ పరిషదధ్యక్షునిగానూ తరవాత రిపబ్లిక్ అధ్యక్షునిగానూ దేశంలో సర్వవర్గాలవారి మెప్పు పొందిన డా॥ రాజేంద్రప్రసాద్ గారిని పార్టీ అభ్యర్థిగా ఎంచి, కమ్యూనిస్టులూ, ప్రజాపార్టీవారూ నామకః పోటీ పెట్టడం శోచనీయం. ఆ మాట అలా వుంచి పార్టీ అభ్యర్థిగా రాజేంద్రప్రసాద్ గారిని ఎంచినట్లు భావించినప్పటికీ, ఇందుకు కమ్యూనిస్టులు అధిక్షేపించడంలో అర్థం లేదు. పార్లమెంట్‌లో అత్యధిక బలాన్ని గెలుచుకొన్న కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ ప్రభుత్వ విధానంతో ఏకీభవించనివారిని అధ్యక్ష పదవికి నిలబెట్టాలనడంలో అర్థం లేదు. రాజ్యాంగం సక్రమంగా నిర్వహించబడాలంటే కేంద్ర మంత్రివర్గానికీ రిపబ్లిక్ అధ్యక్షునికీ మధ్య సహకారం లక్ష్యైక్యతా అవసరం. ఇంతవరకూ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ గారి ఆధ్వర్యం క్రింద నెహ్రూ మంత్రివర్గం సాగించిన పరిపాలన సర్వజనామోదం పొందినందువల్లనే తిరిగి వారే ఎన్నుకొబడుతున్నారనీ, రాజేంద్రప్రసాద్, నెహ్రూగార్ల పట్ల దేశానికి అచంచల విశ్వాసం ఉన్నదనీ ఇతర పార్టీలవారు మరచిపోరాదు.

## రాజభవనాలు

రాజభవనాలనే మాట ఈ రోజుల్లో ఎబ్బెట్టుగా తోచవచ్చును. రాజులు లేకపోయినా రాజరికమూ, రాజరిక మర్యా

(6-వ పేజీ చూడండి)



రాష్ట్రపతి భవనం



రాష్ట్రపతి భవనంలో ఒక గది

# నారాజీనామా

ఆ నాడు ఒక మహానాయకుడు బెజవాడ రావడంవల్ల రైళ్లు, కార్లు ఖాళీ లేకుండా పోతున్నాయి. రాజకీయ సభల్లో ఉద్యోగస్థులు పాల్గొనరాదనే నియమం ఉన్నా మధు కూడా బయలుదేరాడు. లక్షలాది ప్రజలు ఆ నాయకుని దర్శనార్థం తండోపతండాలుగా బయలుదేరడం, తను ఉద్యోగం చేస్తున్న అధికారసంస్థ ఆరోజు సెలవుదినంగా ప్రకటించడం, పిరికిపందయైన మధుని కూడా ప్రోత్సహించినాయి. అసలు మధు వెనకాముందూ ఆలోచించే రకం కాదు. అయినా అయిదు సంవత్సరాల మాస్టరీగిరి అతన్నీ విధంగా మార్చివేసింది.

ఆదరా బాదరా పరుగెత్తికెళ్ళాడు మధు స్టేషన్‌కి. రైలు వచ్చేస్తోంది. ఇంకా టికెట్ కొనలేదు. పైగా చేతిలో ఒక బరువైన సంచి. ప్లాట్‌ఫారంమీద అంతమంది జనంలో పరుగెత్తడం అసభ్యత. పైగా విద్యార్థులు కూడా అక్కడక్కడ ఉన్నారాయె. దగ్గిరలో విద్యార్థి సుందరం కన్పించాడు.

'సుందరం. వెళ్ళి ఇంటర్ టికెట్ ఒకటి బెజవాడకు తీసుకురా' అంటూ అరిచాడు.

సుందరం అదివరకు దాకా ఇటు తిరిగున్నవాడల్లా అటువైపు తిప్పుకున్నాడు ముఖం ఏమీ విననట్లు.

'నిన్నే సుందరం'

రైలు దాపుకు వచ్చేసింది. మధు ప్రక్కనే ఉన్న ఓ పెద్దమనిషి 'మీరు తొందరగా వెళ్ళకపోతే ఇందాకనుంచీ పరుగెత్తికొచ్చిన శ్రమ కూడా నిష్ఫలం అవుతుంది.' అని హెచ్చరిక చేశాడు.

మధు కొద్దిదూరం చకచకా నడిచేటప్పటికల్లా ఓ చిన్న వెధవ కన్పించి 'మీరు బండీ ఎక్కండి మాస్టరుగారూ. నేను టికెట్ తెచ్చిపెడతా' నన్నాడు.

'సరే' నంటూ మధు ఇంటర్‌లో కెక్కాడు. రైలు కదలింది. కాని ఆ చిన్న వెధవ రాలేదు. కిటికీలోంచి తొంగిచూశాడు. ప్లాట్‌ఫారంమీద ఎవరూ లేరు. జేబుదొంగ లుంటారని డబ్బు పదిలం చేసుకున్న మధు చేతులారా డబ్బు దొంగకప్పచెప్పాడే! ఎంత మోసం! పైగా ఆ దొంగ డబ్బు కాజేయడమే కాక తన్ని కూడా ఒక నేరస్థుని జేశాడే!

మధు పెట్టం తా కలయచూశాడు. ఎక్కడా పిసరంత ఖాళీలేదు. ఒక్కచోటమాత్రం ఆసీనుడై యున్నాడు తన క్లాసులో చదివే కుర్రాడే ఠీవిగా. ఒక నిముషం చూశాడు 'మాస్టరుగారూ కూర్చోండి' అంటాడేమోనని. కాని అట్లా జరగలేదు. మధు కొంచెం చనువుతీసుకుని 'ఒరేయ్ నువ్వు కొంచెం లే' అన్నాడు. 'సారీ సార్' అన్నాడతడు ముఖం ప్రక్కకు త్రిప్పుకుంటూ. మధుముఖంలో నెత్తురుచుక్క లేదు. పైగా దేశీయసాంప్రదాయం ప్రకారం ప్రక్కనున్న ఓపెద్దమనిషి.

'అవన్నీ పూర్వం రోజులండీ మాస్టరుగారూ ఈనాటి విద్యార్థులు' అంటూ ఉండగానే ఒక కాలేజీ కుర్రవాడిలాగా ఉన్నవాడొకడు అందుకుని 'అట్లా అంటే ఊరుకోను. ఈనాడు గౌరవా గౌరవాలు ఒకళ్ళుకోరితే వచ్చేవి కావు. మనిషినిబట్టి ఉంటాయి.' అన్నాడు.

సన్నటి గొంతుకలో మరొకడు 'డబ్బు

లేనివాడు బోటుముందు దుక్కుతాడు' అన్నాడు.

'మొత్తంమీద ఉపాధ్యాయులంటే ఈనాడు విద్యార్థులకు..." అని ఇంకో పెద్దమనిషి అనబోతుండగా మధు రెండో వైపుకు వెళ్ళి...

'కొంచెం జరగండి' అని ఒకాయన్ని అడిగాడు. జరిగినదంతా పరిశీలించిన మీదట దయగలిగిందో లేకపోయినా ఇచ్చేవాడేమో—రండి. కాసేపేగా అట్లాగే ఇరుక్కుని కూచుందాం.' అన్నాడు.


చాలాసేపటివరకు మధు తల ఎటూ త్రిప్పకుండానే కూచున్నాడు అతని విద్యార్థి కూడా కదలకుండా నేకూర్చున్నాడు. మధు ముఖంలోకి ప్రయాణీకుల్లో కొందరు అప్పుడప్పుడు చూడటం అతని మనస్సును కలవరపరచింది. కలవరపరచడమే కాదు బెజవాడ జేరుకునేవరకు అతనిమనస్సు ముందు ఎట్లా అసలు అతను ఆ ఉద్యోగంలో ప్రవేశించిందీ, ఎన్నిసార్లు రాజీనామా నిచ్చి బయటపడుదామనుకున్నా రాలేకపోయిందీ అన్నివిషయాలు ఒక్కసారి సినిమాలో చూసినట్లు కళ్లముందు ప్రత్యక్షమయినాయి.

మధు ఉపాధ్యాయుడవుతాడని ఎవరూ కల్లోకూడా అనుకోలేదు. అతని తలిదండ్రులు అతడొక పెద్ద ఉద్యోగి అవుతాడనుకున్నారు. మధు తల్లికి కొడుకు పెద్ద ఉద్యోగం చేస్తూంటే చూడాలనుకుండేది. తమాషాకు తనకొడుకు కలక్టరవుతాడంటుండేది తండ్రి ఎందుకు కాకూడదూ అంటూండేవాడు. మేనమామకి మాత్రం మధు ఓ పెద్ద ప్లీడరు చెయ్యాలని వుండేది. కనీసం రెవిన్యూ ఇన్‌స్పెక్టరన్నా అవడా అంటూండేది మధు అక్కగారు. 'మా అన్నయ్యే గవర్నరవుతాడంటూండేది' మధు చెల్లి సుశి. మధు నివసించే గ్రామంలోనివారు మధుకు 'డాక్టరీ చెప్పించండి' అని కొందరు, 'ఇంజనీరుకు పనికివస్తాడేమో చూడండి' అని మరికొందరు 'ప్లీడరయితే స్వతంత్రంగా జీవించవచ్చు' నని మరికొందరూ సలహా లిస్తూండేవారు

అన్ని అవకాశాలుండికూడా మధు డాక్టరూ కాలేదు ప్లీడరూ కాలేదు. లేక ప్రభుత్వపు ఉద్యోగీ కాలేదు. స్వయంగా ఉపాధ్యాయవృత్తినే వరించాడు.

మధు శాంతిస్వంతభావుడు. ప్రశాంతంగా జీవితాన్ని గడుపవలెనని కోరిక గలవాడు. పెద్ద పెద్ద నాయకులు ఉపాధ్యాయవృత్తిని జాతిని నిర్మించి జీవం పోసే వృత్తియని పొగడడం అతడ్ని భ్రమింపజేసింది. అదికాకుండా అతడు చదువుకునే రోజుల్లో అతని గురువుగారైన సాంబమూర్తిగారి జీవితం అతడి మీద మంచి ప్రభావం కలుగజేసింది. సాంబమూర్తిగారు క్లాసులోనికి రాగానే విద్యార్థులంతా వినయపూర్వకంగా నుంచోడం, ప్రేమతో, దయ తొణికిసలాడే మాటల్లో విద్యార్థుల్ని పలకరించడం, పాఠం, మొదలెట్టినదగ్గరనుంచి చివరవరకు అందరికీ అర్థమవుతున్నదో లేదో చూసుకుంటూ బోధించడం, విద్యార్థులకు ఏకష్టం కలిగినా ముందు మూర్తిగారి దగ్గరకు వెళ్లి విన్నవించుకోవడం ఇత్యాది రసవత్తరమయిన ఘట్టాలనేకం ఈనాటికీ మధుకు గుర్తున్నాయి. అమాయకులయిన విద్యార్థులనుండి వచ్చే నిష్కళంకమైన ప్రేమ, భక్తి, విశ్వాసాలు స్వీకరించి వారి పురోభివృద్ధికి తోడ్పడంలో ఉన్న ఆనందం మరి ఇంకే ఉద్యోగం చేసినా ఉండదని నిర్ణయించుకున్నాడు. ఆవృత్తిలో ఉండే విశ్రాంతి జ్ఞానాభివృద్ధికి తోడ్పడే అవకాశాలు, స్వాతంత్ర్యము అతడ్ని ఆవృత్తింలోనికి ఆహ్వానించాయి. ఏదో కొద్దిగా ఉన్నకుటుంబంలోనుంచివచ్చినవాడవటంవల్ల పెద్దగా సంపాదించాల్సిన

(22-వ పేజీ చూడండి)



# వ్యాఖ్యలు, విమర్శలు

(2-వ పేజీ తరువాయి)

దలూ ప్రజాస్వామ్యంలో కూడా తప్పవు. నేటి పరిస్థితుల్ని బట్టి మన దేశం పేదదేశం అనిపించుకుంటున్నా నిజానికిది పేద దేశం కాదు. పూర్వపాలకుల అశ్రద్ధవల్ల అనేక ప్రాంతాలు రాళ్లగుట్టలుగా ఎడార్లుగా మారిపోయినా మన దేశం పచ్చని దేశం. అందువల్లనే వచ్చిన విదేశీయులు కూడా ముగ్ధులైనారు. చక్కని భవనాలని నిర్మించారు. కోటలూ నిర్మించారు. స్వాతంత్ర్యలబ్ధితో కోటలు ప్రజాస్వామ్య కోటలైనాయి. రాజ భవనాలు ప్రజారాజ్య తంత్రానికి ప్రతిబింబాలైనాయి. ఢిల్లీలో వైస్రాయి లాడ్జి రాష్ట్రపతి భవనంగా మారింది. కొత్త ఎసెంబ్లీహాల్ మొదట రాజ్యాంగ భవనంగానూ ఇప్పుడు పార్లమెంట్ భవనంగానూ మారింది.

రాష్ట్ర ముఖ్యపట్టణాల్లో ఒక్క కలకత్తాలో తప్ప సరైన ప్రభుత్వ కార్యాలయాలే లేవని చెప్పాలి. ఎందుకో ఎప్పుడో కట్టిన భవనాలూ, కోటలూ కార్యాలయాలైనాయి. కొత్త అవసరాలకి తగినట్లు కొత్త భవనాలు నిర్మించుకునే తాహతు లేదు.

శాసనసభకోసం కొత్తభవనాన్ని నిర్మించుకున్న రాష్ట్రాల్లో మద్రాసు మొదటిది. ఒరిస్సా, అస్సాం రాష్ట్రాలలో నిర్మాణం ఇంకా సాగుతోంది.

చెన్నపట్నంలో మౌంట్ రోడ్ ప్రభుత్వభవనం ఆవరణలో దక్షిణాన నిర్మించబడిన కొత్త శాసనసభా భవనం పెద్దదే. అయితే సౌకర్యాలన్నీ ఇంకా ఏర్పాటు కాలేదనే చెప్పాలి. శాసన సభ్యుల హాస్టల్‌కి సమీపంలోనే కొత్త శాసనసభా భవనం ఉంది కాని శాసనసభా కార్యాలయానికి జాగా లేదుట. మొదట అనుకున్న ఖర్చుకంటె ఎక్కువే అయినప్పటికీ నిర్మాణం చురుగ్గా జరిగింది. ఇంత చురుగ్గా ఆస్పత్రులూ ప్రాజెక్టులూ నిర్మించబడితే బాగుండుననిపిస్తుంది.

## హైదరాబాద్ విశ్వ విద్యాలయం

హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని కేంద్రప్రభుత్వం అధీన



తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నికైన డా॥ సుబ్బరాయన్

పర్చుకోడానికి నిర్ణయించింది. కాశీ, అలీఘర్, ఢిల్లీ విశ్వవిద్యాలయాల మాదిరిగానే దీన్ని కూడా భారతప్రభుత్వం నిర్వహిస్తుందిట. కళాశాలల్లో కూడా హిందీ భాషద్వారా విద్యాబోధ గరపుతారట.

హిందీభాషని జాతీయ భాషగా పెం

పొందించాలంటే నిజానికి ప్రస్తుతం జరుగుతున్న కృషి చాలదు. అన్యభాషా ప్రాంతాలవారి సహకారాన్ని ప్రభుత్వమూ హిందీ భాషోద్ధారకులూ కూడా సంపాదించుకోవాలి. అందరి సహకారంతోనూ పరిశోధన జరిపి ఆధునిక విజ్ఞాన శాస్త్రాభివృద్ధి కవసరమైనంతగా వృద్ధిచెయ్యాలి ఇందుకు అన్ని విశ్వవిద్యాలయాల తోడ్పాటూ, విజ్ఞానశాస్త్రాలకు సంబంధించిన సంస్థల తోడ్పాటూ అవసరం.

హైదరాబాద్‌లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆధునిక శాస్త్రగ్రంథాల్నీ ఉత్తమసాహిత్య గ్రంథాల్నీ ఉర్దూ భాషలోకి అనువదించి ప్రచురించడానికీ, ఆ గ్రంథాలసహాయంతో ఉన్నత విద్యను ఉర్దూలో బోధించడానికీ విశేష కృషి జరిగింది. హైదరాబాద్ ప్రభుత్వం దీనికోసం అపారంగా ధనం వ్యయం చేసింది. వ్యయానికి తగిన ఫలితం లభించ లేదని అసంతృప్తిచెందినవారు లేకపోలేదు. అయితే ఇటువంటి ఉద్యమం సఫలం కావాలంటే ఇంతకంటె విశేషకృషి, సర్వ వర్గాలవారి తోడ్పాటూ, ఓపికా అవసరం. ఫలితాలు గోచరించడానికి వ్యవధిపట్టుతుంది.

ఇప్పుడు ఉర్దూలో చేసిన కృషిని వినియోగించి హిందీ హిందూస్తానీభాషల ద్వారా ఉన్నతవిద్యా బోధనకు కృషి చెయ్యాలని కేంద్ర ప్రభుత్వ సంకల్పం. జాతీయభాషాభివృద్ధి పట్ల అభిమానంకలవారందరికీ ఇది సంతోషించదగిన విషయం.

కేంద్రప్రభుత్వం తలపెట్టిన కార్యక్రమ వివరాలింకా పూర్తిగా తెలియవు. అయితే ఈ సందర్భంలో ఒక్క మాట మాత్రం చెప్పవలసివుంటుంది. సామ్రాజ్య పరిపాలనలోనే తప్ప ప్రజాస్వామ్యవ్యవస్థలో ఒక భాష అభివృద్ధి మరొక భాష అభివృద్ధికి నిరోధం కాదు. భాషలన్నీ సమానంగా అభివృద్ధిచెందకపోయినా ఒక భాష అభివృద్ధి మరొకభాష అభివృద్ధికి తోడ్పడుతుంది. ప్రాంతీయ భాషల అభివృద్ధివల్ల జాతీయభాష అభివృద్ధికి ఆటంకం కలగదు. అయితే ప్రాంతీయభాషలు అభివృద్ధిచెందనిపక్షంలో ప్రజాస్వామ్య వ్యవస్థ మూలసూత్రాలకే భంగం వాటిల్లుతుందనే మాటను మరిచిపోకూడదు. అందువల్ల జాతీయభాష అభివృద్ధికి పరిశోధనకు ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని వినియోగించుకున్నప్పటికీ ప్రాంతీయ భాషల అభివృద్ధిపట్లకూడా కేంద్ర ప్రభుత్వం సమానమైన శ్రద్ధవహించవలసి ఉంటుంది. ఆంధ్ర, మద్రాసు విశ్వవిద్యాలయాలలో తెలుగు తమిళభాషల పట్ల ఎంత శ్రద్ధచూపబడుతున్నదో కనీసం ఆపాటైనా తెలుగుభాష పట్ల ఉస్మానియావిశ్వవిద్యాలయం శ్రద్ధవహించవలసి ఉంటుంది. హిందీలో విద్యాబోధనకు అవసరమైన పరిశోధన ప్రయోగాలతోపాటు తెలుగులోకూడా సమానమైన కృషి జరగాలి ఇట్టివిషయాలలో అశ్రద్ధజరిగినట్లయితే ప్రాంతీయాభిమానాలు, వైషమ్యాలు ఎలా పెచ్చుపెరుగుతాయో చెన్నపట్నం ఉదాహరణగా చూపవచ్చును

జాతీయభాషోద్యమం అన్యరాష్ట్రాలపై ఆధిక్యత వార్జించుకోడానికి జరగడం లేదని ప్రజలకు తెలియకపోదు. అయినప్పటికీ ఆయాప్రాంతాల అవసరాలపట్ల అశ్రద్ధవహించడంవల్ల ఎట్టి అనుమానాలకు తావిస్తుందో తమిళనాడులో హిందీ ప్రతికూలోద్యమం తార్కాణం. ఈవిషయాన్ని గుర్తుంచుకునే కేంద్రప్రభుత్వం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో హిందితోపాటు ప్రాంతీయ భాషాభివృద్ధికి కూడా సమానావకాశాలు కల్పించడం అవసరం.

## గుంటూరులో నీటి కరువు

మద్రాసు రెవిన్యూమంత్రి శ్రీ మాణిక్యవేలు నాయకర్ గారు గుంటూరు జిల్లా మెట్టతాలూకాలు పర్యటనచేసి, గుంటూరు పట్టణం దర్శించి వచ్చారు. గుంటూరులో నీటి కరువుబాధ చెన్నపట్నంలో కూడా అధికంగా ఉందన్నారు. రాయలసీమలో మాదిరిగానే గుంటూరు మెట్టతాలూకాల్లో నీటికరువు అధికంగా ఉందన్నారు. స్వయంగా మంత్రిగారు చూసి చెప్పారు కాబట్టి సరిపోయింది కాని లేకపోతే గుంటూరులో నీటికరువని అనే వాళ్ళని పట్టుకుని 'తెలుగువారి కెప్పుడూ ఉండే గుణమే' నని తోసిపారేసేవారు. చెన్నపట్నంలో అయితే నీటికరువు అపురూపంగా కనపడుతోంది కాని గుంటూరులో నీటి కరువు కొత్త కాదు—కనిపెట్టే నాథుడు లేకపోయాడంతే తేడా. కృష్ణాతీర ప్రాంతాల సంగతి రాయలసీమ సంగతీ సవ్యంగా పరిశీలన చేసి తరవాతనే చెన్నపట్నం సంగతి ఆలోచించండి అంటే ఆ మాటని ప్రాంతీయ దురభిమానమని తోసిపారేస్తున్నారు. పాలార్ నదిలో పొరల్లో నీరు అపారంగా దొరుకుతుందని ఇంజనీర్లే చెప్తున్నారు. అక్కడనించి చెన్నపట్నానికి నీరు తీసుకువచ్చే విషయమై పరిశీలనైనా జరపకుండా కృష్ణానది నీరే కావాలనడం సబబుకాదు. మద్రాసు సమష్టి రాష్ట్రంగా ఉన్నన్నాళ్ళయినా అనుమానాలకు తావివ్వకుండా జాగ్రత్తపడ్డం ప్రభుత్వ కర్తవ్యం. మద్రాసు కార్పొరేషన్ చేత పదిసార్లు తీర్మానాలు చేయించి కృష్ణా - పెన్నా ప్రాజెక్టును సాధించినంతమాత్రంతో ప్రభుత్వం తన బాధ్యత తీర్చుకోలేదు. రాష్ట్రంలో ఉభయ ప్రాంతాలవారి మధ్యనూ సానుభూతి సహకారాలను సాధించాలంటే, పరస్పరానుమానాలను నివృత్తి చేయాలంటే అనధికార సంస్థలూ, అధికార సంస్థలూ ముఖ్యంగా ప్రభుత్వమూ విశేష జాగ్రత్త వహించడం అవసరం అవహేళనల వల్లనూ, అశ్రద్ధవల్లనూ నాయకుల ఘనత అతిశయించదు. వక్రోక్తులూ లౌక్యపు ప్రసంగాలకంటె యథార్థవాదమూ సానుభూతి సహకారాలూ ఇప్పుడెక్కువ అవసరం. ★

## రచయితలకు మనవి

రచయితలు తమ రచనలను సిరాతో కాగితానికి ఒకే వైపున వ్రాసి పంపవలెనని మనవి. తమ రచనలను త్రిప్పి పంపగోరువారు, మూడు కాన్ల స్టాంపులను రచనలతోనే చేర్చి పంపవలెనని కోరుతున్నాము. అలా స్టాంపులను రచనలతో చేర్చి పంపనిచో త్రిప్పిపంపుట సాధ్యముకాదు.

కొంతమంది తమ రచనలను ఏ కారణములవల్ల ప్రచురించ లేదో ప్రశ్నిస్తూ లేఖలు వ్రాస్తున్నారు. అట్టి కారణాలను వివరించుట సాధ్యముకాదని రచయితలు గుర్తింపవలెనని ప్రార్థిస్తున్నాము.

—సంపాదకుడు.

# అగుపించని అంకురాలు

(గతసంచిక తరువాయి)

సెల పూర్తి కానిదే ఆఫీసునించి ఒక్క చిల్లిగవ్వైనా రాదని తెలుసుండి గూడా కృష్ణ మెల్లగా మేనేజరుతో తన సంగతంతా చెప్పుకొని, అంతవరకు ఒక పది రూపాయలు యిమ్మని వేడుకొన్నాడు. అక్కడా లాభం లేకపోయింది. ఇన్ని దినాల ముఖపరిచయమున్నప్పటికీ ఆఫీసర్ కి తనకీ స్నేహం ఏర్పడలేదు. ఆ అధికారాలు పైన వున్నంతవరకు స్నేహ భావమనేది పూజ్యమే నేమో!

సాయంకాలం వరకు అలానే పని చేశాడు. విడుకొట్టిన తర్వాత ఎవరిమటుకి వాళ్ళు లేచి వెళ్ళిపోతున్నారు. కృష్ణకి లేవడానికి బుద్ధి పుట్టలేదు. లేచి తిన్నగా యింటికి వెళ్ళడం తను అక్కడ ఏ స్వర్గాన్ని ఆశించి? ఏ ముంది ఆ యింట్లో? ఎప్పుడూ వాళ్ళకి కనిపించకండా యిక్కడే వుండిపోతే?

లాభం లేదు. ఇది ఆఫీసేగాని యిల్లు కాదు. ఇక్కడ మతి పోగొట్టుకోడానికే గాని, మతి స్థిరపరచుకోడానికి కాదు. లేచి చుట్టూ చూశాడు పక్కనున్న లైపిస్టు యింటికి వెళ్ళిపోడానికి సిద్ధపడుతున్నాడు. ఏమనుకొన్నాడో కృష్ణ ఛప్పున లేచి అతన్ని గట్టిగా పట్టుకొని—

"మూర్తి, బ్రదర్ ఒక పది వుంటె అప్పియ్యవోయ్. నీకు త్వరలోనే యిచ్చేస్తాను. ప్లీజ్ యింట్లో చాల యిబ్బందిగా వుంది." అన్నాడు.

మూర్తి కృష్ణకేసి ఎగాదిగా చూసి, జేబీలోంచి ఒక కాగితాన్ని తీసిచ్చాడు.

"ఇంతకు మించి నా దగ్గర ఎక్కువ లేదు కృష్ణ"

కృష్ణ నోటుకేసి చూసుకొన్నాడు. ఒక రూపాయ నోటు. ఎందుకు పనికొస్తుంది? ఓవల్టిన్ డబ్బా వస్తుందా? నాలుగు రోజులు బలమైన ఆహారానికి వస్తుందా? ఐనప్పటికీ మూర్తి మాట తీసెయ్యకండా సమయానికి సహాయం చేయగలిగినందుకు అస్పష్టంగా అభినందనాలు చేసి యింటిదారి పట్టాడు.

దార్లో శాంతగురించి ఎన్నో వూహించుకొన్నాడు. తనని చూడగానే ఎదురుగా వస్తుందనుకొన్నాడు. చిరునవ్వుతో ఛప్పున లేచి లోపలికి వెళ్ళిపోతుందనుకొన్నాడు. కాని అవేం జరగలేదు. అసలు అరుగుమీద శాంతే అగుపించలేదు.

బతికాననుకొని లోపలికి వెళ్ళి కుర్చీలో కూలబడ్డాడు.

అత్తగారు రోజూ చేస్తున్న ఒత్తిడివల్ల శాంత ఈవాళ ఏమైనా సరె ఆయన వచ్చీ రాగానే మొట్టమొదట తన ఓవల్టిన్ను డబ్బాల గురించి గట్టిగా అడగాలని నిశ్చయించుకుంది. అరుగుమీద చెప్పులచప్పుడు వినిపించగానే తరుగుతున్న కూర విడిచిపెట్టి వన్యగదిలోకి వచ్చింది తలపట్టుకొని వున్న భర్తని చూసేసరికి మరి ఆ నిశ్చయం ఏమయిందో దీనంగా ఒక్క నిట్టూర్పు విడిచి వూరుకొంది. కాని లోపలనించి అంతర్వాణి గోలపెడుతూనే వుంది. చివరికి మెల్లగా దగ్గరకి వచ్చి వినీ వినిపించనట్టు అంది.

"ఓవల్టిన్ తెచ్చారా?"

తనని ఎవరో అంకుశంతో పొడిచి జ్ఞాపకం చేసినట్టు ఉలుక్కుపడి తలెత్తి ద్వారం వేపు చూశాడు కృష్ణ. ఆ చూపు ఎంతోసేపు ఆ వ్యక్తి మీద నిలవలేదు. సిగ్గుపడుతూ సమాధానంగా తల అడ్డగా తిప్పాడు.

దిగజారిపోతున్న ధైర్యం, గింగురుమంటున్న అత్తగారి మాటలు ఈ ఒక్క వ్యతిరేక సమాధానంతో ఆగి ఛప్పున వెనక్కి తిరిగాయి. గట్టిగా "ఏం?" అంటూ అరచింది, తన అధికారాన్ని వినియోగించుకొంటున్నట్టు.

శరీరమంతా భూమిలోకి కూరుకుపోతున్నట్టనిపించింది కృష్ణకి.

ఆ ఉద్వేగంలో శాంత తనని తాను సంబాళించుకోలేక పోయిరది. "అత్తగారన్నట్టు నేను చచ్చిన తర్వాతగాని మీరు నా వేపు చూడరు."

వంటిమీద తుమ్మరువ్వలు ఛళ్ళుమన్నంత బాధపడ్డాడు కృష్ణ-ఈ మాటలతో. ఈ బాధ ఒక విచిత్రమైన ఉక్రోషంగా మారిపోయింది. తన చుట్టూ వెక్కిరించేటట్టు తిరిగే ధనవంతులందరి మీగా చెప్పలేనంత కసి కోపం కలిగాయి. ఆ ఉద్వేగం ఎదురుగా వున్న శాంత రూపం మీదికి మనో దుర్బలతగా ప్రసరించింది. బుస బుస కొడుతూ శాంతకేసి చూశాడు.

"నాన్న పంపే డబ్బుని గూడ నాకు తినేందుకు హక్కు లేదు." అందిశాంత తన కడుపు మంటకొద్దీ, చీరకొంగుతో కళ్లు తుడుచుకొంటూ.

"మీ నాన్న పంపించేది నేనా తిన్నాను?" కటువుగా అరచాడు.

ఆ అరుపుల్ని విని సుందరమ్మ గబగబ అక్కడికి వచ్చింది.

కాని శాంత, "అవును తప్పకండా ముమ్మాటికీ" అనే మాటల్ని విసరడం, కృష్ణ ఆ ఉద్రేకంలో లాగి చెంపమీద కొట్టడం, ఆమె రాక నిష్ఫలమే ఐంది.

శాంత కళ్ళనీళ్లు తిరిగిపోయాయి. ఏడవడానికైనా శక్తిలేక అత్తచేల్లో వాలి, ఆమెని ఆనుకొని లోపలికి వెళ్లిపోయింది.

ఆ ఉద్రేకంలో, తాను చేసిన పని ఎంత నీచాతి నీచమైనదో కృష్ణ ఊహించుకోలేకపోయాడు. అంత మొరటుగా ప్రవర్తిస్తాడని గూడ వూహించలేకపోయాడు. వెళ్లిపోతున్న శాంతికేసి చూశాడుగాని ఆ దృష్టిలో చిట్టచీకటి తప్పించి మరేదీ కనిపించలేదు.

చాలా సేపటికిగాని ఈ స్థితినించి కోలుకోలేక పోయాడు. కోలుకొన్న తర్వాత శరీరమంతా ముచ్చెమటలు పట్టి కంపించిపోతోంది.

"శా-ం-తా"

రెండక్షరాలు, మధురంగా, సౌందర్యంగా, సుకుమారంగా ప్రతిధ్వనించవలసిన పొడి అక్షరాలు! కాని అవి విడివిడిగా గొంతు ముడికిందే అంతరించిపోయాయి. స్వరభావం స్ఫురించేటట్టు పెదవు లస్పష్టంగా కదిలాయి.

ఒక అడుగు ఛప్పున అప్రయత్నంగా ముందుకు పడింది-శాంతని క్షమించమని వేడుకోవాలని. కాని తను ఒక్క క్షణం క్రితం చేసిన పని జ్ఞాపకం రాగానే సిగ్గుతో కృంగిపోయాడు.

రాత్రంతా కళ్లకి కునుకు లేదు. ప్రతీ క్షణం శాంతే కళ్ళనీళ్లు తుడుచుకొంటూ

(13-వ పేజీ చూడండి)

సీరియల్ నవల

# రెండు మహానగరాలు

చార్లెస్ డికెన్స్

టెల్సన్సు బ్యాంకు శత వృద్ధుల్లో ఒకాయన జ్రరీవంక చూసి!

'ఓల్డు బెయిలీకోర్టు తెలుసుగా' అన్నాడు.

'తెలుసు సర్!—ఓల్డు బెయిలీ తెలీక పోడమేంటీ?' అన్నాడు జ్రరీ.

'అవును అదే—లారీగారు తెలుసుగా?'

'ఓర్నీ—లారీగారు తెలీకపోడ మేంటుండీ?—అల్లరిపిల్ల రోణ్ణిగాను గనక కోర్టు సంగతి తెల్సుకోవాల్సిన గతి నాకేంటి గానీండీ—లారీగార్ని మాత్రం కోర్టుకంటే బాగా ఎరుగుదును'

'భేష్! బాగుంది—కోర్టుకెళ్లి, సాక్షుల్ని లోపలికి పంపించే దరవాజాదగ్గిర ఈ చీటీ చూపించు; నిన్ను లోపలికి పంపిస్తారు'—

'ఆరిదేవుఁడా—నేను కోర్టు కెందుకుండీ?'

'వెళ్లాలి'—

జ్రరీ కనుబొమలు రెండూ దగ్గిరికి ముడుచుకున్నయ్. సందేహంగా ఆ వృద్ధుడి ముఖంలోకి చూస్తూ:

'నేను కోర్టు కెల్లాల్సిన అవసరమేంటీ అని?'

'చెబుతున్నాగా—నువ్వు గనక చీటీ కోర్టు గేటులోవున్న దర్వానుకు చూపిస్తే, అతను లోపలికి తీసుకుపోయి, లారీగారికి అందజేస్తాడు. నువ్వు లోపలికివెళ్లి యేమూలో ఓమూల నిల్చునుండు. లారీగారు తలెత్తి చూసినప్పుడు, ఆయనకు కనుపించేలాగు తల ఊపి సౌజ్ఞచెయ్యి; నువ్వు అక్కడున్నట్టు ఆయనకు తెలుస్తుంది. అంతకంటే నువ్వింకేమీ చెయ్యక్కర్లేదు. ఆయన నిన్ను పిల్చేదాకా అక్కడే నిల్చో.'

'ఓస్! ఇంతేగిందా?—ఏవిఁటో ననుకుండానూ!'

'ఎబ్బే మరేంలేదు—ఆయన యెవర్నైనా నౌకర్ని పంపించ మన్నారు. నువ్వక్కడున్నట్టు ఆయనకు తెలిస్తే చాలు!

ఆ వృద్ధ పితామహుడు చీటి వ్రాస్తున్నంతసేపూ, ఆయన వంక చూస్తూ మాట్లాడకుండా అలానే నిల్చున్నాడు, జ్రరీ. ఆయన వ్రాత ముగించి అద్దుడు కాయితం దళకు వచ్చేసరికి:

'ఇయ్యాళ ఘోర్ఘరీ నేరాలు ఇచారిస్తా వుండారా సర్?' అని అడిగాడు.

'రాజద్రోహాలు'

'ఉరిశిక్ష కేసులన్నమాట; దర్మవోఁ అదర్మవోఁ అదేందో గానీండీ—మడుసుల్ని ఉరిదియ్యటంమాత్రం అడివి మడుసులు శెయ్యాల్సిన గోరం సర్!'—

'అరె! అలా అనగూడదు'—ఆముసలి ఉద్యోగి కళ్ళజోడు నుదురుమీదకు తోసి జ్రరీవంక ఆశ్చర్యంగా చూస్తూ: 'న్యాయశాసనమంటే యేవిఁటిమరి?'—

'నాయవోఁ అద్దాన్నవోఁ గానీండి మడుసుల్ని చీకటి కొట్లలో పారనూకి ఊపిరాడకుండా శెయ్యటం, మెళ్లకు ఉర్లుబోసి పాణాలు దీసెయ్యడం ఇసవంటివన్నీ శానా పాడుపన్లు సర్!'—

'అలా అనగూడదు—న్యాయశాసనాలను గురించి మర్యాదగా మాట్లాడటం నేర్చుకో—ఇదుగో నీకో మంచిసలహా యిస్తా విను—శాసనాల మంచి చెడుగుల సంగతి మనం ఎప్పుడూ యెత్తుకోగూడదు. అవన్నీ పైవాళ్లు చూసుకోవలసిన సంగతులు—మన కెందుకొచ్చిన గొడవ? మన పొట్ట తిప్పలు మనం చూసుకోవాలి గాని, ఈ న్యాయాన్యాయాల గొడవలు మన కెందుకు?'

'పొట్ట తిప్పలేంది సర్! శెవఁటోడ్చి సంపాదించుకుంటుండా గాని, యెవుణ్ణేనా అక్రమంజేసి బతుకుతా వుండానా?'

'బ్రతుకు తెరువుకు మంచి చెడుగు లేవిఁటి?—అక్రమాలూ వుంటై, సక్రమాలూ వుంటై—ఇదుగో! చీటీ తీసుకో—వెళ్లిరా.'

జ్రరీ ఉత్తరం మడిచి జేబులో పెట్టుకున్నాడు. గేటుదగ్గిర కూర్చున్న కుమారుడితో తను కోర్టు కెడుతున్నానని చెప్పి వెళ్లిపోయాడు.

ఆ రోజుల్లో, టైబరన్‌లో ఉర్లు దీస్తున్నారు. అందుచేత "న్యూగేట్" ఖైదు అప్పటికింకా అంత దుష్కీర్తి కెక్కలేదు. కాని ఆ జైళ్ళలో వ్యభిచారం వగైరా, కిరాతాలన్నీ విచ్చలవిడిగా సాగిపోతూ వుండేవి. ఖైదీలవెంట లోపలికొచ్చిన అంటు వ్యాధులతో జైళ్లు మురుగెత్తిపోతూ వుండేవి. ఒకొక్కప్పుడు ఆ మహావ్యాధులు బోనులోనుంచి యెకాయెకి ప్రధాన న్యాయమూర్తిమీదికే యెగిరి ఆయన్ను న్యాయపీఠంమీదనుంచి పడలాగి హతమార్చేసేవి. ఒకసారి ఇలానే జరిగింది. ఒక ముద్దాయిని విచారిస్తూవుండగా జడ్జీ ఆ ముద్దాయిని మరణశిక్ష విధించి హతమార్చేలోగా, తనకు తానే హతమారిపోయాడు. ఇదిగాక ఓల్డు బెయిలీకి మరో ప్రఖ్యాతి కూడా వుంది. అదో మృత్యుసత్రం; ఊర్ధ్వలోకానికి ప్రయాణం చెయ్యవలసివున్న అనేకమంది హతభాగ్యులు ఆ గేట్లోనుంచి నిరంతరం బయటికి వస్తూవుండేవాళ్ళు. వాళ్ళు ఆ గేటులోనుంచి బయలుదేరి, ఒక రెండున్నర మైళ్ళ దుర్భర ప్రయాణం చేస్తే ఊర్ధ్వలోకానికి యెగిరిపోయే కేంద్రానికి (ఉరిదీసే స్థలం—టైబరన్) చేరేవాళ్ళు. ఓల్డు బెయిలీ కీర్తి మిన్నుముట్టడానికి ఇంకా అనేక కారణాలున్నయ్. మానవత్వసిద్ధికి తార్కాణాలుగా, విజ్ఞానవేత్తలయిన మహామహులు ప్రతిష్ఠించిన కొన్ని మహావ్యవస్థలు అక్కడ నిరంతరాయంగా పనిచేస్తూ వుండేవి—కొరతలు, దెబ్బలశిక్షల ముక్కాకాలూ, ఇత్యాదయః. వీటిని జూసి ప్రజలు సౌజన్యతను అలవరుచుకుంటేవాళ్లు.

అలాంటి వన్నీ ఆ పుణ్యక్షేత్రంలో వున్నయ్. వాటి నన్ని

అనువాదం: తెన్నేటి సూరి

టినీ ఉత్తమమైన వ్యవస్థలుగానే మనం పరిగణించాలి. ఉత్తమమైనవి కాకపోతే ఎందుకుంటై.

ఈ భీభత్స వ్యవస్థల మధ్యనుంచి జనాన్ని మోచేతుల్తో నెట్టుకుని దోవ జేసుకుంటూ జగ్రీ సాక్షుల దరవాజా దగ్గిరికి జేరుకున్నాడు. తలుపుకు ప్రత్యేకంగా యేర్పాటు చేసివున్న కన్నంలో నుంచి చీటీ లోపల ప్రక్క కూర్చునున్న దర్వానుకు అందించాడు. పిచ్చాసుపత్రి చూడ్డానికి వెళ్లిన వాళ్దగ్గిర డబ్బులు వసూలు చేసినట్టే, ఆరోజుల్లో ఓల్డుబెయిలీ కోర్టు చూడ్డానికి వెళ్లిన వాళ్లదగ్గిర కూడా టికెట్టు డబ్బులు వసూలు చేసేవాళ్లు— అయితే పిచ్చాసుపత్రి దగ్గిర కంటే, ఎక్కువ రేటు వసూలు చేసేవాళ్లు. అందుచేత కోర్టుచుట్టూ వున్న తలుపులన్నీ భద్రంగా మూసి వుండేవి.

దరవాజా ముందు నిల్చుని కునికిపాట్లు పడగాపడగా, ఓ ఝాముకు, తలుపులు, అమిత అయిష్టంగా, అలా కొస్త ఓరు వాకిలిగా తెరుచుకున్నయ్. ఆసందులో నుంచి జగ్రీ లోపలికి వెళ్లి, ఒకమూలగా నిల్చున్నాడు. ఆమూల అతనితో పాటు చాలా మంది జనం నిల్చునున్నారు. ప్రక్కనున్న మనిషిని మోచేత్తో పొడిచి స్ఫురితుణ్ణిచేసి: 'ఏవి జరుగుతోంది?' అని అడిగాడు.

'ఇంకా విచారణేదీ ప్రారంభం కాలేదు'—

'ఇప్పుడు ఇచారించాల్సిన కేసేంది?'

'రాజద్రోహం'

'ఉరిశిక్ష కేసేనన్న మాట'

'ఆ! ఉరిశిక్షకేసే—ముందు ముద్దాయిని జోనులోకి లాగి సగానికి ప్రాణాలు తీస్తారు—తరవాత విచారణలో లోపల గుండెల్లో వుండే కండరాల నన్నిటినీ బయటికి లాగి ముప్పాతిక చంపుతారు—అనంతరం సాంతం తల గొట్టేస్తారు.

'నేరం రుజూ అయినట్టు జడ్జీ నమ్మితే గందా?'

'నమ్మ తీరతారు తమ్ముడూ—నీకా అనుమానం అక్కర్లేదు.'

దరవాజా దగ్గిర కాపలావున్న మనిషి తానిచ్చిన చీటీ పుచ్చుకు లారీ కూర్చున్నచోటికు వెడుతూ వుండటం జగ్రీ గమనించాడు. ప్రక్కనున్న మనిషితో ప్రసంగం మానేసి తాను కూడా అటువైపు చూస్తున్నాడు. లారీ, విగ్గులు పెట్టుకున్న పెద్ద మనుషుల వరసలో కూర్చునున్నాడు. ఆయన ప్రక్కనే ముద్దాయి తరఫు వకీలు నిల్చునున్నారు. ఆయనముందు ఒక బండెడు కాయితాలు బల్లమీద దొంతర్లు దొంతర్లుగా పేర్చివున్నయ్. ముద్దాయి వకీలుకు ఎదురుగా ఎదటి వరసలో మరో విగ్గుమనిషి కూర్చునున్నాడు. ఆయన ఈ కోర్టుహాల్లో జరిగే వ్యవహారాలలో ఏవిమైన సంబంధమూ లేనివాడులాగు ఎత్తిన తల దించకుండా పైకప్పు వంక చూస్తున్నాడు. చీటీ చూసుకోగానే, లారీ లేచి నిల్చుని జగ్రీ యెక్కడున్నదీ తెలుసుకోవటానికి నాలుగువైపులా పరకాయించి చూస్తున్నాడు. అది గమనించి జగ్రీ జనంలోనుంచి కొస్త ముందుకొచ్చి ఒక చిన్న పొడిదగ్గు దగ్గాడు—రెండు మూడుమార్లు గడ్డం సవరించుకున్నాడు—చెయ్యి ఊపి సంజ్ఞ చేశాడు. ఇలా నానా తంటాలూ పడి తానక్కడున్నాననే విషయాన్ని లారీకి తెలియజేశాడు. లారీ జగ్రీవంక జూసి, సరే నన్నట్టు తలపంకించి మళ్లా కూర్చున్నాడు.

ఇందాకటినుంచీ, జగ్రీతో బాతాఖానీ వేస్తున్న మనిషి మళ్ళీ ఉపక్రమించాడు:

'ఆయనకి ఈ కేసుతో సంబంధం యేవిఁటి?'—

'తెలీదు బాబా!'

'నీకూ?'—

'అంతకంటే తెలీదు'—

జడ్జీగారు లోపలికొచ్చి తక్తుమీద కెక్కారు. ఆయన రావటంతోనే కోర్టులోవున్న వాళ్లంతా పెద్ద సంచలనంగా లేచి నిల్చున్నారు. ఆయన కూర్చోగానే మళ్ళీ యెక్కడి వాళ్లక్కడ సర్దుకు కూర్చున్నారు.

మరుక్షణంలో కోర్టులోవున్న యావన్మంది దృష్టులూ బోనులోకి ఎక్కిన ముద్దాయివైపు ప్రసరించినై.

పైకప్పు వంకచూస్తూన్న ఆవిగ్గు పెద్దమనిషి ఒక్కడు మినహా అంతా అటే చూస్తున్నారు. జనంవిడుస్తున్న నిశ్వాసాలన్నీ గాలిలో కలిసి అగ్నిజ్వాలల్లా అతని వేపే వ్యాపించుతున్నయ్. స్తంభాలు దగ్గిరా అడ్డున్న వ్యక్తులు ప్రక్కకు వంగి తొంగి చూస్తున్నారు. వెనక బెంచీలమీద కూర్చునున్న వాళ్ళు ముందున్న వాళ్ల తలలు అడ్డొచ్చి లేచి నిల్చుంటున్నారు. నేలమీద కూర్చున్న వాళ్ళలో వెనకున్న వాళ్ళు ముందున్న వాళ్ళ భుజాలు బలవంతాన వంచి మరీ చూస్తున్నారు. ఈ జనసమూహంలో జర్రీతల, గసికెలు దిగేసిన న్యూగేట్ ప్రహరీగోడలా విచిత్రంగా కనుపించుతోంది. తాను వస్తూ వస్తూ త్రోవలో త్రాగివచ్చిన బీరు సుగంధాన్ని ముద్దాయి మీదికి వదులుతూ అతనివంక రెప్పవాల్చకుండా చూస్తున్నాడు.

బోనులోవున్న ముద్దాయి ఇరవై సంవత్సరాల వయసులో వున్న యువకుడు. బలిష్ఠమైన శరీరం, అందమైన విగ్రహం. ఎండకు గోధుమ వర్ణంగా తిరిగినను నున్నైన చెక్కిళ్ళు కొట్టొచ్చినట్టున్న మిలమిలలాడే నల్లటికళ్లు. మామూలు సాదాదుస్తులు నల్లటివి తొడుక్కున్నాడు. బాగా పెరిగి వుంగరాలు తిరిగిన క్రాఫింగ్ జుట్టు రిబ్బనుతో వెనక్కు బిగించివుంది. ఆరిబ్బను, జుట్టు ముఖం మీదికి పడకుండా వుండటానికి కట్టిన దానవుగాని, అలంకారానికి కట్టిందిగాదు. ముఖంచూస్తే మనిషి సంగతి తెలుస్తుందంటారు. అతని ఆత్మ విశ్వాసం, సూర్యుని ప్రతిభకంటే బలీయమైనదిగా, గోధుమ వర్ణానికి తిరిగిన అతని చెక్కిళ్ళమీద ద్యోతమానమౌతోంది. మిన్ను విరిగి పైనబడ్డా చలించని ఆత్మవిశ్వాసం, గాంభీర్యం—అదీ అతని మూర్తి. తలవంచి జడ్జీకి నమస్కరించి మౌనంగా బోనులో నిల్చునున్నాడు.

ఆ జనం అతనివంక అలా చూడటంలో గల ఔత్సుక్య

ఏమిటి? మానవత్వపు ఔదార్యమా? అలాంటి ఘోరమైన శిక్షకు పాత్రుడు కాబోతున్నాడన్న సంగతి లేకపోతే అతనివంక ఎవరైనా చూసేవారా? ఘోరమైన యాతనా మరణాన్ని పొందబోతున్న వ్యక్తి కావటంచేతనే, అందరికీ అతన్ని చూడాలనే ఔత్సుక్యం. కసాయితనంగా అతన్ని నరకబోతున్నారనేదే వర్త. అత్యవంచకులైన వాళ్లు ఈ ఔత్సుక్యానికి యేదైనా పెద్ద పేరు పెడితే పెడతారుగాక—పరాయిప్రాణి హింసబడుతుంటే చూసి ఆనందించే రాక్షస స్వభావం మినహా అది మరోటిగాదు.

'సైలెన్స్!' కించిప్ఫ్యూర్ కేకపెట్టాడు.

'చార్లెస్ డార్నె అనే ఈ ముద్దాయి, మహా ఘనత వహించి నట్టిన్నీ, దొడ్డవారయి నట్టిన్నీ, ఇంకా యేదో అయి నట్టిన్నీ మన రాజుగారి పట్ల ద్రోహబుద్ధితో వర్తించుతూ, మన రాజుగారికి శత్రువయి నట్టిన్నీ మనరాజుగారితో యుద్ధకార్యం నడుపుతూన్నటు వంటిన్నీ ఫ్రెంచి రాజైన లూయీకి పరోక్షము గానూ, బహిరంగముగానూ, యితర త్రానూ సాయపడు తున్నాడనీ, పైన పేర్కొనబడిన మహాఘనత వహించిన వగైరా దొడ్డ ప్రభువులైన మన రాజుగారి యొక్కయూ, పైన పేర్కొనబడిన సదరహీ ఫ్రెంచి రాజా లూయీగారి యొక్కయూ, దేశముల మధ్య తిరుగుతూ, దుర్బుద్ధితోనూ, నమ్మక ద్రోహము గానూ, రాజద్రోహము గానూ, ఇంకా యితరత్రా పేర్కొన దగిన అన్ని విధాలైన దుశ్చింతలతోనూ, ఘనత వహించిన వగైరా మనరాజు గారి సైనిక దళాలు కెనడా, ఉత్తర అమెరికాలకు పంపబడు తున్నాయనే రహస్యాన్ని సదరహీ ఫ్రెంచిరాజుకు తెలియ పరచి నట్టున్నూ, రాజద్రోహ నేరము మోపబడి యున్నది సదరహీ ముద్దాయి తాను నిర్దోషి అయినట్టు నిన్నటి దినం కోర్టు వారి యెదుట వాదించి వున్నాడు'

అక్కడికి అర్థం చేసుకునే సరికి జ్రరీకి తలప్రాణం తోకకు వచ్చింది. అన్యాయస్థాన పారిభాషిక పదాల ప్రభంజనంతో అతని తలమీది గసిక పెంట్రుకలు మరింత చికొగ్గా లేచినిల్చునయ్. నానా తంటాలూ బడి, పదేపదే పైన పేర్కొనబడిన బోనులో నిల్చునున్న ఆ ముద్దాయి పేరు చార్లెస్ డార్నె అనీ, జూరీలచేత ప్రమాణం చేయిస్తున్నారనీ, ప్రభుత్వం తరఫున అటార్నె జనరలు మాట్లాడ బోతున్నారనీ జ్రరీ తెలుసు కున్నాడు.

అక్కడున్న యావన్మందిచేతా, మానసికంగా ఉరిదీయ బడుతూ, చిత్రవధ చేయబడుతూ, ముక్కలు ముక్కలుగా రంపపు కోతలు కోయబడుతున్న ఆ ముద్దాయి, ఆ పరిస్థితులకు చిన్న బుచ్చుకోకుండా, ఆవేశవివశుడు గాకుండా ప్రశాంతంగా నిల్చుని విచారణలో నడుస్తున్న వాదప్రతివాదాలను అత్యంత శ్రద్ధగా అర్థంచేసుకుంటున్నాడు. తన చేతులు రెండూ బోను ముందుభాగంలో అమర్చివున్న కటకటాలమీద వేసి కదలకుండా నిల్చున్నాడు.

ముద్దాయికి నెత్తిపైగా ఒక పెద్ద అద్దం అమర్చివుంది. అనేక మంది దుష్టుల రూపాలూ, హతభాగ్యుల రూపాలూ ఆ అద్దంలో ప్రతిబింబించినై. వాళ్లంతా ఆ అద్దంలోనుంచే గాక ఈలోకం లోనుంచే తుడిచివేయబడ్డారు.

ఆ అద్దం కాంతి ముఖంమీద పడి ముద్దాయి ముఖం ఎడం వైపుకు తిప్పేసుకున్నాడు. అటు తిరిగేసరికి జడ్జి బెంచికి ఆ మూలగా కూర్చునున్న యిద్దరు వ్యక్తులు అతని కంటబడ్డారు. వాళ్ళని చూడ్డంతోనే అతని ముఖం యావత్తూ విచిత్రంగా మారి పోయింది. అతని ముఖ కవళికలు అలా హఠాత్తుగా మారటంతో అతనివంక చూస్తున్న వాళ్లంతా ఏమిటా అని ఒక్కసారి అటు తిరిగి ఆ వ్యక్తులవంక చూచారు.

సుమారు ఇరవై సంవత్సరాల వయసులో వున్న ఒక పడుచూ, ఆ అమ్మాయి తండ్రిలా కనుపించుతున్న ముగ్గుబుట్టలా తల నెరిసి వున్న ఒక పురుషుడూ వాళ్ళకళ్ళ బడ్డారు. ఆయన ముఖం అదో తరహాగా వుంది. తనలో తను ఏదో ఆలోచించు కుంటున్న వాడి లాగు అయోమయంగా వున్నాడు. అలా మథనపడుతూ కూర్చు న్నప్పుడు ఆయన ముసలివాడులా కనుపిస్తున్నాడు. మళ్లీ క్షణంలో స్ఫురితుడై కూతురుతో మాట్లాడే టప్పుడు చాలా పడుచు వాడిలా కనుపించు తున్నాడు.

కూతురు, తండ్రి దండ చేతికి తన చెయ్యి పెలికవేసి, దగ్గర సా అంటిపెట్టుకు కూర్చొనుంది. ఆ వాతావరణమంతా చూస్తే ఆవిడకు గాబరాగావుంది. ముద్దాయివంక చూస్తే, ఆవిడ పేగులు జాలిగా కళవళించుతున్నయ్. అతనున్న ప్రమాదాన్ని అర్థంచేసుకోవటంవల్ల ఆవిడ మనస్సంతా కంగారుగావుంది. జాలి పేగులవల్ల ఉత్పన్నమవుతూన్న ఆ భయావేశం యావత్తూ ఆవిడ నుదురుమీద కొట్టొచ్చినట్టు కనుపించుతోంది. ఆ జాలిపేగుల తల్లి వంక చూస్తే అదివరకు ముద్దాయిపట్ల యేవిధమైన దయాదాక్షిణ్యాలూ లేకుండా కూర్చున్న వాళ్ళందరికీకూడా, హృదయం చలించి పోతోంది. 'వాళ్లెవరూ?' ప్రతిఒక్కడూ పక్కవాణ్ణి అడుగుతున్నాడు.

జ్రరీ చేతివ్రేళ్లు నోట్లో పెట్టుకుని, వాటికున్న తుప్పంతా చీకుతూ, అక్కడ జరుగుతున్న తతంగమంతా చూస్తున్నాడు ఆ యిద్దరి సంగతీ వచ్చేసరికి వాళ్లెవళ్లో తెలుసుకోవాలనే ఉత్సాహంతో మెడ నిక్కబెట్టి చూస్తున్నాడు వాళ్లియిద్దరి భోగట్టా ఒకరినుంచి ఒకరికి అంచలమీద వ్యాపించుకొస్తోంది. అలా అలా వ్యాపించి జ్రరీదాకా వచ్చింది.

'సాక్షులు'—

'ఏతరఫు?'—

'ప్రాసిక్యూషన్ తరఫు'

ముద్దాయి ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకు కూర్చునున్న జడ్జీగారు ఆ యిద్దరి వైపునుంచీ చూపుమరలించుకుని, కూర్చీలో యేలగిలబడి ముద్దాయివంక తీవ్రంగా చూస్తున్నారు. అటార్నె జనరల్ ముద్దాయిని ఉరికంబానికి వ్రేలాడదియించటానికి కావలసినతాడూ దగరా పేనుకుంటూ సన్నద్ధుడై లేచి నిల్చుంటున్నాడు.

★

# అగుపించని అంకుశాలు

(౧౨-వ పేజీ తరువాయి)

వెళ్లిపోతున్నట్టు కనిపించేది. అప్పటికి మించిపోయింది లేదు-వెళ్లి శాంతని చూడాలను కొనేవాడు. సాహసం చాలక తిరిగి వాలిపోయేవాడు.

తెల్లవారిన తర్వాతగూడా శాంతని పిలవడానికి సాహసించలేక పోయాడు. రాత్రి సిగ్గుతో పస్తుపడుకోవడం మూలాన ప్రొద్దుట లేవగానే కడుపు మాడింది. ఐనా తన పరిస్థితిని చెప్పుకోడానికి అభిమానం అధైర్యం వేధించాయి. వసారాలో సుందరమ్మ పెట్టిన భోజనాన్ని కిక్కురుమనకండా తిని వెళ్లిపోయాడు.

ఆఫీసుకి ఎలా అడుగులు వేసుకొంటూ వెళ్ళగలిగాడో-వెళ్లి వెళ్ళగానే తన సీట్లో కూలబడిపోయాడు. మూర్తి వచ్చి భుజం మీద చెయ్యివేసేసరికి తులుక్కుపడి తలెత్తి చూశాడు.

"అరె! నీ కళ్ళనించి...!" మూర్తి ఆశ్చర్యంగా చూశాడు.

కృష్ణ కంగారుగా కళ్లు తుడుచుకొన్నాడు.

"ఏం కృష్ణ, యింట్లోవాళ్ళకి ఎలా వుందేవిటి?" సానుభూతిగా ప్రశ్నించాడు మూర్తి.

"అబ్బె... అబ్బె... ఏంలేదు మూర్తి" అని విషయాన్ని మార్చే ఉద్దేశంతో, నిన్న అతనిచ్చిన రూపాయినోటు జేబీలోంచి తీసి అందిస్తూ అన్నాడు: "ఈ ఒక్క రూపాయి చాల్లేదు మూర్తి"

మూర్తి నోటు తీసుకొంటూ చిరునవ్వు నవ్వాడు-తన అశక్తతని దానివెనుక దాచుకొంటూ.

"మనలో మనం సమయానికి సహాయాలు యింతకంటె ఎక్కువ చేసుకోడానికి యింతా చేసి మన బ్రతుకులెంత?"

నిజమే అనుకొన్నాడు కృష్ణ. తనకంటె పెద్ద హోదాల్లో వున్నవాళ్ళని తను అప్పు అడగడానికి తగదు; వేనకవేలు రూపాయల్ని భద్రంగా దాచుకొన్న ధనవంతుల్ని 'ధర్మం బాబూ' అని అడుక్కోలేదు; జాలిగా తన స్థితిని చూసి సమయానికి ఆదుకోవాలను కొన్న వాళ్ళదగ్గర ఆ సహాయం చేసే శక్తిలేదు.

సాయంకాలం వరకు మనిషి యిక్కడే గాని మనస్సు ఎక్కడో పనిచేసింది. ఒక్క రోజులో మనిషనేవాడు ఎన్ని తప్పులు చెయ్యగలడో అన్ని తప్పులు చేశాడు. అందుకు తోడు తలనొప్పి. సాయంకాలం అయేసరికి మేనేజరు న్యాయంగా పిలచి చీవాట్లు పెట్టాడు.

"చేస్తున్న పనికి జాగ్రతి అవసరమని నేను జ్ఞాపకం చెయ్యనవసరం లేదు. మనిషికి జీతం యివ్వడం అక్కణ్ణించి సవ్యమైన పని కావాలిసొచ్చిగాని, వారి మటుకు వాళ్లు కాలాన్ని సోమరిగా చంపెయ్యడానికి కాదని గుర్తించుకో"

మేనేజరు మాటలు ఉక్కుసూదుల్లా సూటిగా హృదయంలో ముక్కలయ్యాయి... అవును ఆ ముష్టి ఏభైరూపాయల జీతం తనని, తన శక్తిని, తన మనస్సుని, చివరికి తన మానవత్వాన్నే కొనేసింది. చేతగాని వేదాంతంతో వళ్లుని చల్లబరుచుకోబోయాడు.

దారిపొడుగునా మనిషికి ఒంటిమీద స్పృహ లేదు. జీవితంలో ఎప్పుడూ పుట్టని నైరాశ్యం, నిస్పృహ కలిగాయి. తనని పరివేష్టించివున్న పరిసరాలన్నీ తనకోసం తన్ని చిత్రవధ చెయ్యడంకోసం, తన్ని హాస్యాలపాలు చెయడంకోసం, తన్ని పీడించుకు తినడంకోసం కనిపెట్టుకొని వున్నాయి. ఏవిటో జీవితం!

ఎంతైతే తన దురదృష్టానికి దారిపొడుగునా ఖేదిస్తూ వచ్చాడో, యింటికి వచ్చేసరికి ఎదురుగా తల్లి వచ్చి "తెచ్చావా?... అబ్బే ఎందుకు జ్ఞాపకముంటుంది" అని ఎత్తిపొడవగానే అంతా కృంగిపోయాడు.

మెల్లగా లోపలికి వచ్చి మంచంమీద కూలబడి రెండు చేతులతో ముఖాన్ని దాచుకొని కళ్లు మూసుకొన్నాడు. అక్కడ ఆఫీసు. అగ్నికి ఆజ్యంతోడయేట్టు యిక్కడ యింట్లో పరిస్థితులు. నిలకడలేని మనస్సు... ఇంతలో తిరిగి తల్లిమాటలు వినిపించాయి.

"నిన్న చేసిన ఘనకార్యానికి...శాంత ...శాంతకాదు నీ "యిల్లాలు" ఇంతవరకూ వచ్చి మంచినీళ్ళైనా ముట్టుకోలేదు."

"హాఁ!" ఆశ్చర్యంగా తల్లి కేసి చూశాడు.

"ఎందుకా ఆశ్చర్యం? నీ కొక్కరికే సిందే అదేగా? ఈ మధ్యలో అది అలా కుళ్లి కుళ్లి ఛస్తే అప్పుడు నీకూ వీళ్ళని పోషించే బాధ తగ్గుతుంది-మా మటుకి మేం ఏ మూలకో పోయి ముష్టెత్తుకొంటాం"

కృష్ణ మాటాడక పోవడం చూసి సుందరమ్మ ఈసారి రెట్టిస్తూ.

"నిన్న అదేమందని అంతలా చేతికొచ్చినట్టు కొట్టుకొన్నావ్? అది చచ్చిన

తర్వాతగాని అటు చూడవ్. లేకపోతే ఎప్పటినించి చెబుతున్నాను. నీ కళ్ళు కాస్త తగ్గించి దానివేపు కన్నెత్తి చూడ మంటూ? అటు చూసిన పాపాన పోయావా? చివరికి దానికి విసుగొచ్చి అడిగితే తల తిరిగి పోయేటట్టు కొట్టి తోసేస్తావా? అవును అది అడిగిన దాంట్లో ఏం తప్పుందని? వాళ్ళ నాన్న పంపించే పది గూడా కాజేస్తూ, అది అడిగిందని యింత పొగరు మొచ్చిందే—అది నిజం కాదా?"

కృష్ణ గుండెల్లో ఈ శూలాలు తగిలే కొద్దీ విచక్షణాజ్ఞానం తగ్గిపోతోంది. శ్వాస తీవ్రమయ్యేకొద్దీ ఎదుటి వ్యక్తిమీద కోపం ఎక్కువ కాజొచ్చింది.

"నీకెక్కువలసింది నీ స్నేహితులతో హోటళ్లమ్మట తిరగడం, సినిమాలు పోకులు వెలిగించడం, అర్థరాత్రి వరకు పేకార్లు కొట్టడమేగాని యింట్లో వాళ్ళు ఎలా ఛస్తున్నారో ఒక్కనాడైనా చూసిన పాపాన పోయావా?"

ఈ నిందని అనవసరంగా స్నేహితుల మీద మోపడంతో కృష్ణ మరిక సహించలేకపోయాడు. సుందరమ్మ ఆగలేదు. ఇంకా ఆ విధంగానే నిందలు వేస్తూ పోతోంది. కృష్ణ ఉద్రేకం హద్దులు దాటిపోయింది. మంచం మీంచి ఛర్రున లేచి "నోర్ముయ్" అని తోసేశాడు.

సుందరమ్మకొయ్యబారి పోయింది! ఏవిటీ తను పెంచి పెద్ద చేసిన కొడుకు—కాదు కిరాతకుడు—అంత మాటని తోసెయ్యడం! ఇక అక్కడ ఒక్క క్షణం నిలవలేకపోయింది. ఆపుకోలేని దుఃఖంతో, అభిమానంతో గిర్రున తిరిగి లోపలికి వెళ్ళిపోయింది.

*   *   *

వారం... రెండు వారాలు గడిచిపోయాయి. ఎడమొహం పెడమొహాలతోనే కాలం దొర్లిపోయింది. కొడుకుని చూసిన తల్లి ఛీత్కారంతో తల తిప్పుకొని పోతూ వుంటే, తల్లిని చూసిన కొడుకు సిగ్గుతో దహించుకపోయేవాడు. శాంత కనిపించినా పిలవడానికి గొంతుక పెగిలేదు కాదు. స్నానానికి నీళ్లు ఎవరు పెట్టేవారో, అన్నం ఎవరు వడ్డించేవారో కృష్ణకి గుర్తుండేది కాదు.

ఆఫీసుకి వెళ్ళేవాడు. అక్కడ బుర్ర సరిగా పని చెయ్యక తప్పులు చేసేవాడు. ఆఫీసరు పిలిచి చీవాట్లు పెట్టేవాడు. మరిక దిక్కులేక, గతిలేక అవన్నీ సహిస్తూ ఆ ఆఫీసులోనే తెల్లారించేవాడు. ఇంటికి వచ్చేసరికి అరుగు మీద చెంబుతో నీళ్లు తన్ని హాస్యం చేసేవి. ఇంట్లోకి వెళ్ళినా అందరు ఎడమొహం పెడమొహాలతో తప్పించుక తిరిగేవాళ్ళే. ఇంట్లో వాళ్ళ ఈ చర్యలు కృష్ణని మరింత బాధించేవి. ఒక్కొక్కసారి బాధతో లోలోనే కృంగిపోయేవాడు. మరోప్పుడు యింట్లో వాళ్ళందరి మీదా చెప్పలేనంత కోపిష్టి అయిపోయేవాడు. ఆ ఉక్రోషంలో ఎదురుగా అగుపించే వస్తువుల్ని గుండపిండి చేసేసేవాడు.

ఆ వాళ శనివారం, సుందరమ్మ తులసి పూజలో వుండిపోయింది, శాంతకి వంట్లో బాగులేక పడుకొంది ఎవరికీ కృష్ణ ఆఫీసు మాట జ్ఞాపకం లేదు. తిండికోసం చూసి చూసి విసుగెత్తి కసిగా కాలికి తగిలిన పీటని తన్ని రంయ్యమని ఆఫీసుకి వెళ్ళిపోయాడు.

ఆఫీసులో పని చెయ్యలేదు—యింటిదగ్గర కోపంతో. కడుపు కాలిపోతోంది. కళ్లు తిరుగుతున్నాయి. హోటలుకి పోవడానికి జేబీలో డబ్బులు లేవు. స్నేహితుల్ని అడగడానికి అభిమానం వెక్కిరించింది ఆ కసితో ఆ వాళ ఆఫీసు పని పిసరంతైనా ముట్టుకోలేదు.

సాయంకాలం ఆఫీసరు ముందు మళ్లా హాజరు కావలసి వచ్చింది. ఈ సారి చీవాట్లతో పాటు ఒక రిమార్కు గూడ పడింది. ఈ కోపం, లోపలి ఆకలి కోపంతో కృష్ణ నిలువెల్లా కంపించిపోయాడు. ఆవేశంతో యింటికొచ్చి మంచం మీద వాలిపోయాడు.

తనకిక శాంతి లేదు. విశ్రాంతి లేదు. జీవితానికి కాంతిలేదు. బ్రతుకే భ్రాంతి ఐపోయింది. అక్కడ ఆఫీసు, ఇక్కడ రుసరుసలాడే తల్లి, ముఖం తప్పించుకొనే భార్య గృహంలో స్వర్గాన్ని ఆశించాలనుకొంటాడు, ఉన్న చిన్న వస్తువులతోనే తృప్తి పొందాలనుకొంటాడు. కాని చుట్టూరా వున్న పరిస్థితులు ఏడిపిస్తున్నాయి. ఏడిపించి చంపుతున్నాయి.

ఇంతలో పక్కన శాంత పాడి దగ్గు వినిపించింది. చూడగూడదు చూడగూడదనుకొంటూనే కృష్ణ పక్కకి చూశాడు. హఠాత్తుగా దృష్టి శాంత కళ్లల్లోకి ప్రసరించింది.

శాంత తల దింపుకొంది.

"మీరు...మీరు ప్రొద్దుట భోంచెయ్యకండా వెళ్ళిపోయారు?"

నీరసంగా వచ్చిన శాంత మాటలు, కృష్ణ కడుపాకలి మహాకోపాన్ని తెప్పించింది.

"పెట్టే దిక్కుంటేగా?"

శాంత మరిక మాటాడలేక పోయింది కాసేపటివరకు. ఆ ఉద్రేక సమాధానానికి కాస్త భయపడింది గూడ. తర్వాత ఒక నిట్టూర్పు విడిచి మెల్లగా అంది:

"నాన్న దగ్గరనించి మని ఆర్డరు వచ్చింది"

కృష్ణ కటువుగా శాంతవేపు చూశాడు.

"ఇంట్లో చాల యిబ్బందిగా వుంది. ఇవి తీసుకోండి..." అని చేతిలోని పది రూపాయల నోటుని కృష్ణ పక్కనే పెట్టి వెనక్కి తిరిగింది.

కాగితం కేసి చూశాడు కృష్ణ ఎక్కడలేని ఆత్మాభిమానం, ఉక్రోషం పుట్టుకొచ్చాయి. పది రూపాయల కాగితం! తన నాన్న పంపినవి—తను, ఆడదాని చేతినించి

తీసుకోవడం! కాదు ఆమె తన్నొక చేత కాని వాడిలా, భావించి ధర్మంగా యివ్వడం!

"అక్కర్లేదు" నోటుని వెళ్ళిపోతున్న శాంత మీదికి విసిరేశాడు.

శాంత ఆగి కిందపడ్డ నోటుని తీసింది. కాని తిరిగి భర్తకి యివ్వడానికి సాహసించలేక పోయింది. కాసేపలాగే నిలబడి తర్వాత ఏమనుకొందో అతని దగ్గరగా వస్తూ ప్రేమగా అంది.

"మీరు రోజురోజుకి నీరసించి పోతున్నారు. జీతం యింకా ఏ వారానికో గాని అందదు. అంతవరకూ యింట్లో భత్యానికి యిప్పుడున్న సామాన్లు చాలవు. అందువల్ల యివి తీసుకొని బజారు చెయ్యండి."

కృష్ణ సమాధానం చెప్పలేదు.

"నాన్న యీ డబ్బు నాకే పంపిస్తున్నా మీరు నా వారైనపుడు దాన్ని మీకు యివ్వడంలో తప్పులేదు. ఆ యిచ్చే హక్కు గూడ నాకుంది"

"హక్కుంటె నీకోసం నువ్వే ఉపయోగించుకో"

"వద్దు"

"వద్దుగాకపోతే చావు" గభుక్కున లేచి బయటికి తోసేశాడు.

అదే మొదలు శాంత మంచం పట్టింది. ఐనా తన నిస్సత్తువని మాత్రం ఒక్కసారైనా అత్త మామలకి తెలియనివ్వలేదు సుందరమ్మయితే కొడుకుతో మాట్లాడ్డం పూర్తిగా మానేసింది. తండ్రి, శేషాద్రి యింట్లో పరిస్థితుల్ని అంతగా పట్టించుకొనేవాడు కాదు. కాని ఆ తటస్థ విధానానికి గూడ ఓనాడు భంగం కలిగింది. సుందరమ్మ దగ్గరనించి సంగతంతా విని కొడుకు దగ్గరకొచ్చి

"అంత చేతకానివాడివి పెళ్లెందుకు చేసుకున్నావ్?" అన్నాడు.

"బండరాయిని తగిలించింది కాకుండా తిరిగి నా మీదే నింద వే..."

కృష్ణ మాటలు నోట్లో వుండగానే ముసలాయన కోపంగా అరచాడు.

"నోర్ముయ్... బయట పరిస్థితుల్ని ఎదుర్కోలేక యింట్లో చేతగాని ఆడంగుల మీదరా నీ అధికారం, కసి? ఇంట్లో వాళ్ళంతా నీ కాళ్ల కింద వున్నారని నీ యిష్టమొచ్చినట్టు ఏడిపిస్తావట్రా? అంత షోకులు చేసేవాడివి మరో విధాన డబ్బు గడించుకోలేక పోయావా?"

ఇంతలో సుందరమ్మ వచ్చింది. వస్తూనే నోరు విప్పింది.

"రేపొద్దుట అది చచ్చిందంటె ఆనింద ఎవరికో..."

"నాకే...నాకే...నాకే... ముమ్మాటికీ నాకే...ఆ కారకుణ్ణి నేనే అవుతాను. మీకెందుకా బాధ పోండి" అంటూ వాళ్ళిద్దర్నీ గెంటి తలుపులు బిగించుకొన్నాడు.

ఈగొడవంతా శాంతకి వినిపిస్తూనే వుంది. బాధగా ఒక నిట్టూర్పు విడచింది. ఇక్కడ తను యిలాంటి కష్టాలు పడుతున్నట్టు గాని, కనీసం తన ఆరోగ్యం గురించి గాని తలిదండ్రులకి తెలీపరచడం లేదు. ఎప్పుడైనా నాన్నకి ఉత్తరం వ్రాయాలని బుద్ధి పుడితే కార్డు తీసి అస్పష్టంగా నాలుగు ముక్కలు వ్రాసి పోస్ట్‌లో వేసేది.

కాంతారావుగారు కూతురు ఉత్తరాలని చూసి మొదట్లో అంత ఆశ్చర్యపడక పోయినా తర్వాత ఈ రాసే రెండు వాక్యాలకి అంతరార్థం ఏమిటా అని ఆలోచించ సాగాడు. చివరికి ఏమనుకొన్నారో అల్లుడుకి తన అభిప్రాయాలన్నీ వివరిస్తూ ఉత్తరం రాశారు.

కృష్ణ అజాగ్రత్త వల్ల ఆఫీసులో అందరి కంటె సోమరిగా ఆఫీసర్ల దృష్టికి పడ్డాడు. రెండో వార్నింగ్ గూడ దొరికింది. దీనికి జడిసి, కృష్ణ తన ఓర్మినంతనీ ఉపయోగిస్తూ అడకువగా పని చేస్తున్నాడు. ఆ సమయంలో ఈ ఉత్తరం అందింది. చదువుకొని జేబీలో పెట్టుకొన్నాడు.

సాయంకాలం యింటికి వచ్చీరాగానే అరుపులు ప్రారంభించాడు. అందుకు తోడు శాంత సరిగా ఎదురు పడింది. అగ్గి మీద గుగ్గిలం పడ్డంత పనైంది. ఊర్ధ్వస్వరంతో అరిచాడు: "చావక ముందే ఛస్తున్నానని పుట్టింటికి రాసుకొంటె, ఆ నాన్నగారు సంజీవిని తెస్తార్లాగుంది!"

శాంతకి పాలికేకలు అర్థం కాకపోయినా కొంతవరకు వూహించ గలిగింది.

ఇంతలో తండ్రి లోపలినించి వచ్చాడు "మళ్లా ఏం కొంప మునిగి పోయింది?" అనుకుంటూ.

కృష్ణకి ఈ సమయంలో యుక్తాయుక్తాలు తెలీడం లేదు. కసి, కోపంతో నిలువల్లా వణికి పోతున్నాడు. "ఇది మీకనవసరం"

"ఏమన్నావ్—?"

"ముమ్మాటికి మీక్కాదు"

"మాక్కాదూ! రేపొద్దుట నీ తాత అక్కణ్ణించి వచ్చి చచ్చిన దానిగురించి అడిగితే చెప్పే బాధ్యులెవరు? అక్కణ్ణించి తీసుకొచ్చి తిండి పెట్టకండా చంపారనే 'మంచిపేరు' ఎవరికొస్తుంది?"

"నాకే వస్తుంది. మరి మీరిక మాటాడకండా బయటకి పోండి, మాట దక్కదు"

"మాట దక్కకపోతే ఏం చేస్తావురా?" వెళ్లాడు. తండ్రికొడుకులిద్దరూ ఆవేశాలతో చూసుకున్నారు. కేకలు అరుపులు వీధిలో మారుమోగాయి. ఇరుగు పొరుగుల వాళ్ళంతా పరుగు పరుగున వచ్చి తండ్రి కొడుకుల్ని మంచి మాటలతో సముదాయించారు.

కృష్ణ యింట్లోకి వెళ్ళి ధఢీమని తలుపు వేసుకొన్నాడు.

"ఇక యిక్కడ మేం ఒక్క క్షణం వుండలేం. మరో రెండు రోజులుంటే ఖూనీ గూడా చేసేస్తాడు ... ఇంటి కొస్తాడు కంయ్, భొంయ్ మంటాడు — ఏమని అడిగితే లెంప కాయల్తో సమాధానం చెబుతాడు ... ఇక మేం వుండలేం బాబూ..." అంటూ సుందరమ్మ కుడ్లనీళ్లు తిప్పుకొంది.

ఈ కలహపర్యవసానంగా సుందరమ్మ శేషాద్రులు కొడుకుయిల్లువిడిచి సుందరమ్మ తమ్ముడింటికి వెళ్ళిపోయారు. శాంత ఎంతో ఆటంకపరచింది; బ్రతిమాలింది. ఇక తనకి మిగిలింది ఆ చేతగాని ఏడుపొక్కటే. (ఇంకావుంది)

# పిల్లలందరు గొల్లుమన్నారు

శ్రీ సిద్ధాంతి మల్లికార్జునం

నేనెరిగినప్పటినుండి స్థానికపరిపాలనంటే తాతాచార్లుగారు చాలా అభిమానం చూపుతూండేవారు. మా వూళ్ళో పంచాయితీబోర్డు ఎన్నికలప్పుడుగాని, జిల్లాబోర్డు ఎన్నికలప్పుడుగాని వారి ఉత్సాహం, వారి ఉపన్యాస ధోరణి విని చూచి ఆనందించాల్సిందేగాని, రెండో నోటిచుండా వింటే ఉపయోగమే లేదు. అసలు పూర్వకాలంలో మనదేశం అంత గొప్పదిగా వుండటానికి కారణం స్థానిక పరిపాలనాసంస్థలేనని, యిప్పుడు ఆ దేశమే పతనం చెందటానికి ఆ సంస్థల వ్యాప్తి లేకపోవడమేనని వారి దృఢ నమ్మకం.

ఏ గొప్ప పొరపాటువల్లనో గ్రహస్థితిలో కొద్ది స్థానచలనం కలగడంచేతనే గాని లేకపోతే వారేదో ఒక గొప్ప దేశభక్తుడై మహానాయకుడై మహోగ్రభీకరోపన్యాసాలిచ్చి ప్రచండ ప్రచారంచేసి భూమ్యాకాశాలను దద్దరిల్లేట్లుచేసి ప్రజల హృదయాలను ఊపిరి తిప్పుకోకుండా ఊపి, ఊపి, చిట్టచివరకు సామదానభేద దండోపాయాలతో, రాష్ట్రీయ పరిపాలనాధికారాలలో లాభదాయక గౌరవనీయ, అనంతాధికార యుతమైన, స్థానిక పరిపాలనాశాఖామాత్యులుగా పీఠమలంకరించి వుండేవారు.. కాని ప్రారబ్ధాన్ని బ్రహ్మదేముడే ఎదిరించలేకపోతే యిక తాతాచార్లగారి మాటేమిటి ?

ఎలాగైతేనేం, జాతకప్రభావంవల్ల వారు మా జిల్లాబోర్డు ఉపాధ్యాయులైనారు. భూగోళం, దేశచరిత్ర, సాంఘిక వ్యవస్థ, ఆర్థికస్థితి మొదలైన విషయాలలో వారికిగల అనన్యసామాన్య విజ్ఞాన శ్రద్ధాసక్తుల కారణంగా, నిన్నగాక మొన్నే కొత్తగా సాంఘిక విజ్ఞానము అని నామకరణం చేసుకున్న, కొత్తచదువు బోధించడానికి వారిని, నియమించారు

అసలు పుస్తకంలో ఏది వున్నప్పటికీ స్థానికసంస్థల గురించి ఏదో ఒక అంశం చెప్పనిదే తాతాచార్లుగారు క్లాసువదిలిపెట్టేవారుకాదు. గంటకొట్టినా ఒక్కొక్కసారి ఉపన్యాసంలో మునిగి, అలాగే చెపుతూంటారు. సాయంకాలం బడి వదిలిపెట్టాక, యింటికి వెళ్లినంతవరకు కోడిపెట్టలాగా, ఒక డజను విద్యార్థులను వెంటబెట్టుకొని, మా జిల్లాబోర్డు వేసిన రోడ్లను గురించో, పంచాయితీబోర్డు గుడ్డిలాంతర్లను గురించో, రోడ్డుకు అడ్డంగా ప్రవహించే మురికికాలవల గురించో చెప్పుకుంటూ వెళ్లేవాడు. ఈ చెప్పిందంతా చాలక, ఎవరైనాసరే ఎప్పుడొచ్చినాసరే, తాను తప్పకుండా, మౌర్యరాజుల కాలంలోగాని చోళ రాజుల కాలంలో గాని స్థానిక పరిపాలనను గురించి విశదంగా చెప్తానని వాగ్దానంచేసి వాళ్ళను యింటికి పంపేవారు.

తాతాచార్లుగారి ధర్మాన స్థానికసంస్థలు వాటి పరిపాలన, ప్రతిభ, మొదలైన విషయాలన్నీ పిల్లల తలనిండా నిండిపోయాయి. పరీక్షల్లో ఏ ప్రశ్న అడిగినా, స్థానికసంస్థలగురించే వ్రాసేటంతటి వరకు వచ్చారు విద్యార్థులందరు.

ఒకనాడు హైస్కూలు వార్షిక దినోత్సవం జరిగింది. ఉదయంనుంచి రాత్రి 8 గంటలవరకు కార్యక్రమాలు పూర్తిగా వున్నాయి. నాటిసభకు జిల్లాబోర్డు ప్రెసిడెంటుగారు ప్రెసిడెంటుపదవి నలంకరించారు. సభలో ఉపన్యసించేవారిలో తాతాచార్లుగారు ఒకరు. వారి వంతు వచ్చేసరికి ఆచార్లుగారు ఉత్సాహం పట్టలేకపోయ్యారు. ఆ ఉత్సాహంలో అందులో జిల్లాబోర్డు ప్రెసిడెంటుగారిని చూచాక ఉబికే ఉత్సాహంలో వారేమైపోతారో, కాస్త పెద్దసంసారం కలిగిన వారేనని నాకు జాలేసింది.

ఎన్నడూ అలా ఉపన్యసించలేదు తాతాచార్లుగారు స్థానికసంస్థలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకన్నా ఎక్కువగా దేశానికవసరమన్నారు. అసలు కొద్దిరోజుల్లో పంచాయితీబిల్లు రాగానే, పంచాయితీరాజ్యం మన దేశంలో స్థాపితమైతే, స్థానిక సంస్థల యొక్క అధికారాలు గౌరవాలు ఎక్కువౌతాయని, అలాంటప్పుడు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలకు మనదేశంలో స్థానమే లేదని ఆచార్లుగారు అతి గంభీరోపన్యాసం చేశారు.

వారి ధోరణిలో మా జిల్లాబోర్డు, పరిపాలనా సౌష్టవంలోగాని, ఆర్థిక సౌష్టవంలోగాని ఉపాధ్యాయుల మార్పు విషయాల్లోగాని మరి ఏ జిల్లాబోర్డుకుగాని తీసిపోదని మాట్లాడితే ఏ విషయంలోనైనా తక్కిన వాటికంటే రెండుమెట్లు వృద్ధిలోనేవుంటుందని, యిన్నిటికీమా జిల్లాబోర్డు ప్రెసిడెంటుగారి నిష్కల్మషమైన విశాల విశ్వంలాంటి హృదయమే కారణమని ముగించారు.

*   *   *   *

"ఏమండీ యిది ఫిబ్రవరినెలకదూ ?" అన్నది తాయారమ్మ భర్తని.

"అవును."

"ఇవ్వాళ 25 వ తారీఖుగదూ ?"

"అవును."

"బళ్లో మీటింగు బాగా జరిగిందా ?"

"చాలా బాగా జరిగింది. ఇవ్వాళ, చెప్పిన ఉపన్యాసం నాజన్మలో ఎన్నడూ చెప్పలేదు. మా ప్రెసిడెంటుగారు కూడ చాలాసేపు చప్పట్లు చరిచారు."

"అబ్బా !!"

"మీటింగు తర్వాత నా ఉపన్యాసం చాలా బాగుందని మెచ్చుకోలేక చాలా అవస్థపడ్డారు......ఫరవాలేదులే. ఆయన చాలా సంతోషపడ్డారు. అదే పదివేలు... ఈసారైనా జీతం ఎక్కువ చెయ్యక పోతారా ?

"ఏం నామొహమో !...ఎంత సేపటికీ మీ ఉపన్యాసాల మోతేగాని రూపాయల మోత వినబడితేగా !"

"కాస్త ఓపిక పట్టవే... ఎలాగైనా మనం నోటితో బతకవలసినవాళ్లం. దేనికైనా కాలం కర్మం కూడి రావాలా ?"

"కాలానికి కర్మకూ కొరవేలేదు... ఒక్క కూడు గుడ్డ యీ రెంటికి తప్ప మరోదానికి మనకేమైనా కొరవా చెప్పండి ...పచ్చగా యింటినిండా పదిమంది పిల్లలు, ఎప్పుడు వచ్చేపొయ్యేవాళ్లు గొప్ప ఉపన్యాసకులని మీకు పేరు మీ భార్యనని నాకు పేరు___"

"నిజమేలేవే."

"ఇంతకూ జీతా లెప్పుడొస్తాయట ?"

"చెక్కు రేపు వస్తుందంటున్నాడు మా హెడ్మాస్టరు......చాలా రోజులక్రిందటే చెక్కులమీద సంతకాలుపెట్టి పంపించినట్లు ప్రెసిడెంటు రాత్రి చెప్పాడట."

"మరింత ఆలస్యం దేనికి ?"

"బహుశః యీ ఎలెక్షన్ల హడావిడి

కొబోలు. దాంటో మునిగి మా జీతాల మాటే మర్చిపొయ్యారు."

"అయితే మీ ప్రెసిడెంటు గెల్చాడా?"

"ఆహాం. ఆయన గెలవకపోవడమేమిటి?...పైగా నేను ప్రచారానికి వెళ్లడం!"

"ఆయన గెలిస్తే మీకేం ఒరుగుతుందని చేశారు యీ చాకిరంతా?"

"ఒకనెలజీతం బోనస్‌గా యిప్పిస్తానన్నాడు."

"నిజంగా?"

"తప్పక...మాట తప్పే మనిషికాదు. మా ప్రెసిడెంటు."

"రేపు జీతంవస్తే ఒక్క చీరైనా కొని పెడ్తారా?"

"సరే...నాకూ పంచలన్నీ చినిగిపొయ్యాయి...బడికి పోవడానికే సిగ్గుగా వుంది...చక్కగా అలంకరించుకొని ముచ్చటగా వుండేపిల్లల ఎదుట యీ చింపిరి వస్త్రాలతో వెళ్లి పాఠం చెప్పాలంటే నాకు తలవంపులుగా వుంటూంది."

* * * *

"ఏమేవ్"

"ఆఁ"

"చెక్కు వచ్చిందట."

"అబ్బ!!...ఎన్నాళ్లకు విన్నానండీ యింత మంచివార్త...మరి యివ్వాళే యిస్తారా."

"ఇంకా ఆలస్యమా?"

"ఎంత రావాలి మీకు?"

"మూడునెల్లజీతం, ఒకనెల బోనస్. 240 రూ. రావాలి."

"ఇంత సంతోషం ఎన్నడూ కలగలేదండి.

"సరేలే బడికి గంటైంది...అన్నం పెట్టు"

"అప్పుడే!...తొమ్మిదిన్నర కూడా కాలేదే."

"జీతాలిచ్చేరోజుగదటే...ఇవ్వాళైనా కాస్త పెందలాడే వెళ్లకపోతే ఎలాగే?"

"అయినమటుకు పెడతారండి."

* * * *

"ఒరేయ్ ఖాదర్"

"అయ్యా."

"చెక్కు వచ్చిందటగా.. ఖజానాకింకా వెళ్ళలేదా?"

"ఇప్పుడే పోతుండానయ్యా"

ఆమాట చెవిలో వేసుకొని పొంగిపొరలే చిరునవ్వు నాపుకుంటూ తాతాచార్లుగారు క్లాసులో ప్రవేశించారు.

"ఇవ్వాళ జీతాలు వస్తాయటగదండీ" అన్నారు పిల్లలు.

"రేడియోవార్తల్లో ఏమైనా విన్నార్రా?"

"మన వూళ్లో దోమ యీనినా వూరంతా తెలుస్తుంది సార్."

"సరే లెండి."

అంటూ పుస్తకం తీసుకున్నాడు. సగం పైమైంది. హఠాత్తుగా తాతాచార్లుగారబ్బాయి చక్కగా క్లాసులోకి పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"ఏమిట్రా యిక్కడికొచ్చావు?"

"నాన్నా, చిన్నత్త, మామ, పిల్లలు అంతా యీ బండికే వచ్చారు."


"ఓహో...సరే...యింక వెళ్లు."

* * *

సాయంకాలం ఆఖరు పీరియడ్ జరుగుతూంది. ఇన్నాళ్లకుగా చెల్లెలు, బావగారు, పిల్లలు వచ్చారంటే తాతాచార్లు చాలా సంతోషపడుతూ ద్విగుణీకృతోత్సాహంతో పాఠం చెబుతున్నారు.

ఆనాడు జిల్లాబోర్డు ప్రెసిడెంటు అధికారాలు చెప్పవలసివచ్చింది. వారి కది చాలా యిష్టమైన పాఠం. అందుచేత గంభీరోపన్యాసం చేస్తున్నాడు.

(38-వ పేజీ చూడండి)



# అడవి

"శివం"

ఒక్కరి అడవి యిది. ఇందులో ఆకలిగొన్న మృగరాజులున్నాయి. అయినా యిది చాలా విశాలమైన అడవి. అందుకనే, యిందులో గుఱ్ఱాలు, గొఱ్ఱెలు, ఆవులు లేళ్ళు కూడా వున్నాయి కాని...]

లేడి కళ్ళతో బెదురు బెదురుగా చూస్తూ "నేను కూడా వక కథ వ్రాస్తున్నాను-మామయ్యా" అన్నాడు విశ్వం.

దిగులేసింది నాకు వాడిని చూస్తూంటే. అందుకనే కాబోలు వాడిలో కన్పిస్తూన్న యీ మార్పంతా.

ఎప్పుడు చూచినా నవ్వుతూండే వాడి ముఖం ఆలోచనలతో నిండి మౌనంగావుంది ఎన్నడూ లేని విధంగా నిర్లక్ష్యంగా దువ్వబడిన ఆ జుత్తూ, దుస్తులూ, వాడూ... ఎప్పుడూ సాయంత్రాలప్పుడు ఏ బంతో ఆడుకునేవాడు, సావధానంగా యివ్వేళ నాతో మాట్లాడే విధమూ, వాడిలోని మార్పుని స్పష్టంగా పట్టిస్తూంది.

"పూర్తి చేసేసేవా, లేక యింకా రాస్తున్నావా?" ఆదుర్దాగానే అడిగేను.

"రేపు పూర్తయిపోతుంది మామయ్యా."

నా మాట విని వెంటనే దానిని ముక్కలు ముక్కలుగా చించి పారెయ్యి ఏదీ వొట్టెయ్యి- యింకెప్పుడూ యిటువంటి పనులు చెయ్యనని"

నన్ను ఎగాదిగా చూడటం యీ సారి వాడి వంతు. అర్థము కాక, "అదేమిటి మామయ్యా" అన్నాడు వాడు.

"నా మాట మీద నీకు వీసమైనా విలువ వుంటే యింకెప్పుడూ, కథలు వ్రాయడము, గేయాలు అల్లడం యిటువంటి పిచ్చ పిచ్చ పనులేమీ చెయ్యకు. లక్షణంగా చదువుకొని బాగుపడవలసిన కుఱ్రాడివి."

పరీక్షగా చూచేడు వాడు మళ్ళీ నా ముఖం వంక, వాడి మెదడులో, ఎన్నో ఆలోచనలు, సందేహాలు కుప్పిగంతులు వేస్తున్నాయని నాకు తెల్సును. నా మెదడులోనూ మెరపుల్లా మెరసి అదృశ్యమయి పోతున్నాయి ఎన్నో ఆలోచనలు. అవి రేకెత్తించే స్మృతుల్ని గమనిస్తున్నాను నేను. నన్ను గమనించిన వాడు, యిదె అదననుకొని జారుకున్నాడు.

కొంచెము వోపిక పడితే వాడికి నేనెన్నో చెబుదామనుకుంటున్నాను. కాని వాడెందుకు ఆగుతాడూ?

అవడానికి చాలా దూరపు బంధువు వాడు మాకు. కాని దగ్గర దగ్గర యిళ్ళవటం వలన తరచుగ కలుసుకుంటూండే వాళ్ళము మేము. మా యింటి యజమానితో వచ్చిన పేచీతో కొద్ది దినాల్లోనే నాకూ వాళ్ళ యింటికి మైలున్నర ఎడము ఏర్పడింది.

ఇండ్లకు ఎడము ఏర్పడినా వాడు తరచు నాకు అగుపిస్తూనే వున్నాడు పత్రికలలో. నిరుత్సాహపరిచే నన్నుమాటేగాని అద్భుతంగా వ్రాస్తున్నాడు వాడు. ఇదివరకు రచయితల్లో లేని నవ్యత, సహజత్వ ద్యోతకమవుతూంది వీడి రచనలలో భావాలు చాలా సునిశితంగాను, వ్యంగ్య గాను వుంటున్నాయి. వాడిని పొగడ

పొడుచేయడం యిష్టంలేక వాడు రెండు మూడు సార్లు రోడ్డుపైన తారసిల్లినా తప్పించుకున్నాను.

కాని వూరుకోలేదు వాడు మాత్రం. రోడ్డుకు అడ్డంగా నిలవేసేడు వక రోజున నన్ను. ముఖం మీద కొట్టినట్లు అడిగేడు, తన రచనలు ఎట్లా వుంటున్నాయని. బాగానే వుంటున్నాయన్నాను. వాడిని మళ్ళీ రచనల విషయం ఎత్తనీయకుండా, "పరీక్షలకు బాగా చదువుతున్నావా?" అని అడిగేను. తల వూపేడు వాడు. "*B.A.* అయ్యేక ఏం చేస్తావు" అన్నాను వెంటనే. "ఏమో" అన్నాడు వాడు. లేడిలాగ బెదురు బెదురుగా చూస్తూ, "అయితే మామయ్యా, పత్రికల వాళ్ళు రచన వేసుకుని, కాపి అయినా పంపించరేమిటి?" అన్నాడు.

అదంతా రామాయణమంత గ్రంథం వుంది. ఎట్లా చెప్పను వీడికి! ఇదంతా నీకూ జరిగిందా అని నా ముఖం మీదనే అడిగెయ్యడూ వీడు? ఆలోచిస్తున్నాను.

అడిగేను విశ్వంను "ఒరేయి నువ్వు కళ కోసం వ్రాస్తున్నావా, కాసు కోసం వ్రాస్తున్నావా?" అని.

"సరదాగా వ్రాస్తున్నాను, దానిని నువ్వు కళ అను, మరేమను." అన్నాడు వాడు.

"బావుందయితే. సరదాగా వ్రాసే వాడవు, సరదాగా వో కాఫీ కొనుక్కో లేవురా?"

అమాయకంగ నవ్వేడు వాడు.

"ఇట్లాగ సరదాకోసం వ్రాయగలిగితే నే ముందు కూడా వ్రాయడం సాగించు. లేక పోతే చాలా బాధపడతావు."

"అదేమిటి మామయ్యా?"

"అంతే అది. నువ్వు సుఖాన వుండక రొచ్చులో కాలు పెడుతున్నావు— జాగ్రత్త."

వాడు వెళ్ళిపోతున్నాడు నెమ్మదిగా.

రెండేళ్ళ తరువాత కాబోలును, మళ్ళీ వాడిని కలుసుకోనడం సంభవించింది. అప్పటికి బ్యాంకిలో వుద్యోగం చేస్తున్నాడు వాడు. డబ్భయి రూపాయలు సంపాదిస్తున్నాడు వాడు. *B. A.* ప్యాసయ్యేడు వాడు.

కుశల ప్రశ్నలు, సమాధానాలు అయ్యేక వాడు చెప్పేడు-తనకు లేఖలు వ్రాసి కథలు తెప్పించుకొని ప్రచురించుకుంటున్నారుట సంపాదకులు;

"సెభాస్" అన్నాను.

"ప్రచురించబడిన రచనలకు పారితోషికం యిస్తామని కూడా వాళ్ళు పత్రికలో చెప్పుకున్నారు" అన్నాడు.

"బాగుంది."

"బ్యాంకి వాళ్లిచ్చే జీతం చాలక పోగా నెలకు పాతిక వరకు అప్పు చెయ్యవలసి వస్తోంది."

"ఎట్లాగో సరిపెట్టుకోవాలి సంసారాన్ని మరి."

"సంసారం సరిపెడుతున్నాను మామయ్యా. దినదినానికి దేశంలోకి అనేక అమూల్య గ్రంథాలొచ్చి పడుతున్నయి. అవి చదవాలని వుంటుంది." అన్నాడు.

"మరేమీ బాధ లేదు—మానెయ్యి."

"ఉజ్వల భావాలను వెదజల్లే రష్యన్, ఇటాలియన్ చిత్రాలు వస్తున్నయి. అవి చూడొద్దూ?" జాలిగా అడిగేడు.

"నువ్వు చూడకపోతే, ప్రపంచం మునిగిపోదు."

"ఇస్తానన్న వాళ్ళయినా ప్రచురించుకున్న రచనలకు డబ్బిస్తే—" ఏదో చెప్పబోతున్నాడు వాడు.

"విడవక పోయేవు." అని బయటకువచ్చి పడ్డాను. రచయితలంతా రావలసిన సుడిగుండంలోకి వస్తున్నాడు వీడూను!


ఆరు నెలల తర్వాత అగుపించేడు విశ్వం మళ్ళీ. ఐస్ పార్లర్ ముందు నిలబడి, తన వంకే చూస్తూ, ఏదో ఆలోచిస్తున్నాడు- బహుశా తనను పలకరిద్దామా, వద్దా అని కాబోలును.

"ఏరా విశ్వం, ఎట్లా వున్నావు?" అన్నాను నేనే.

"బాగానే వున్నాను మామయ్యా." అన్నాడు.

"ఎట్లావుంది నీకళ," అడిగేను.

ఈ ప్రశ్న కోసమే ఎదురు చూస్తున్న వాడివలె వెంటనే అన్నాడు వాడు, "ఈ



పూరిలో వకాయన నా కథలు పుస్తక రూపంలో వేస్తానంటున్నాడు మామయ్యా నీ సలహా అడిగి-"

"పేరేమిటి అన్నావు?"

"శ్రీరామలక్ష్మయ్య."

"నా మాట వింటావా-చెబుతాను"

"చెప్పు మామయ్యా."

"వాడికే కాదు-ఎవ్వరికీ యియ్యకు. ముఖ్యంగా వాడికి అసలు యివ్వకు. నీ స్వంత ఖర్చులతో ఏనాడైనా అచ్చు వేయించుకో గల్గితే వేయించుకో, అంతే."

"ఆయన చాలా మర్యాదస్తుడు మామయ్యా."

"ఎవరు కారు?"

"చాలా నమ్మకంగాను, గౌరవంగాను అవుపిస్తాడు."

"ఏమంటావు అయితే."

"ఇంత నమ్మకంగా మాట్లాడే మానవుడు తోటి మానవుడిని చూస్తూ చూస్తూ మోసగిస్తాడా మామయ్యా."

"మానవుడిని మోసగించక, జంతువుల్ని మోసగిస్తాడా? ఆయనతో మాత్రం వ్యవహారాలు పెట్టుకోక, వృధా ప్రయాసపడతావు."

"అదేమిటి మామయ్యా-ఆయన చాలా పెద్దమనిషి-"

వాడికి మానవుడి మీద అనంతమైన విశ్వాసం. అనిర్వచనీయమైన ప్రేమ. మానవుడిని మానవుడు హింసించగలడని గాని, మోసగించగలడని గాని నమ్మడు వాడు. మోసం ఎరగని వీడు రచయిత ఎందుకు అయ్యాడో తెలియదు తనకు.

"నీ బొంద." వెళ్ళిపోయేను నేను.

మళ్ళీ నేను వాడిని, ఆరు నెలల తర్వాత వాడి యింట్లో కల్సుకున్నాను. వాడికి జబ్బుగా వుందని విని చూడటానికి వెళ్ళేను. నేను వెళ్ళేసరికి మంచంమీద పడుకుని దగ్గుతూనే, వాడేదో పుస్తకము చదువుతున్నాడు.

చెప్పుల చప్పుడుకు పుస్తకాన్ని దించి, "రా-మామయ్యా." అన్నాడు హీన స్వరంతో.

మనిషి చిక్కి శల్యమైవున్నాడు. దీనికి తోడు అపరిమితమైన కళ్ళతో కూడినదగ్గు.

"ఎన్నాళ్ళనుంచి యీ జ్వరం." అడిగేను

"నెల దినాలయ్యిందిగా బాబూ! ఇంత జబ్బులోనూ ఆ పాడు పుస్తకాలను వదలమంటె వదలడు. ఒకటే చదువు, వకటే రాత! ప్రాణం తీయడానికే వొచ్చింది చదువు." అంటూ వచ్చింది వంటింట్లోంచి ముసలమ్మ.

"అదే తగ్గిపోతుందిలే అక్కయ్యా... నువ్వు నీ పని చూసుకో." అన్నాను. ముసలమ్మ సణుక్కుంటూ వెళ్ళిపోయింది లోపలకు

"ఏమిట్రోయి జ్వరంలో కూడా చదువేమిటి. పూర్తిగా విశ్రాంతి తీసుకోక. డాక్టర్ ఎవ్వరు?"

"గోవిందరావుగారులే అన్నట్లు నా కథల పుస్తకం అచ్చయ్యిందని మొన్నే వా మామయ్యా ఆ అల్మారాలో వుంది ... . ... మంచి 'రివ్యూస్' వచ్చేయి"

కుతూహలంగా చూచేను. మంచి 'రివ్యూస్' వుండటం చూచేను. హక్కులన్నీ ప్రచురణకర్తవి అని కూడా వుండటం చూచేను

"ఎంత యిచ్చేడురా, అబ్బీ!" అడిగేను.

"డబ్బును యిబ్బందిగా వుందిట త్వరలో నే యిస్తానన్నాడు"

"హుం. అడ్వాన్సు.. ఎంతని?"

"అరవయి"

"వెయ్యి కాపీలకేనా."

"అవును."

"హక్కులన్నీ అతను తీసుకునా?"

"హక్కుల సంగతి నాదే తప్పు మామయ్యా. నేనేమీ ముందు మాట్లాడలేదు"

"మాట్లాడకపోతే మాత్రం, బోడి అరవయి రూపాయలిచ్చి హక్కులన్నీ తీసుకుంటావట్రా వాడు?"

"ఆయనట్లా తీసుకునే రకం కాదు గాని ఏదో పొరపాటై వుండొచ్చు...ఎట్లా వుంది ముద్రణ?? అన్నాడు దగ్గుతో వుక్కిరిబిక్కిరి అవుతూ

"బాగానే వుంది అయితే ఆ అరవయి అయినా యివ్వలేదు యింతవరకు?"

"ఇస్తాడు పాపం! ఆ మధ్య అడిగితే, అప్పుడే పండగవచ్చింది భార్యకు నెక్లేసు చేయిస్తానని వాగ్దానం చేసేడుట. తర్వాత పాపం పేపరు కొనాల్సి వచ్చిందిట. బోలెడు పెట్టుబడి బ్లాకులో."

"అయినదేదో అయ్యింది గాని, ఇంక వాడితో వ్యవహారాలేమీ పెట్టుకోక."

"నేనంటే చాలా అభిమానం మామయ్యా ఆయనకు. ఆమధ్య 'జంగిల్' అనేదొక ఫ్రెంచి రచన మరెవ్వరికీ యివ్వక నాకే యిచ్చేడు అనువదించమని నా శైలి చాలా బావుంటుందని మెచ్చుకున్నాడు ఎన్నో సార్లు"

"ఊఁ ఒప్పుకో లేకోకదా నువ్వు."

"ఒప్పుకున్నాను. రెండువందల రూపాయలు యిస్తానన్నాడు మామయ్యా... రెండువందలు దాంతో ఎన్నో ప్రఖ్యాత గ్రంధాలు కొనుక్కోవచ్చును."

"మూలం ఎన్ని పేజీలుంది?"

"మూడొందల ఎనభయి"

"హు, తర్వాత?"

"వందపేజీలు చెయ్యగానే. కథల తాలూకు అరవయి రూపాయలు, దాని తాలూకు బజానావంద, రెండు కలిపి యిచ్చేస్తానని వాగ్దానం చేసేడు."

"మరి చేసెయ్యక పోయేవు ..మందుల కన్నా పనికివచ్చేది?" వ్యంగ్యంగా అన్నాను

"చేసేను."

"ఈ రోగంలో కూర్చుని వ్రాస్తున్నావా?" తల వంచుకున్నాడు వాడు.

"ఇచ్చేడా నూట అరవైరూపాయలు."

"ఊ త్వరం వ్రాసేను వెళ్లలేక."

"ఒచ్చేడా యిక్కడికి?"

"ఊళ్లో లేనట్లున్నాడు, సమాధానం లేదు"

"మళ్లీ వ్రాయకపోయేవు?"

"వ్రాసేను"

"ఇట్లా జబ్బుగావుంది, అవస్థపడుతున్నానని వ్రాసేవా?"

"వ్రాసేను."

"ఏమన్నాడు మరి."

"మీ రుణం వుంచుకోను. ఎట్లాగో వకలాగ పది దినాల్లో పంపుతున్నానన్నాడు. అర్జంటుగా పిల్లలను బెంగుళూర్ తీసుకెళ్లుతున్నానన్నాడు."

"ఎన్నాళ్లయ్యింది యిది వ్రాసి?"

"పన్నెండురోజులు."

"ఇంతవరకు ఏమీ లేదు?" అడిగేను.

"పాపం ఆయనకెంత యిబ్బందిగా వుందో. తొందర పెడితే ఎట్లా మామయ్యా. ఎల్లాగో వకలాగ దీన్ని పూర్తిచేస్తా యీ రోగం కాస్త తగ్గితే. ఈ గ్రంథంలో నా పేరు దిగంతాల వ్యాపిస్తుంది మామయ్యా, ఎటువంటి అమూల్య భావాలు వున్నాయి యిందులో!" వాడి కళ్లు మెరుస్తున్నాయి.

"ఆ చదివేది అదేనా..."

"అదే మామయ్యా.. జంగిల్..."

"నీ కర్మ..." లేచేను. మందులకు వాడమని వక యాభయి ముసలమ్మ చేతిలో వుంచి బయటకు వచ్చేసేను.

మరునాడు శ్రీ రామలక్ష్మయ్య గోర్కు పైన అవుపెంచేను. చిరునవ్వు నవ్వుతున్నాడు విశ్వం అవస్థచెప్పి ఏమైనా పైకం వుంటే పంపి సాయం చెయ్యమన్నాను చిరునవ్వుతోనే అన్నాడు ఆయన "అరే–యిప్పుడే ప్రెస్సు కొనడానికి వున్నదంతా యిచ్చేసేనండీ"

ఆ వారంలోనే విశ్వం యీ విశాన్ని వదలి వెళ్లిపోయేడు.

వాడి పేరు దిగంతరాల వ్యాపించడానికి కొన్ని యుగాలు పట్టవచ్చును. కాని యీలోగా శ్రీరామ లక్ష్మయ్యలు మాత్రము మేడలు కట్టుకోవచ్చును, నెక్లేసులు చేయించుకోవచ్చును, ప్రెస్సులు కొనుక్కోవచ్చును.

[ఒకి అడవియిది. ఇందులో ఆకలిగొన్న మృగరాజులున్నాయి.] ★

# నా రాజీనామా

(5-వ పేజీ తరువాయి)

అవసరంకూడా అప్పట్లో అతడికి లేక పోయింది.

మధు ఉపాధ్యాయుడయ్యాడు. వివాహంకూడా అంతకుపూర్వమే అయిపోవడంవల్ల ఇంక అతను నిరపాయంగా జీవితం గడపొచ్చు అనుకున్నాడు. కాని అయిదు సంవత్సరాలు గడిచేటప్పటికల్లా ఆ వృత్తిమీద విసుగు పుట్టించే ఘట్టాలు అనేకం చూశాడు. ఉపాధ్యాయవృత్తి తను మొదట్లో అనుకున్నంత స్వేచ్ఛాయుతమైనది కాదని తేలిపోయింది. అధికార ప్రాబల్యం అందులోనూ అనుకున్నంత దానికంటె ఎక్కువే ఉందని గ్రహించాడు. రాజీనామా ఇచ్చేద్దామనుకున్నాడు కాని ఆనాటి కానాడు అతనిలోని ధైర్యాన్ని మ్రింగివేసింది వృత్తి.

అది అతని మొదటి సంవత్సరం. ఆ సంవత్సరంలో బ్రిటిష్ పద్ధతుల్లో తర్ఫీదుపొందిన ఉన్నతోపాధ్యాయుని క్రింద పనిచేయవలసివచ్చింది. తన మంచితనాన్ని అతగాడు ఉపయోగించుకోకపోగా దుష్టశక్తులను దరిచేరనిచ్చాడు. విద్యార్థులకు మధుపట్ల గల అచంచల విశ్వాసంతో కొట్టుకొనివచ్చాడు గాని లేకపోతే రాజీనామా నిచ్చేశేవాడు. దాంతో విద్యాసంస్థల్లో కూడా అసమానత్వము, అధికార ప్రయోగానికే అవకాశం హెచ్చు ఉండడం అతడు సహించలేకపోయ్యాడు.

విద్యార్థుల విషయంలో మధుకు గాఢమైన విశ్వాసం ఉంది. తలిదండ్రులు ఉపాధ్యాయుడు పిల్లల విషయంలో చేసే కృషికి ఎప్పుడూ హర్షం వెలిబుచ్చుతారనే ధీమాలో ఉండేవాడు. ఆ ధీమాతోనే ఒకనాడు నేరస్థుడైన విద్యార్థిని కొట్టాడు. ఆ గ్రామంలో ఆ విద్యార్థి తండ్రి పలుకుబడిగల నాయకుడవడంవల్ల మధు ఉనికికే మోసం వచ్చింది. ప్రాణంకోసం పారిపోయి రావాల్సొచ్చింది.

పాఠశాలా వాతావరణాన్ని రాజకీయాలతో కలుషితం చేయకూడదనే మనస్తత్వం కలవాడు మధు. కాని ఒక సంవత్సరంలో అతడు రాజకీయాలతో సంబంధంగల ఒక ఉన్నతోపాధ్యాయుని క్రింద పనిచేయాల్సివచ్చింది. మధుని విద్యార్థులలో చులకన చేయాలనే దృష్టిలో అతడు తన రాజకీయ పక్షానికి చెందిన విద్యార్థులను అతని మీదకు తోలడం మొదలుపెట్టాడు. అది అతనికి చేతకాకపోయినా మధు విద్యార్థులలో తన స్థానాన్ని నిలవదొక్కుకోటానికి చేసిన ప్రయత్నాలలో అతని బుర్ర పోయింది.

ఆశలన్నీ పోగా మధుకి ఒకే ఒక ఆశ నిలబడిపోయింది. తనక్రింద చదివిన విద్యార్థులు పెద్దయి దేశ నాయకులుగాను పెద్ద పెద్ద ఉద్యోగస్థులుగాను అయిననాడు తను వాళ్ళని చూసి గర్వపడవచ్చునని, వాళ్లు తనకు కృతజ్ఞులుగా యుంటారనిన్నీను. అందుకే తన అయిదేళ్ళ జీవితంలోను అటు ఉన్నతోపాధ్యాయునికి ఇటు గ్రామస్థులకు ఎదురు నిలబడి లేత మనస్సుల పురోభివృద్ధికి హృదయపూర్వకకృషి సల్పాడు. బంధువులు, మిత్రులు తన ఉద్యోగాన్ని చూసి హేళన చేస్తున్నా విద్యార్థులమీద తన విశ్వాసాన్ని కోల్పోలేదు.

క్రమంగా మధుకు విద్యార్థులమీద నున్న విశ్వాసంకూడా సడలింది. దేశంలో వస్తున్న మార్పులన్నీ పాఠశాలల్లోకూడ ప్రవేశించి లేత మనస్సులనుకూడ పెడదారిని పెట్టిస్తున్నట్లు గమనించాడు.

ఒకనాడు మధు తన తరగతి పిల్లలను, అడిగాడు. 'ఉపాధ్యాయులకు విద్యార్థులకు మధ్య సంబంధం ఎట్లా ఉండాలి?' ప్రకాశ్ చివాలున లేచి, 'ఉపాధ్యాయులకు జీతాలు మేము ఇస్తున్నాము కాబట్టి మమ్మల్ని కొట్టకుండా మా ఇష్టప్రకారం చదువు చెప్పాలండీ' అన్నాడు. మధు చమత్కారంగా అన్నాడు. ఒరేయ్. మీ తల్లిదండ్రులు మాకు జీతాలిస్తున్నారు కాబట్టి వాళ్లకు లోబడి ఉండాలంటున్నారు. మీరు మీరిస్తున్నారు కాబట్టి





మీకు లోబడి ఉండాలంటున్నారు. మాపై అధికారులు జీతాలు వాళ్లు ఇస్తున్నారు కాబట్టి వాళ్ళకు లోబడి ఉండాలంటున్నారు. మేము ఎవరికి లోబడి ఉండాలో అర్థం కావడం లేదు.' చమత్కారంగా మధు తప్పించుకున్నాడు గాని నేటిపిల్లల హృదయాల్లో ప్రవేశించిన మార్పు గ్రహించలేకపోలేదు.

నేటి విద్యార్థుల దృక్పథం అతనికి పూర్తిగా అర్థమయింది. తమను ప్రేమించి తమ పురోభివృద్ధికై పాటుబడుతున్న ఉపాధ్యాయుని యెడ కన్న తమకు అప్పుడప్పుడు కన్పించి సలహానొసంగే బయటి నాయకుల యెడనే వారికి విశ్వాసమెండని గ్రహించాడు. ఆనాడు ప్లాటుఫారంమీద, రైలుపెట్టెలో జరిగిన విషయాలు చక్కటి నిదర్శనాలనుకున్నాడు. మధు ఆవిశ్వాసం, కృతజ్ఞత లేనిదే తనెందుకా వృత్తిలో నుండటం? హాయిగా విజ్ఞానాభివృద్ధి చేసుకుంటూ స్వతంత్రంగా జీవించగల తనకు ఒకరి క్రింద దాస్యమెందుకు?

బెజవాడనుంచి తిరిగివచ్చాడు కాని మధు మనస్సు కుదటపడలేదు చలించింది. చలించడంలో పూర్తిగా చలించింది. మనస్సు ఎంత ప్రయత్నించినా మారే సూచన కన్పించలేదు.

కలక్టరు చెయ్యడా అని ఆశపడిన మధు తల్లి కనీసం మాస్టరీ గిరి అన్నా చేస్తూండమని బ్రతిమాలింది. తండ్రి కూడా చెప్పి చూశాడు. బంధువులంతా ఆ ఉద్యోగానికేం రాజాది అని నచ్చచెప్ప ప్రయత్నించారు. గ్రామస్థులు హాయి అయిన ఉద్యోగాన్ని వదలద్దన్నారు. కొంచెం నాయకుల మనుకొన్నవారు దేశానికి ఉపాధ్యాయుల అవసరం ఎంతో నిరూపించ ప్రయత్నించారు. భార్య వదలద్దంటే వదలద్దని ప్రాధేయపడ్డది.

అంతరాత్మ ప్రబోధాన్ని ఎవరూ ఆపలేరు. మధు తన ఉద్యోగానికి రాజీనామా ఇచ్చాడు. మధు రాజీనామా ఇటు సోదరోపాధ్యాయుల్ని అటు బంధవుల్ని ఆశ్చర్యచకితుల్ని చేసింది.

మధు మనస్సు ఉపాధ్యాయునికి సంఘంలో గౌరవస్థానాన్ని కల్పించే మార్గాలపై తిరిగింది. వారం రోజులు గడిచిపోయినాయి. అతని రాజీనామాను పై అధికార్లు ఆమోదించరని అందరూ అనడం మధు మనస్సుకు అశాంతిని కలుగజేసింది. తెల్లవారితే దానికి సంబంధించిన వర్తమానము పోస్టులో వస్తుందని ప్రయివేటుగా మధుకి తెలిసింది.


మధుకు స్వగ్రామంలో బ్రహ్మాండమయిన సన్మానం ఏర్పాటు చేయబడింది. సభాస్థలి చక్కగా పుష్పాలతోనూ రంగు కాగితాలతోను అలంకరింపబడింది వేదికపై మధుని ఆశీనుణ్ని చేశారు. గ్రామంలోని వివిధ వృత్తుల్లోని ఉద్యోగులు సన్మానపత్రాలను సమర్పించారు. మధు మెడలో మోయలేనన్ని పూలమాలలు వేశారు. మధు గ్రామంనుంచే వెళ్లిన మంత్రి కూడా ఆనాటి సభకు హాజరయి ఉపాధ్యాయునికి శాసనసభల్లోను ఇతర ముఖ్య సంస్థల్లోను ప్రాతినిధ్యం ఇచ్చేటట్లు చూస్తానని హామీ ఇచ్చాడు. మధు ఉన్నతాధికారి కూడా సభకు హాజరయి ఉపాధ్యాయుని జీతం హెచ్చు చేస్తానని వాగ్దానం చేశాడు. సంఘంలో ఉపాధ్యాయుని గౌరవాన్ని ఇనుమడింపజేసే పద్ధతుల్ని కొన్నిటిని తనకు సూచించవలసిందిగా కోరి రాజీనామాను ఉపసంహరించుకోమని కోరాడు. విద్యార్థులు కూడా కొంతమంది హాజరయి తమ గురుకట్నాలను సమర్పించారు. పత్రికారచయితలు ఉపాధ్యాయ సమస్యలపై విపులమైన రచనలుసాగించి ప్రచారం చేస్తామని ఉద్ఘాటించారు. మధు అందరి మన్ననలను స్వీకరించి తగురీతిగా సమాధానం చెప్పాడు. జయ జయ ధ్వానాల మధ్య సభ ముగిసింది. మధు గౌరవార్థం ఆనాడు అతడు వ్రాసిన 'ఉపాధ్యాయు'డనే నాటకాన్ని ప్రదర్శించారు విద్యార్థి నాట్యమండలివారు.

నాటకం పూర్తిఅవకముందే మధు తనకై ప్రత్యేకముగా ఏర్పాటు చేయబడిన కారులో ఇంటికి బయలుదేరాడు. దారి మధ్యలో ఉండగానే అతనికి భుజముపైన బలమైన దెబ్బలు తగలడంవల్ల చివాలున లేచి నుంచున్నాడు. విప్పారిన కండ్లకు భార్య అప్పుడే పోస్టుమన్ తెచ్చిన కవరుతో కన్పించింది. కవరుచింపి చూసుకునేసరికి.

'నీరాజీనామా అంగీకరించబడింది' అని తన ఉన్నతాధికారి వ్రాసిన వాక్యం మాత్రం ఉంది. అప్పుడర్థమయింది మధుకి తను ఒక దివ్యస్వప్నంలోంచి వచ్చినట్లు.

★





# చదువుకున్న భార్య

[రామ్మూర్తిపంతులు. వెంకట్రామయ్య. సుబ్బమ్మ, ప్రకాశం, కాంతం.]

రా: ఆఁ!-అయితే పిల్లవయస్సు ఎంతన్నారు?

వెం: ఏదండీ, మొన్న భోగీపండుక్కి పద్దెనిమిదేళ్లొచ్చాయి. మీ అబ్బాయి వయస్సు ఇరవై రెండేళ్లు గనుక ఈడు బాగా కుదురుతుంది.

రా: ఇదివరకు వెయ్యి రూపాయిలు కట్నం ఇంకా ఇతర లాంఛనాలు అన్నీ యిస్తామని చెపుతూ చాలామంది చెప్పొచ్చారు. కాని ఒక్క పిల్లా మావాడికి నచ్చలేదు.

వెం: అవును మరి!-పెళ్లా?-కూరగాయల బేరమా?...మంచీ చెడ్డా చూసి చెయ్యాలి!

రా: ముఖ్యంగా పిల్ల చక్కనిదీ, చదువుకున్నదీ అయివుండాలి!

వెం: అవును, ఈ కాలంలో ముఖ్యంగా చూడవలసిన వారెండే!

రా: అయితే, పిల్ల ఎంతవరకు చదువుకుంది?

వెం: స్కూలు ఫైనల్ పాసయిందండీ!-టైపు, షార్టుహేండు కూడా బాగా వచ్చును.

రా: అయితే బాగుంది!-ఇంతవరకు స్కూల్ ఫైనల్ పాసైన అమ్మాయినే కాని మరి రెండో పిల్లని పెళ్లాడనని మావాడు పట్టుపడుతున్నాడు లెండి!

వెం: అవునండీ!-ఈ కాలంలో ఆపాటి చదువేనా లేకపోతే పనికిరారు.-

(అయిదునిముషాలు నిశ్శబ్దం)

రా: అయితే పిల్లని చూపిస్తారా?

వెం: ఆఁ!- ఇదుగో యిప్పుడే చూపిస్తాం!...(బిగ్గరగా) అమ్మాయ్, కాంతం! -ఇలా ఓసారిక్కడికి రామ్మా!-

(కాంతం వచ్చి కొంచెం సిగ్గు నభినయిస్తూ తల వంచుకొని తలుపు చాటున నిల్చుంటుంది)

వెం: సిగ్గెందుకమ్మా?-అదిగో అలాగా చాపమీద కూచో!

(కాంతం కొంచెం దూరంలో చాప మీద కూచుంటుంది)

రా: నీపేరేవిఁటమ్మా?

కాం: కాంతం.

రా: అయితే ఏ సంవత్సరం స్కూల్ ఫైనల్ పాసయావమ్మా?

కాం: మార్చి ఫార్టీనైనులోనండి?

రా. పరీక్షల్లో మార్కులెలాగ వచ్చాయమ్మా?

వెం: మార్కులు చాలా బాగా వచ్చాయండీ!-ఏ సబ్జక్టులోనూ ఏభై మార్కులకి తగ్గలేదు. మొత్తం అన్నీ కలిపి మూడువందల యాభై మార్కులొచ్చాయి.

రా: చాలా బాగుంది!-అయితే పాటా అదీ ఒచ్చునా?

వెం: ఒక్క పాటేవిఁటండీ!... ఫిడేలు, వీణ, హార్మనీ వాయిస్తుంది!

రా: అయితే మావాడికి తగిన పిల్లేనండి!-అన్నట్టు సినిమాపాటలు పాడగలదా?

## శ్రీ పంతుల కృష్ణారావు

వెం: ఎక్కువగా సినీమాపాటలే పాడుతుందండి!

రా: శేష్!-అయితే ఇంక మరేముంది? -ఏవిఁరా ప్రకాశం!...నువ్వేమంటావ్?

ప్రకా: ఏవొచ్చునో ఎలా వచ్చునో ఓసారి చూడాలి నాన్నా!

వెం: ఓ!-దానికేం అభ్యంతరం వుంది? తప్పకుండా చూడవలసిందే?... అయితే మొదట పాట పాడించమన్నారా?

ప్రకా: మొదట నడవమనండి!

వెం: ఏదమ్మా?-అల్లంతదాకా నడిచి వెళ్లొస్తావా?

(కాంతం పదిహేనడుగులదూరం నడిచి వెళ్లివస్తుంది)

వెం: ఇందులో మీకేమీ అనుమానం లేదుకదాండీ?

రా: ఇందులో ఏమీ దోషం లేదు. కాని క్షమించండి! వివాహవిషయం గనుక మీకెక్కువగా శ్రమ కలిగించి నిర్మొగమాటంగా ప్రవర్తించవలసి వస్తున్నాది.

వెం: అయ్యో, ఎంతమాట!-పెళ్లిచూపుల్లో ఈపాటి శ్రమ అందరికీ వుంటుంది. ఇలాటప్పుడు మొగమాటపడి వున్న అనుమానాలు తీర్చుకోవడం మానేస్తే తర్వాత అదే కొంపతీస్తుంది...దానికేం లెండిగానీ ఇంక మరేమేనా చూడాల్సివుందేమో చెప్పండి!

రా: చూడ్డానికి మరేం అనుమానాల్లేవు; కానీ మావాడే పిల్లకి ఏందులో ఎంత ప్రవీణత వుందో తెలుసుకుందామని ఉబలాట పడుతున్నాడు.

వెం: ఓహో!-అలాగా?-అయితే కానివ్వండి మరి?

ప్రకా: (చేతిలోవున్న 'హిందూ' పత్రికనిస్తూ) ఏదీ, ఈ పత్రికలోనిది ఏదో ఓపేరా చదవమనండి!

వెం: ఏదమ్మా?-ఎలా చదువుతావో వింటారట ఈ పత్రికలోది ఓపేరాచదువు!



(కాంతం చేపట్టుకొని ఒకపేరా స్పష్టంగా వేగంగా చదువుతుంది)

ప్రకా: బాగా నే వుంది!—దస్తూరి ఎలావుంటుందో ఓసారి ఇంగ్లీషులో రాయమనండి!

(కాంతం కలంతీసికొని కాగితంమీద రాసియిస్తుంది)

ప్రకా: దస్తూరికూడా చాలా బాగుంటుందండీ!...పాటకూడా పాడించండి!

వెం: ఒక్కపాటే ఏమిటి? ఫిడేలు, వీణ, హార్మనీకూడా వాయిస్తుంది విందురుగాని!...ఏదమ్మా!—ఏదో ఒక మంచి సినీమా పాట పాడు!—హార్మనీ అవీ గదిలో వున్నాయి తెమ్మన్నా తెమ్మను!

(కాంతం హార్మనీ వాయిస్తూ 'ఓహోహో, పావురమా!' అని పాడుతుంది)

ప్ర: పాట చాలాబాగుంది!

వెం: ఫిడేలు, వీణ వాయిద్యాలుగూడా విందురుగాని!—ఏమమ్మా?—ఆరెండుకూడా వాయించి వినిపించు.

(కాంతం ఫిడేలు కొంతసేపు, వీణ కొంతసేపు వాయించుతుంది)

ప్రకా: భేష్!—చాలా బాగుంది!

వెం: అయితే మా అమ్మాయిని పెళ్లాడ్డానికి అంగీకరించినట్టేనా?



ప్రకా: నాకు అంగీకారమే!

రా: నీ అంగీకారం అయితే నాకేం అభ్యంతరం?—అయితే ముహూర్తం స్థిరపరిచేవొచ్చా?

ప్రకా: స్థిరపరిచేవొచ్చు!

వెం: అయితే మరెందు కాలస్యం బావగారూ!—వేగంగా దగ్గర ముహూర్తం పెట్టించండి!

రా: అన్నీ అవుతాయి కానీ మీ అమ్మాయి యేమంటుందో అడగండి!

వెం: అమ్మాయి యేమంటుంది?—దాని కిష్టమే?—ఏమంటావమ్మా? నీ కిష్టమేనా?

(కాంతం అంగీకార సూచకంగా చిరునవ్వునవ్వి సిగ్గుతో తల వంచుకుంటుంది)

వెం: అదిగో, దానికంగీకారమే బావగారూ! అంచాత దగ్గరముహూర్తం పెట్టించండి! పెళ్లిలోనే కార్యంకూడా జరిగిపోయేలా రెండింటికి ముహూర్తాలు ఏర్పాటు చేయించండి!

రా: పెళ్ళయిన వెంటనే కార్యం కూడా జరిగిపోవాలనే నా వుద్దేశమూను!

వెం: అంచాతే రెండూ వేగంగా జరిగిపోవడం మంచిది.

రా: సరే, ఇంక మేం వెళతాం!

వెం: భోజనం చేయకుండా ఏమిటండీ?—భోజనంచేసి మధ్యాహ్నం ప్యాసింజరులో బయల్దేరి వెళ్ళుదురుగాని ఈపూట కిక్కడ వుండిపొండి!

*  *  *  *

సు: అయితే యేమయిందండీ?—పిల్ల యెలావుంది? తెల్లగావుందా? నల్లగావుందా? ఏమేనా చదువుకుందా?

రా: అబ్బబ్బబ్బ!—ఊపిరి తీసుకోనిస్తావా లేదా? అమాంతంగా అన్ని ప్రశ్నలే వర్షంలా కురిపించేస్తే జవాబు చెప్పాలా?

సు: (చిరుకోపంతో) పోనీ, అడగగ్గాండి—అవును, అడగడానికి నేనెవర్ని!—నాకొడుకు పెళ్లిసంగతి అడగడానికి నాకెక్కడ అధికారంవుంది?

రా: సరి!—విసుక్కోద్దీ నోరు జారి ఏదో మాటంటే ఇంక ఆరంభించింది గోల!

సు: పిల్లెలావుందని అడిగితే విసుగెందుకొచ్చింది?

రా: (కోపంతో) ఏదో గ్రహచారం కొద్దీ వచ్చింది?—ఇంక శాంతించు.

(సుబ్బమ్మ శాంతిస్తుంది. నిశ్శబ్దంగా అయిదు నిముషాలు గడుస్తాయి)

సు: అయితే పిల్ల బాగుందా?

రా: పిల్ల బంగారుబొమ్మలా వుంది. ఆరోఘారం ప్యాసైంది. బాగా పాడుతుంది. ఫిడేలు, వీణ, హార్మనీ వాయిస్తుంది.

సు: మన ప్రకాశం ఏమన్నాడు?

రా: ఇంకా అనడమేమిటి?—ఎన్నెన్ని పరీక్షలున్నాయో అన్ని పరీక్షలు చేసి

వ్వకుండా పెళ్ళాడుతానని వాళ్ళతోనే చెప్పేశాడు. కట్నకానుకలు మనం కోరినవి వాళ్ళిచ్చేస్తామన్నారు.

సు : అయితే ఇంకా మరేం ఆలోచన వుంది ?

రా : ఆలోచనకి మరేమీ లేదు. దగ్గర ముహూర్తం చూసి వేగంగా జరిపించడమే తరువాయి!

సు : అన్నట్టు !—పెళ్ళయిన వెంటనే కార్యంకూడా జరిగి పోవాలని చెప్పేరు కదూ ?

రా : మనం అనవలసిన మాట వాళ్ళే అన్నారు పెళ్ళికి, కార్యానికి ముహూర్తం పెట్టించేమని !

సు : అయితే బాగుంది!—మూడు ముళ్ళూ పడి కార్యంకూడా అయిపోతే దాన్నిప్పుడే తనున్న వూరికి తీసుకుపోతాడు. అది వండి పడేస్తూవుంటుంది కనుక మరి మన ప్రకాశంకి హొటేలుభోజనం బాధ వుండదు. లేకపోతే ఆ భోజనం చేయలేక యెంతో యిబ్బంది పడును

రా : మరి వాడికి వండి పెడుతూవుంటుందనేకదూ తొందర పడుతున్నాం?

సు : పోనీ, తొందర పడ్డందుకు మంచి సంబంధమే దొరికింది.

రా : మంచిదంటే యిలాంటిది అలాటిదీనా ?—ఇంతవరకూ అలాటి అందమైన పిల్లనీ, తెలివిగల పిల్లనీ, చురుకుగల పిల్లనీ నే నెక్కడా చూడలేదంటే నమ్ము!—ఇప్పటి మొగసుంటలకంటే ఇదే నయం!—లైఫు, మార్తు హోంకూడా బాగా వచ్చునట!

సు : శభాష్ !—అన్నిటిలో నీ ప్రవీణురాలులా వుంది.

రా : మరేమిటనుకున్నావ్ ?—అన్నివిధాలా మనవాడికి తగిన భార్య.

సు : అయ్యో!—ఇన్నీ అడిగి పేరేమిటో అడగలేదు.

రా : ఎవరి పేరు?—పిల్లపేరా ?... కాంతం ?

సు : పేరుకూడా యెంతో బాగుంది.—వేగంగా ముహూర్తాలు పెట్టించీయండి !

రా : ఇదిగో, యిప్పుడే అవధాన్లుగారి దగ్గరికి వెళ్ళి పెళ్ళికి, సారెకి ముహూర్తం పెట్టించీను ?

*　　　*　　　*　　　*

ప్రకా : ఇదిగో, కాంతం !—ఈరోజే మన సంసారిక జీవితానికి ప్రారంభదినం!—ఇదిగో బజారునుంచీ సామాన్లు తెచ్చాను. ఎలా చేస్తావో ?— చెప్పడానికేనా మనవాళ్ళెవరూ లేరు. అంచాత జాగ్రత్తగా చూసుకోవాలి. కావలసినవన్నీ తెచ్చాను. మొదట వంట ప్రారంభించు !—మళ్ళీ పదిగంటలకి ఆఫీసుకి పోవాలి !

కాం : అయ్యో !—నాకు వంటచేయడం రాదే!

ప్రకా : అదిగో, ఇప్పుడే ఆరంభించావూ ?—ఇంకా ముందల్లా వుంది లే నీ పేచీలకి కాలం!

కాం : అయ్యో !—నిజంగా నాకు వండడంరాదండీ !

ప్రకా : మరి పేచీ పెట్టుకు !—నీకు వంటరాక పోవడమేమిటి ?—పోనీ ఎలా చేతనైతే అలాగే వండు ! లేమరి !—త్వరగా కానీ !

కాం : చెప్తే నమ్మరు కదా !—నాకు వంటచేయడం రాదండీ బాబూ! ఆఖరికి కాఫీ డికాషన్ కూడా చేయలేను.

ప్రకా : (కోపంగా) కాంతం !—ఏమిటీ పెంకితనం ?—వంట చేస్తావా లేదా ?

కాం : (సీరియస్ గా) నాకు వంటరాదని యిందాకటినుంచీ చెబుతున్నాను. మీరు వినకపోతే నేనేం చేయగలను ?

ప్రకా : (కోపంతో) ఆడదానివై యుండి వంటచేయడం రాదంటే నల్గురు నవ్వుతారనేనా సిగ్గు వుండనక్కరలేదూ ?

కాం : ఈ ఆధునిక యుగంలో స్త్రీలకు వంట నేర్చుకు తీరాలన్న నిర్బంధం లేదు.

ప్రకా : (అధికమైన కోపంతో) ఎవళ్ళో బ్రహ్మచారిణి ముండలకి లేకపోతే నీకు లేదూ ?—అలా అయితే పెళ్ళి చేసుకు వెలగబెట్టి మొగుడికెలా వండి పెడదామనుకున్నావ్ ?

కాం : నాచేత వండిపెట్టించుకు తినడానికి మీరు నన్ను పెళ్ళాడుతున్నారని అనుకోలేదు.

ప్రకా : అయితే మరెందు కనుకున్నావ్ ?—అమ్మశక్తిలాగ నిన్నింట్లో కూచోపెట్టుకొని నేను వండడానికా ?

కాం : ఏమో !—నాచేత ఎక్కడైనా ఉద్యోగం చేయించుతారేమో ననుకున్నాను.

ప్రకా :(కోపంతో) కాంతం !—ఏమిటీ వేషం ?— వంటచేయడం యెందుకురాదో చూస్తాను ! మొదట కుంపటి రాజెయ్యి !

కాం : నాకు రాదని చెబుతున్నాను. ఇంక నన్నాపనికోసం నిర్బంధించకండి!—కావలస్తే వర్కెలాగో చెప్తే మీ ఆఫీసు వర్కంతా ఒక్కరోజులో చేసేస్తాను.

ప్రకా : ఇంక ఆపనే మిగిలిపోయింది!—అయితే వంటరాదని పెళ్ళిచూపుల కొచ్చినపు డెందుకనలేదు ?

కాం : మీరు నాచేత వండిపెట్టించుకుందికి పెళ్ళాడుతూన్నట్టు తెలిస్తే ఆనాడే ఈ విషయం మీకు తెలిపియుండేదాన్ని !—అదీగాక మీరు వంటొచ్చునా ? కాదా ? అని అడగలేదు

ప్రకా . వండిపెట్టించుకుందికి పెళ్ళాడుతున్నానని నువ్వెందుకనుకోలేదు ?

కాం . పెళ్ళాడిన తర్వాత నాచేత వంట చేయించుకుంటారని అనుకోలేదు. పెళ్ళాడి నాచేత ఉద్యోగం చేయిస్తారని ఊహించాను. ఎందుచేతనంటే మీరు మొదట నన్ను చూడ్డానికొచ్చినపుడు స్కూలు ఫైనల్ పబ్లిక్ పరీక్షల్లో మార్కు లెలా వచ్చాయని అడిగారు. తర్వాత ఇంగ్లీషు పేపరు చదివించారు. ఆతర్వాత 'రిటెన్ టెస్టు' చేశారు.—ఇంక మీరు స్కూలుఫైనల్ పాసైన అమ్మాయే భార్య కావాలన్నారు. నవనాగరికురాలు, అందమైన అమ్మాయి అయివుండాలన్నారు. సినీమా పాటలు బాగా పాడగలిగి వుండాలన్నారు. ఇన్ని 'క్వాలిఫికేషన్లు' గల అమ్మాయిని పెళ్ళాడి ఆమెను వంటింట్లో పొయ్యి పాగలో కూర్చోబెడతారని నేను అనుకోలేదు.

ప్రకా : (రెండునిముషా లాలోచించి) అయితే మరి మన భోజనాలెలాగ ?

కాం · మరి ఎలాగేమిటి ?—హొటల్ నుంచీ తెప్పించుకోడమో, లేకపోతే వంట మనిషిని పెట్టుకోవడమో చేయాలి !

ప్రకా : వంటమనుషులీ వూళ్ళో దొరకరు.

కాం · అయితే హొటల్ నుంచీ తెప్పించుకోడమే మార్గం !

ప్రకా : రోజూ రెండు పూటలా హొటల్ నుంచి తెప్పించుకుంటే నెలయేసరికి మనిద్దరికీ తొంభై రూపాయిలవుతాయి. నాకొచ్చిన నూరుజీతపు రాళ్ళలోనీ తొంభై ఒక్క భోజనానికేపోతే మిగిలిన ఖర్చులన్నీ ఎలా వెళతాయి.

కాం : మీకా భయం యేమీ అవసరం లేదు. నే నెక్కడేనా ఉద్యోగంచేస్తాను. అప్పుడు మనిద్దరికీ వచ్చిన జీతం అన్నిటికీ సరిపోతుంది. ★

# బొమ్మరిల్లు



## మొరిగే కుక్క

శ్రీ వి. ఎస్. ప్రభాకరరావు

బడిలోకెడుతూ కొంటెపిల్లవా
డొడిలో రాళ్ళను పోసుకొని
పక్కరోడ్డుపై కునుకుతూన్నవొక
కుక్కపిల్లపై విసిరాడు.

కుక్క భౌయ్యౌమని మొరగసాగగా
కుర్రడిగుండెలు ఝల్లుమన్నవి
కుక్క వెంటబడి తరుముకురాగా
కుర్రవాడు పరుగెత్తాడు.

కుర్రవాడు పరుగెడుతూంటే
కుక్కకు సరదావేసింది
భౌభౌభౌమని తరుమగ కుర్రడు
భయపడి కేకలు పెట్టాడు.

దారిలోన శాస్త్రులుగారొకరు
తారసిల్లినాడ దృష్టముగా

వెంటనుతరిమే కుక్కను ‘ఛీఛీ’
అంటూగట్టిగ అదలించాడు

తోకముడుచుకొని కుక్కపిల్లతన
దారిని తానే పోయింది
బాలుడివైపే చూస్తూశాస్త్రులు
పక్కన నవ్విటులన్నాడు

“అయ్యయ్యయ్యో వెర్రికుర్రడా
అమాయకునిలా గున్నావే!
‘మొరిగేకుక్కలు కరవవు’అంటూ
ఎరుగవపెద్దల మాటలను?”

అంటూపలికిన శాస్త్రిగారితో
కొంటెపిల్ల డిటులన్నాడు
“మొరిగేకుక్కలు కరవకూడదని
ఎరుగునో? ఎరుగదో? కుక్కపిల్లమరి...?”

# హకల్ బెరీ ఫిన్

## మార్క్ ట్వేన్

### బొమ్మరిల్లు సీరియల్

## 22

ఆ రాత్రి పురమందిరంలో మేము మా నాటకం వేశాము. మొత్తం పన్నెండుమందికంటే ఎక్కువ రాలేదు. వాళ్లు మా జమీందారు, డాఫిన్‌ల అభినయం చూసి విరగబడి నవ్వారు. జమీందారుకి పట్టరాని కోపం వచ్చింది. నాటకం మొదలుపెట్టిన కాసేపటికే అంతా వెళ్ళిపోయారు. ఒకడుమాత్రం అక్కడే కూర్చుని నిద్రపోయాడు. ఆర్కాన్‌సాస్ రాష్ట్ర ప్రజలంత మూర్ఖులు ఇంకోళ్లు లేరనీ, వాళ్లముందు షేక్‌స్పియర్ నాటకాలు వెయ్యటమంత బుద్ధితక్కువ లేదనీ, వీళ్లకి కావలసిందల్లా చవకబారువీధి నాటకాలేననీ జమీందారు కోపంగా అన్నాడు.

> పురమందిరంలో
> మూడురాత్రులుమాత్రమే!
> ప్రఖ్యాత లండన్ నటులు
> డేవిడ్ గారిక్
> ఎడ్మండ్ కీన్ గార్లచే
> మహోజ్వలనాటక ప్రదర్శనం!!
> **సింహగర్జన**
> (విషాదాంతనాటకం)
> రేటు:—50 సెంట్లు.
> **స్త్రీలు, పిల్లలు రాగూడదు.**

ఆ మర్నాడు మళ్లీ కొన్ని కాగితాలు అచ్చు వేయించి ఊరంతా అంటించాము.

ఆఖరు వాక్యం "స్త్రీలు, పిల్లలు రాగూడదు" అనేదాన్ని చూసి హాలు హాలంతా ఆడవాళ్లతోను, పిల్లలతోను నిండిపోకపోతే చెవి తెగ్గోయించుకుంటానన్నాడు జమీందారు.

నిజానికి అలాగేజరిగింది. ఆ రాత్రి హాల్లో ఇసక వేస్తే రాలనట్లు జనం నిండిపోయారు. నాటకం మొదలుపెట్టడానికి ముందు జమీందారు స్టేజిమీదికి వచ్చి చిన్న ఉపన్యాసం ఇచ్చాడు. ఇంత అద్భుతమైన విషాదాంత నాటకం ప్రపంచంలో ఇంకోటి లేదనీ, ఎడ్మండ్ కీన్‌గారు ప్రధాన పాత్ర ధరిస్తారనీ, చాలా బావుంటుంది గనక చివరిదాకా ఉండి చూడవలసిందనీ చెప్పాడు. తరవాత తెర ఎత్తబడింది. డాఫిన్ రంగంమీదికి వచ్చాడు. ఒక్క గోచీ తప్ప ఇంకేమీ వంటిమీద లేదు. వంటినిండా పంచరంగులు పూసుకున్నాడు. పాకుతుంటూ, సింహంలా గర్జిస్తూ వచ్చాడు. అతని చేష్టలు చూసి ప్రేక్షకులు చచ్చేట్టు నవ్వారు. నవ్వినకొద్దీ డాఫిన్ సింహగర్జన, వెర్రిచేష్టలు ఎక్కువచేశాడు. ఒక పదినిమిషాలు ఇలా జరిగింది. తరవాత తెర దింపేశారు. ప్రేక్షకులు విపరీతంగా చప్పట్లుకొట్టి "వన్సుమోర్" అని కేకలు వేశారు. డాఫిన్ మళ్ళీ వచ్చి కొంతసేపు గర్జించాడు. మళ్ళీ తెరపడింది. జమీందారు ముందుకువచ్చి నాటకం అయిపోయిందనీ, అద్భుతమైన ఈ విషాదాంత

నాటకం ఇంకా రెండురాత్రులు మాత్రమే ప్రదర్శింప బడుతుందని, తరవాత లండన్ వెళ్లిపో దలుచుకున్నా మని చెప్పాడు. నాటకం బాగుందని ప్రేక్షక మహాశయులు భావిస్తున్నట్లయితే ఊళ్ళోకి వెళ్లి మిగతా వారినికూడా పంపించేందుకు ప్రయత్నించ గోర్తానని కూడా అన్నాడు. అతని ఉపన్యాసం కాగానే ఒక్కసారిగా ఇరవైమంది లేచి

"ఇంతేనా నాటకం? అయిపోయిందా?" అని కేకలు వేశారు. జమీందారు అయిపోయిందన్నాడు.

"మోసం! మోసం!" అని చాలా కంఠాలు అరిచాయి. కొందరు స్టేజివరకూ వచ్చి జమీందారును పట్టుకుని తన్నాలని చూశారు. కాని వారిలో ఒకపెద్ద మనిషి లేచి ఇలాగన్నాడు:

"ఆగండి మిత్రులారా! నామాట వినండి! మన్ని వీళ్లు మోసంచేశారు. మోసం జరిగిందనటంలో సందేహంలేదు. కాని మనం మోసపోయామనే విషయం ఊళ్లో అంతా వింటే మన్ని పట్టుకుని ఏడిపిస్తారు కనుక ఈ విషయం ఎవరికీ చెప్పవద్దు. ఇక్కడి నించి ప్రశాంతంగా వెళ్లిపోదాం నాటకం చాలా బావుందని ప్రచారంచేద్దాం. మిగతావాళ్లుకూడా వచ్చి చూస్తారు. వాళ్లుకూడా మోసపోతారు. అప్పుడు ఊళ్లోవాళ్లందరం గాడిదలమయినట్టవుతుంది."

దీనికి అందరూ అంగీకరించారు. ఏగల్లంతూ చెయ్యకుండానే హాల్లోంచి నిష్క్రమించారు. మర్నాడు ఊరంతా మా నాటకాన్ని గూర్చిన ప్రశంసలతో మారుమోగింది. ఆరాత్రికూడా హాలు కిక్కిరిసి పోయింది. అంతకుముందే మధ్యాహ్నం నేను, డాఫిన్, జమీందారు పడవలోకి వెళ్లినప్పుడు జమీందారు జిమ్‌తో చెప్పిఉంచాడు: పడవను ఊరికి దిగువన మైలు రెండుమైళ్ల దూరంలో రెడీగా ఉంచమని.

రెండోరాత్రికూడా జనం గల్లంతు చెయ్యకుండా డాఫిన్ పిచ్చిచేష్టలు చూసి వినోదించారు. మూడోరాత్రి కొత్తవాళ్లెవరూ రాలేదు. వచ్చిన వాళ్ళలో ఎక్కువమంది కిందటిరోజు, ఆ కిందటిరోజు వచ్చినవాళ్లే. ప్రతివాడి జేబులు, లాగులు చొక్కాలు ఎందుకో ఉబ్బెత్తుగా ఉన్నాయి. నేనిట్టే కనిపెట్టేశాను ప్రతివాడు కుళ్లిపోయిన కోడిగుడ్లో, చచ్చిన పందికొక్కునో, ఎలికనో, పిల్లినో, వెంటపెట్టుకు వచ్చాడని గ్రహించాను. జమీందారు, డాఫిన్ కూడా ఆవిషయం కనిపెట్టారు స్టేజి వెనకనుంచి బయటికొక దారి ఉన్నది. ఆ తలుపులు జమీందారుముందే బార్లా తెరిచి ఉంచాడు. నాటకం మొదలుపెట్టాక మామీద పడి చిత్తుచిత్తుగా ఉతికెయ్యాలని ప్రేక్షకులు ప్లానువేశారు. కాని మేము తెర ఎత్తకముందే దొడ్డిదోవగుండా నిర్జనమైన సందుల్లో పడి కాలికొద్దీ పరిగెత్తాము. మా పడవను చేరుకునేదాకా ఊపిరి పీల్చుకునేందుకైనా ఎక్కడా ఆగలేదు. వెంటనే పడవను బయల్దేరదీసి పదిమైళ్లు నదిదిగువకు పోయిందాకా నోరెత్తకుండా గమ్మున కూర్చున్నాము. అక్కడ ఆగి భోజనంచేశాము. డాఫిన్, జమీందారు గ్రామప్రజలను మూడురాత్రులు వరసగా గాడిదలుగా చెయ్యగలిగిన తమ తెలివితేటలను తామే మెచ్చుకున్నారు.

"వెధవలు! గాడిదలు! మట్టిబుర్రలు! నేనప్పుడే అనుకున్నాను. మొదటిరాత్రి, రెండోరాత్రి మాట్లాడకుండా వెళ్ళిపోవటంచూసి, ఆఖరురాత్రి గలభా చెయ్యా దలుచుకున్నారని కనిపెట్టాను. కాని మనమూ వాళ్ల మోసానికి లొంగేది! చెప్పులు పిండి మూడురాత్రులూ డబ్బు వసూలుచేశాము," అన్నాడు గర్వంగా జమీందారు.

తరవాత ఎంతడబ్బు వసూలైందో లెక్కపెట్టారు. మూడు రాత్రుల్లోను నాలుగువందల అరవై అయిదు డాలర్లు పోగయింది. అంతడబ్బు వాళ్ల జన్మలో చూసివుండరు. గుండెలు బాదుకున్నారు తరవాత నిద్రపోయారు. నేను, జిమ్ యథాప్రకారంగా పడవ నడుపుతూ మాట్లాడుకున్నాము.

"హక్ గారూ! రాజులు, జమీందార్లు ఇలా ప్రవర్తించటం ఆశ్చర్యంగా లేదండి?" అన్నాడు జిమ్.

"లేదు," అన్నాను.

"ఎందుకని?"

"వాళ్లంతా అంతే వాళ్లకి పుట్టుకతోనే ఈ అలవాట్లన్ని అబ్బుతాయి"

"వీళ్లు పచ్చి దొంగవెధవల్లాగా ఉన్నారండి. పచ్చిదొంగలు! మోసంచేసి ఎంతడబ్బు సంపాయించారో చూడండి!"

"అవును. వాళ్లంతా అంతే. రాజులందరూ పచ్చిదొంగ వెధవలే."

"నిజంగానా?"

"నిజంగానే. నేను చరిత్ర పుస్తకాల్లో చదివాను. ఎనిమిదో హెన్రీ అని ఒకరాజున్నాడు. ఆరాజుతో పోలిస్తే మన డాఫిన్ వెయ్యిరెట్లు మెరుగు. రెండవ చార్లెసు, పధ్నాలుగో లూయీ, పదిహేనో లూయీ, రెండవ జేమ్సు, రెండవ ఎడ్వర్డు, మూడవ రిచర్డు, ఇంకా ఎందరో రాజులున్నారు. వీళ్లంతా అంతే. పచ్చిదొంగలు! ఎనిమిదో హెన్రీనిగూర్చి నీకు తెలుసా? ఆయన రోజుకో పెళ్లాన్ని పెళ్ళిచేసుకునేవాడు. మర్నాడు పొద్దున ఆమె తల నరికించేవాడు. "నెల్ గ్విన్‌ని తీసుకురా," అనేవాడు. ఆమెను తెచ్చేవాళ్లు. మర్నాడు పొద్దున "తల కొట్టెయ్యండి," అనేవాడు. తలకొట్టేసి కోటకొమ్మున కట్టేవాళ్లు. "జేన్ షోర్‌ని తీసుకురా," అనేవాడు. తెచ్చేవాళ్లు. "తల తీసెయ్యండి," అనేవాడు. తీసేసేవాళ్లు. ఇలా రోజు కొకళ్లని పెళ్లాడటం, మర్నాడు చంపెయ్యటం. ప్రతి రాత్రి ఆరాత్రి పెళ్లాంచేత ఒక్కొక్క కధ చెప్పించుకునేవాడు. ఇల్లా వెయ్యినొక్కమందిచేత వెయ్యినొక్కకథలు చెప్పించుకున్నాడు. ఆ కథలన్నీ తరవాత 'డూమ్స్‌డే పుస్తకం' అనే పుస్తకంలో రాసి అచ్చువేశాడు. జిమ్! నీకు రాజుల్నిగూర్చి తెలియదు. నాకు బాగా తెలుసు. వాళ్లతో పోలిస్తే ఈ డాఫిన్ మహాత్ముడని చెప్పాలి. ఎనిమిదో హెన్రీ ఇంకా ఏంచేశాడో తెలుసా? అనవసరంగా బోలెడు యుద్ధాలు చేశాడు. ఒక దే పోట్లాడాలని బుద్ధి పుట్టిందనుకో. "ఇదుగో నాకు యుద్ధం చెయ్యాలనుంది. కనక సిద్ధంగా ఉండండి," అని ముందు చెప్పాలా అక్కర్లేదా? చెప్పకుండానే బోస్టన్ రేవులో ఓడలమీదున్న టీ పొడుం బస్తాలన్నీ నీళ్ళలో పారబోయించి అమెరికన్ స్వాతంత్ర్యం ప్రకటించేవాడు. దాంతో యుద్ధం జరిగేది. ఒకసారి ఎనిమిదో హెన్రీకి తన తండ్రి అయిన వెల్లింగ్టన్‌మీద కోపం వచ్చింది. ఆ కోపంతో తండ్రిని పట్టుకుని నీళ్లలోకి తోసి చంపేశాడు. ఎవరన్నా డబ్బు పారేసుకున్నారనుకో. హెన్రీ దాన్ని గప్‌చిప్‌గా జేబులో వేసుకునేవాడు. రోజుకు వెయ్యి అబద్ధాలాడేవాడు. జిమ్! రాజులంతా ఒకటే ననుకో పచ్చిదొంగలు! మోసగాళ్లు."

"కాని ఈ డాఫిన్ దగ్గిర చెడ్డవాసన కొడుతోందండి," అన్నాడు జిమ్.

"అవును. అంతే. చరిత్ర పుస్తకాల్లోకూడా అలాగే వుంటుంది."

"డాఫిన్‌కంటే జమీందారే కొద్దిగా నయం."

"అవును. రాజులకంటే జమీందార్లే కొంత నయం. కాని వాళ్లూ వాళ్లూ ఒకటే."

ఈ మోసగాళ్లిద్దరూ నిజమైన రాజు, నిజమైన జమీందారూ కాదని జిమ్‌కు తెలియదు. నేనూ చెప్పటమనవసరమని చెప్పలేదు. చెప్పినా జిమ్ నమ్మడు. పైగా నిజమైన రాజులకి, జమీందార్లకి, ఈ దొంగ రాజుకి, జమీందారుకి ఆట్టే తేడా ఉన్నట్టు కనిపించలేదు నాకు.

తరవాత నాకు అలసటగా ఉంటంచేత నేను నిద్రపోయాను. జిమ్ పడవ నడిపాడు. నావంతు వచ్చినాకూడా అతడు నన్ను లేపలేదు. జిమ్ ఇలా చాలా సార్లు చేశాడు. నన్ను పడుకోనిచ్చి తెల్లవార్లూ తనే పడవ నడిపేవాడు. తెల్లవారాక నేను లేచి చూస్తే రెండుమోకాళ్ల మధ్య తలవంచి తనలో తనే ఏడుస్తూ కూర్చున్నాడు. నేనతన్ని ఏమిటని ప్రశ్నించలేదు. నాకు తెలుసు: జిమ్ తన పెళ్లాన్ని, బిడ్డలని తలుచుకుని ఏడుస్తున్నాడని. తెల్లజాతివాళ్లకు తమ కుటుంబాలమీద ప్రేమ ఉండటం, వారిమీద బెంగపడటం నాకు తెలుసు. అది సహజమే. కాని నీగ్రోకుకూడా తన వాళ్లమీద అంత ప్రేమ ఉండటం నాకు ఆశ్చర్యంగా కనిపించింది. కాని నీగ్రోలు ప్రేమ, స్నేహం మొదలైన విషయాల్లో తెల్లవాళ్లకంటే తక్కువవాళ్లని నేను నమ్మను—అది ఎంత విడ్డూరంగా కనిపించినాసరే. అనేక రాత్రులు చూశాను—జిమ్ ఒక్కడే కూర్చుని పెళ్లాన్ని, బిడ్డలని పేరు పేరునా తలుచుకుని ఏడవటం. అటువంటి సమయాల్లో నాకూడా ఎంతో దుఃఖం కలిగేది.

## 23

తరవాత చాలాదూరం ప్రయాణంచేశాము. దోవలో చాలా ఊళ్లు తగిలాయి. కొన్ని ఊళ్ళలో దిగి మళ్లీ “సింహగర్జన” నాటకం ప్రదర్శించాలని జమీందారు అనుకున్నాడుగాని, మొదటిఊళ్లో తాము చేసిన మోసం ఈపాటికి అన్ని ఊళ్లలోను పాకిపోయి వుంటుందనీ, అందుచేత మళ్లీ అదేపన్నాగం పన్నితే పారదనీ అధైర్యపడ్డాడు. అందుచేత ఎక్కడా ఆగకుండా చాలమైళ్లు నది దిగువకు ప్రయాణంచేశాము. మా రాష్ట్రంనుండి ఎంతో దూరం వచ్చేశాము. అడవులు, ఇతర దృశ్యాలు కొత్తకొత్తగా ఉన్నాయి.

జమీందారు, డాఫిన్ ఈలోగా నాటకాలమీద సంపాదించిన డబ్బంతా తాగేశారు. మళ్లీ డబ్బు ఆర్జించవలసిన అవసరం కలిగింది. ఒకఊళ్లోదిగి మద్యపానంవల్ల కలిగే నష్టాలనుగూర్చి ఉపన్యాసాలిచ్చారు, కాని ఈ సభలకు ఆట్టే డబ్బు వసూలు కాలేదు. అందుచేత మస్తుగా తాగేందుకు చాలలేదు. ఇంకోఊళ్లో నాట్య పాఠశాల స్థాపించారు. కాని మా తోడుదొంగలకు కంగారుమృగాలకంటే ఎక్కువ నాట్యంరాదు. అందుచేత వాళ్ల కోతిగంతులుచూసి ఊళ్లోవాళ్లు వెంటనే తరిమికొట్టారు ఇంకా కొన్ని ఊళ్ళలో గారడీ, ఇంద్రజాలం, వైద్యం, మత ఉపన్యాసాలు, జ్యోతిషం మొదలైనవి చాలా ప్రయత్నించారు. కాని అన్నిచోట్లా చుక్కెదురు కాజొచ్చింది. అక్కడితో ఆ ప్రయత్నాలన్నీ మానుకున్నారు. పనీవ డేరాలోనే కూర్చుని విచారంగా తలలు వేలాడేసుకుని అదేపనిగా ఆలోచించటం మొదలెట్టారు. కొన్ని రోజులిలా గడిచాయి.

ఆఖరికి ఏదో ఉపాయం తట్టినట్లుంది. జమీందారు, డాఫిన్ డేరానుండి కదలకుండా అక్కడే దగ్గిర దగ్గిరగా చేరి ఒకరి చెవిలో ఒకరు గుసగుస లాడసాగించారు. అప్పుడప్పుడు నాకేసి, జిమ్‌కేసి కొరచూపులు చూస్తున్నారు. నాకు అనుమానము, భయమూ కూడా కలిగాయి. వాళ్లేదో మళ్లీ మోసం తలపెట్టారనుకున్నాము. ఈసారి దొంగనాణాలు తయారుచెయ్యటమో, దొంగతనం చెయ్యటమో ఏదో ఉందనుకున్నాము. వీలుచూసి వా రిద్దరికీ మస్కాకొట్టి వారిని వదిలేసి పారిపోవాలనుకున్నాము.

ఒకరోజున మాకొక పెద్దగ్రామం తగిలింది. ఆ గ్రామానికి దిగువగా కొంతదూరంలో పడవ ఆపాము. డాఫిన్ తాను పోయి ఊళ్లో “సింహగర్జన” నాటకం వెయ్యటానికి వీలుందేమో చూసివస్తానని చెప్పి ఊళ్లోకి వెళ్లాడు. జమీందారు మాతోనే ఉండిపోయాడు. మధ్యాహ్నమైనా డాఫిన్ తిరిగిరాలేదు. “అతడేమయ్యాడో చూసివద్దాము” రమ్మని జమీందారు నన్ను పిలిచాడు. జిమ్‌ను మరొక రెవరూ పట్టుకోకుండా కాలుచేతులు కట్టివేసి మరీ వెళ్లాము.

ఊరంతా వెదకగా డాఫిన్ ఒకసారా దుకాణంలో సారాపాత్రతోసహా కనిపించాడు. అతని చుట్టూ కొందరు తాగుబోతులు చేరి ఏడిపిస్తున్నారు. జమీందారు డాఫిన్‌ని చూడగానే కోపం పట్టలేక దెబ్బలాట ప్రారంభించాడు. వాళ్లిద్దరూ దెబ్బలాటలో నిమగ్నులు కావటం చూసి నేను వచ్చినదోవనే పరిగెత్తాను. పడవలోకి వచ్చి జిమ్‌ని కేకవేశాను. జిమ్ పలకలేదు. పడవఅంతా వెదికాను. జిమ్ కనిపించలేదు. జిమ్ లేదు. చుట్టుపక్కల వెదికాను అడవిలో అటూ ఇటూ పరిగెత్తి కేకలు వేశాను జిమ్ ఎక్కడా లేదు. ఒక చెట్టుకింద కూర్చుని తీరుబడిగా ఏడ్చాను. ఏడుపు ఆపుకోలేకపోయాను. కాని ఎక్కువసేపు అక్కడ కూర్చో బుద్ధికాలేదు. రోడ్డువెంటే బయలుదేరాను. నా యీడువాడే ఒకబ్బాయి అగుపించాడు. అతన్ని అడిగాను, ‘ఎక్కడైనా ఒక కొత్త నీగ్రో కనిపించాడా?’ అని.


“కనిపించాడు.”

“ఎక్కడ?” అని ఆత్రంగా అడిగాను.

“రెండుమైళ్ల దిగువన సైలాస్ ఫిలిప్స్ అని ఒకాయన ఇల్లుంది. అక్కడికి తీసుకుపోయారు. ఆ నీగ్రో పారిపోతున్న బానిసట. వాణ్ణి పట్టుకున్నారెవరో. వాడితో నీకేంపని?”

“అబ్బే, పనేమీలేదు. ఇందాక అడవిలో పారిపోతూ నాకు కనిపించాడు. నేను కేకలువేసి పట్టిద్దామనుకున్నాను. కాని నేను కుర్రాణ్నికదూ! తంతానని బెదిరించాడు. తాను దూరంగా పారిపోయేదాకా

(47-వ పేజీ చూడండి)




(గత సంచిక తరువాయి)

"కాలాన్ని కాళ్లతో కొలిచే వారని చెప్పావుగా; అదేమిటో త్వరగా చెప్పు." అంటూ సుందరం గడియారాన్ని తొందర చేశాడు. మిన్ను విరిగి మీద పడుతున్నా తొందర పడటం అంటే ఏమిటో ఎరుగని గడియారానికి, కథలు వినాలనే ఆపేక్ష కొద్దీ సుందరం తన నింత తొందర చేస్తున్నందుకు అబ్బరంగానే తోచింది.

"పూర్వం గ్రీకు దేశంలోనూ అక్కడా యిలా కాలాన్ని కాళ్లతో కొలిచేవారులే!" అన్నది గడియారం తాపీగానే. సుందరం ఏదో అనబోతుంటే గడియారం తానే అందుకొని యిలా చెప్పింది.

"ఆఁ! మరేమీ లేదు. పెద్ద పెద్ద వీధుల్లో అక్కడక్కడా ఎత్తైన స్తంభాలు పాతివుంచేవారు. స్తంభం అంటూ ఒకటి వుంటే పగలంతా దానినీడ భూమి మీద పడుతుంది కదా! ఆనీడ పడినంత మేరా అడుగులు వేసుకొంటూ పోయి పది అడుగుల నీడ వుంటే ప్రొద్దున ఎనిమిది గంటల ప్రాంతం అయి వుంటుందని వూహించుకొనే వారు"

"ఓస్; ఇంతేనా!"

"ఇంతేనా అనెయ్యకు మరి! ఇప్పుడంటే నీకు 'యింతేనా' అనిపిస్తున్నది కానీ, తెలివి తేటలు యింత మితమీరని ఆ రోజులలో యీ పద్ధతి అయినా కనిపెట్టినందుకు వాళ్లు ఎంత సంతోషించారో!"



కాలాన్ని కర్రతో కొలిచారా!

"అది సరే కానీ టైం ఎంత అయిందో తెలుసుకోవాలని బుద్ధి పుట్టినప్పుడల్లా యీ స్తంభం ఎక్కడ వుందో వెతుక్కొంటూ పోయి, అక్కడ నలుగురూ చూస్తూండగా ఆ స్తంభం నీడ పడినంత మేరా డ్రిల్లు చేసే వారన్నమాటేనా!"

"అదుగో; అందుకే మన ఫకీరులు ఒక పద్ధతి కనిపెట్టారు. ఫకీరు అంటే తెలుసుగా నీకు? వున్న చోట వుండకుండా ఎప్పుడూ పాటలు పాడుకొంటూ బిచ్చమెత్తుకొంటూ తిరుగుతూ వుంటాడే; - అతనే ఫకీరు. ఎప్పుడూ కాలి దురద కొద్దీ తిరిగే ఫకీరు ఎక్కడ అంటే అక్కడ టైం కనుక్కోవటానికి చేతికర్రనే వుపయోగించే వాడు. కర్రను గడియారంగా చేశాడంటే అదేదో మాజిక్‌లా తోస్తున్నది కదూ, నీకు?"

"కాదూ మరీ. నువ్వు మరీ విచిత్రంగా చెప్పతున్నావే!"

"నే చెప్పేది అబద్ధం ఏమీ కాదు. చేతికర్రను గడియారంలా ఎలా వుపయోగించేవాడో చేపుతా విను. ఆ ఫకీరులు వుపయోగించిన

(39-వ పేజీ చూడండి)



# చెప్పుల చలవ

— మజ్హరున్నీసా బేగమ్

ఒకవూళ్లో నాగిరెడ్డి అనే బీద వాడు వుండేవాడు. ప్రతిరోజూ కష్టపడి కాస్తో కూస్తో సంపాదించుకొని దానితోనే పొట్ట పోసుకొనే వాడు. ఆతడు డబ్బుకైతే పేదగానీ గుణానికి మాత్రం ఏమీ తీసిపోడు. అబద్ధం ఏనాడూ పలికి వుండలేదు. తప్పు అయినా, ఒప్పు అయినా చేసింది చేసినట్లు, చూసింది చూసినట్లు చెప్పేవాడు. కానీ వూళ్లో వుండే డబ్బున్న మారాజులకు యీ గుణాలన్నీ ఏం కావాలి? వారు చూచేదల్లా వాడు కట్టకొనే గుడ్డలు తెల్లవి అవునా, కాదా- అని మాత్రమే. నాగిరెడ్డి ఏనాడూ చింకిపాతలే కట్టుకొనే వాడు కాబట్టి ఆతనిని యీ పెద్ద మనుషులందరూ ఏవగించుకొంటూనే వుండేవారు.

ఈవూళ్లో గ్రామ చావిడికి ఎదురుగావున్న రావి చెట్టు నీడను ఓనాటి సాయంకాలం యీ పెద్ద మనుష్యులందరూ ప్రోగై, లోకుల కలిమి లేములను విమర్శిస్తూ బిగ్గరగా వదరుతున్నారు. అటువంటి సమయంలో క్రొత్తగా ఫ్యాక్టరీ కూలీగా కుదిరిన నాగిరెడ్డి కాకీ నిక్కరులో చొక్కా దోపి, టిఫిన్ కారియర్ చేత బట్టుకొని గబగబా ఆదారినే యింటికి వస్తున్నాడు. తామందరూ నాగిరెడ్డిని ఎరిగి వున్నప్పటి నుంచీ చింకి గుడ్డలతో వేలాడుతుండే వాడు యీ రోజు చక్కగా కాకీ నిక్కరు చొక్కా వేసుకొంటే యీ పెద్ద మనుష్యులకు ఏమిటో మనస్సు చివుక్కుమన్నది. వారిలో ఒకడైన వీరన్న నాయుడు గారికి వీడినిపిల్చి ఏడ్పించాలనికూడా బుద్ధిపుట్టింది. ఇంకేం పిలిచాడు. పెద్దమనిషి పిలుస్తుంటే పలకకుండా పోవటం తగదని, నాగిరెడ్డి పోతున్న వాడల్లా ఆగాడు. ఆగి దండంపెట్టి ఒకవారగా వచ్చి నిలుచొన్నాడు.

"ఊ! ఏం నాగిరెడ్డీ; పెద్ద వుద్యోగం చేస్తున్నావా ఏట్టా: అంత యిసురుగా పోతుండావ్?"

"మరేనండి బాబూ: వుద్దేగం పెద్దదిగాదుగానండీ - ఫ్యాక్టరీ తో కూలీగా మొన్న టేల నుంచీ పోతుండా!"

"ఎట్టెట్టా! వుద్యోగం దొరికితే మా అందరికీ టీపార్టీ ఎప్పుడు యిత్తావేటి?"

ఇంతలోనే మరో పెద్దమనిషి కల్పించుకొని "వుద్యోగం రావటమూ వేషం మారటమూ కూడా జరిగిందే!" అన్నాడు నొసలతో



తొక్కరిస్తూ. నాగిరెడ్డికి కొంచెం మనస్సుకుకష్టమేసింది. "నిక్కరువేసి ఆ నిక్కరు లోపలికి చొక్కా దూర్చకపోతే గేటుకాడ జవాను లోనికే పోనియ్యడు బాబయ్యా!" అని వెంటనే సమాధాన మిచ్చాడు. ఈలోగా నాయుడుగారు టీపార్టీ గొడవ మరచి పోగలడని నాగిరెడ్డి ఆశించాడు కానీ "ఏం నాగిరెడ్డి ఎప్పుడు రమ్మంటావ్ -టీపార్టీకి ?" అని నాయుడుగారు రెట్టించారు. రెడ్డికి గుండె గతుక్కు మన్నది. ఏం చెయ్యాలో, ఏం చెప్పాలో అర్థం కాలేదు. క్షణం ఆలోచించి "మాబోటి బీదకొంపలకు మీ లాంటి వారు ఎందుకు వస్తార్లే బాబయ్యా!" అని మాత్రం అనగలిగాడు. ఆ పెద్ద మనుష్యులంతా వీడిని ఏడ్పించాలనే కదా, అసలు వాడిని దగ్గరకు పిలిచి మాట్లాడుతున్నది: అందుకనీ "అదేంటిలే నాగిరెడ్డి! ప్రేమతో ఎవరు పిలిచినా, ఎవరుపెట్టినా తినాల్సిందే," అన్నాడు నాయుడు. "సరేలెండి బాబయ్యా! రేపు ఒకటో తారీకున జీతం అందుద్ది. వెంటనే తమరందరినీ పిల్చుకు ఎళ్తాను" అని అక్కడి నుంచి గబగబా కదిలి వెళ్ళాడు.

దారి పొడుగునా ఆలోచించాడు. వచ్చే కూలీ డబ్బులు యీ పెద్దమనుష్యుల కడుపు నింపటానికే ఖర్చుపెట్టితే మరి తనమాట ఏమిటి! మరి వాళ్ళతో మాట యిచ్చాడు కదా! తనడబ్బు ఖర్చు కాకుండా మాట నిలబెట్టు కోవటం ఎలా! ఆరాత్రి అంతా ఆలోచించాడు. మర్నాడు మళ్ళా పనినుంచి వస్తూ ఆ రావి చెట్టును చూసేసరికి మళ్ళీ యీ సమస్య వేధించటం మొదలు పెట్టింది. నాగిరెడ్డికి అర్థంమైంది- ఈడబ్బున్న వాళ్లకు తాను పెట్టపోయేతిండి కరువైకాదుకదా వారు టిపార్టీ యిమ్మని అడిగింది. మరైతే దేనికి తనను వేధించారు? లేని వాడని చులకన చేయటమే కదా వారి ఆంతర్యం! నాగిరెడ్డికి వళ్లు మండుకు పోయింది. వీరికెల్లాగైనా బుద్ధి చెప్పాలను కొన్నాడు. ఆరాత్రి అంతా కసిగా ఆలోచించాడు.

ఒకటవతేదీ వచ్చింది వుద్యోగం చేసుకొనే వారందరికీ అది పండుగరోజు. నాగిరెడ్డికి పర్వదినం! ఊళ్లోకి వెళ్లి, నాడు తనను హెచ్చరించిన పెద్దలందరిని సాయంకాలం తనయింటికి రమ్మని ఆహ్వానించి వచ్చాడు. అతిథులందరు వేళకు అరగంట ముందుగానే వచ్చేశారు. ఆపూరి గుడిసెకే నాగిరెడ్డి చేసిన అలంకారాలన్నీ పరీక్షించటం మొదలు పెట్టారు. వాకిట్లో ఒక చిన్న అట్టమీద "దయచేసి మీ పాదరక్షలు యిక్కడ వదలండి" అని వ్రాసివున్నది. పెద్ద మనుషులు అది చదువుకొని ముసిముసి నవ్వులు నవ్వుకొంటూ చెప్పులన్నీ అక్కడ వదిలి లోపలికి వెళ్ళారు. నాగిరెడ్డి అతిథు లందరికీ స్వాగతంచెప్పి లోపలకు తీసుకొని వెళ్లి కూర్చోబెట్టి తాను లోపలి గదిలోకి వెళ్ళాడు. పలహారాలు పట్టుకు రావటానికి వెళ్ళాడనుకొని యీ పెద్ద మనుషులు వాళ్లల్లో వాళ్లే వూరి రాజకీయాలు మాట్లాడు కోవటంలో నిమగ్నులైనారు. అందులో వాదోపవాదాలు పెరిగాయి. వాళ్లలో వాళ్లే సదమద మౌతున్నారు. కొద్దిసేపట్లో నాగిరెడ్డి పలహారాల బుట్టలు తెచ్చి నట్టింట్లోపెట్టి అందరికీ వడ్డనలు ప్రారంభించాడు. పెద్దలందరూ వుపక్రమించారు. నాయుడు గారు వుండబట్టలేక "ఒరే, నాగా! యీ పలహారాల కన్నిటికీ నీకు డబ్బు ఎక్కడినుంచి వచ్చిందిరా!" అని అడిగాడు. "అంతా మీ చెప్పుల చలవే బాబయ్యా!" అని నాగిరెడ్డి ఎంతో వినయంగా సమాధానం యిచ్చాడు. విందు ముగిసిన

(39 వ-పేజీ చూడండి)



# విజ్ఞాన వీధులు

"డాక్టర్"



## 2. పందిరి కింద కంటె చెట్టు కింద చల్లగా వుంటుందేం?

ఎండలో నడిచి నడిచి అలిసిన వాళ్ళు పందిరీ చెట్టూ పక్క పక్కల్నివున్నా తిన్నగా చెట్టు కిందికే వెళ్తారు. ఎందుచేతా? చెట్టుకింద చల్లగా ఎందుకుంటుందీ? గాలి చెట్టుకిందా వుంటుంది; పందిరి కిందా వుంటుంది. ఇక చెట్టు విశేష మేమిటి?

చెట్టు నిండా ఆకు లుంటాయి. ఆ ఆకుల్ని చెట్టు సూర్య రశ్మికి ఎదురుగా తిప్పకుంటుంది. ఆకులకి వెనకవైపు స్తూమములని చిన్న రంధ్రాలు, - మన శరీరమ్మీద వున్నట్టే-వుంటాయి. మన శరీరము మీద రంధ్రాలలో నుంచి స్వేద జలము వస్తూఉన్నట్లే ఈ స్తూమా ల్లోంచి చెట్టు భూమిలోనుంచి పీల్చుకునే నీరు బాష్ప రూపముగా బయటకు వస్తుంది. కాబట్టి సముద్రము మీదనుంచి వీచే గాలిలోని సుఖకరమైన తడివంటిదే చెట్టుకింద ఏర్పడుతూంటుంది. ఈ ఏర్పాటు సముద్రపుగాలిలోని తడిలాగు నిరంతరాయమే. చెట్టు ప్రతిక్షణమూ భూమిలోంచి నీరు పీల్చుకుంటూ, పత్ర రంధ్రాలద్వారా వదిలి పెడుతూనే వుంటుంది. అందుకే పందిరి కిందిగాలి వెచ్చగావున్నా చెట్టు కిందిగాలి మాత్రము చల్లగానే వుంటుంది.

ఇప్పుడు ధనికులు ఇళ్లల్లో చలవ గదులు కట్టుకుంటున్నారు. ఆగదిలోని వాయువుయొక్క ఉష్ణోగ్రతా, నీటియావిరి మొత్తమూ కూడా మారకుండా ఉంచడానికి రిఫ్రిజిరేటర్లు అమరుస్తారు. ఇవి నీటియావిరి తయారుచేసి గదిలో విరజిమ్ముతాయి

చెట్టుకింది జాగా ఒకరకంగా ఇలాంటి చలవగది అక్కడ యంత్రంచేసే పని ఇక్కడ ఒక రకంగా చెట్టు చేశేస్తుంది.

ఆఫ్రికా అరణ్యాలలో చెట్లు అల్లిబిల్లిగా అల్లుకుని వుండకపోతే అన్నిరకాల జంతువులు ఆ యెండకి బతకగలవా?

## 3. భ్రమరకీట న్యాయమా?

తేనెటీగ అన్ని పురుగుల్లాగా గుడ్లుపెట్టి పొదగదనీ, మరోజాతి కీటకాన్ని పట్టుకువచ్చి తన గూడులోపెట్టి దానిచుట్టూ జంయిమని రొదచేస్తూ తిరుగుతుందనీ, అలాగు కొన్నాళ్లు చేసేసరికి ఆ కీటకము కూడా భ్రమరమయి పోయి జుంయి మనడము ప్రారంభిస్తుందనీ, భ్రమరకులం ఇలాగే వృద్ధి అవుతుందనీ మన పూర్వులు నమ్మేరు. ఇది సుందరమైన కథే కాని నిజము కాదు.

అసలు జరిగే సంగతి ఏమిటంటే, భ్రమరము కూడా అన్ని కీటకాల్లాగా గుడ్లే పెట్టుతుంది. కాని మట్టితో గట్టిగూడు కట్టి దానిలో పెట్టడము చేత ఆగుడ్లు పైకి కనబడవు. ఆగుడ్లు పిల్ల భ్రమరాలవగానే భ్రమరం వాటి కాహారానికి పురుగుల్ని పట్టి గూడులో దూరుతుంది. పూర్వులీ దృశ్యము గుర్తించి వుంటారు. పిల్ల భ్రమరాలు ఈ పురుగుల్ని తిని పెద్దవౌతాయి. తరవాత ఎదిగిన భ్రమరాలు గూడులోంచి ఝుంకారము చేస్తూ పైకి రావడము కూడా మన వారు గుర్తించి వుంటారు. వారు చేసినది అవలోకనము మాత్రమే.

(38-వ పేజీ చూడండి)

# భారతరాజ్యాంగ ఉపాధ్యక్షుడు

చెల్లాయీ! మనదేశ చరిత్రలో చెప్పుకోదగ్గ విశేషం ఒకటి గత వారంలో జరిగింది. ఈ సంఘటనలో గల ప్రాధాన్యత నంతా యీ జాబులో వివరించి వ్రాయాలని పిస్తున్నది.

మనదేశం స్వతంత్ర మయ్యాక నూతన రాజ్యాంగం ఒకటి ఏర్పడింది. ఈ రాజ్యాంగరీత్యా భారత యూనియన్‌కు పెద్ద - అధ్యక్షుడు. ఈయనకు ప్రధాన మంత్రిని బర్తరఫ్ చేసేటంతటి అధికారం కూడా వున్నది. అధ్యక్షుని తరువాత యింత అధికారమూ వుపాధ్యక్షునికి వుంటుంది. ఈ రాజ్యాంగం అమలులోకి వచ్చిన 1950 జనవరి 26 నుంచి డా॥ రాజేంద్ర ప్రసాద్ గారు అధ్యక్షుడుగా వుంటున్నారు. ఈ పదవికి పైవారంలోగా పోటీ జరుగ బోతున్నది. అధ్యక్షుని హోదా కల్పించటంతోపాటు ఉపాధ్యక్షుని హోదాకూడా 1950 జనవరి 26 నుంచే ఏర్పరచ వలసి వుండగా ఆపదవికి ఎవరినైనా ఎన్నుకోవటం యింతవరకు జరుగలేదు. గతవారంలో యీ పదవికి డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు పోటీ లేకుండా ఎన్నికైనారు. ఈయన పేరు భారత దేశ చరిత్రలో మొట్ట మొదటి వుపాధ్యక్షుడుగా చిరకాలం నిలచి వుండగలదు. అటువంటి వ్యక్తి జీవిత విశేషాలను నీకు తెలియ చేయాలని తొందర పడుతున్నాను.

రాధాకృష్ణన్ గారు ఆంధ్రులే. ఈయన 1888 సెప్టెంబరు 5 న చిత్తూరుజిల్లా తిరుత్తనిలో జన్మించారు. ఈయన పుట్టి పెరిగిన ప్రాంతం ఆంధ్ర ప్రాంతమే అయినా తమిళుల ప్రాబల్యం కూడా వున్నందు వల్ల యీయన పేరు చివరన 'న్' చేరింది. చిన్న నాట, స్కూలులో చదివే రోజుల నుంచీ మేధావంతుడని పేరు తెచ్చుకొన్నాడు. మద్రాసు క్రిస్టియన్ కాలేజీలో వున్నత విద్య నభ్యసించాడు. కొంత కాలంపాటు మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో



తత్వశాస్త్ర బోధకుడుగా పని చేశారు. మైసూరు విశ్వ విద్యాలయంలో కూడా పనిచేశారు. ఆక్స్‌ఫర్డు (ఇంగ్లండు) లో మాంచెస్టర్ కాలేజీలో వివిధ మతాల తారతమ్యాలను గూర్చి విద్యార్థులకు బోధించారు. 1931 నుంచి 36 వరకు ఆంధ్ర విశ్వ విద్యాలయానికి వైస్‌ఛాన్స్‌లర్‌గా వుండి దాని అభివృద్ధికి ఎంతో పాటుపడ్డారు. 1939 నుంచి 48 వరకు కాశీ విశ్వవిద్యాలయానికి వైస్‌ఛాన్స్‌లర్‌గా వున్నారు. 1946, 47, 48 లలో మనదేశం నుంచీ అంతర్జాతీయ విద్యా సంస్థకు వెళ్లిన ప్రతినిధి వర్గాలకు యీయనే నాయకత్వం వహించారు. ఆ సంస్థ అధ్యక్షుడుగా 1948 లో ఎన్నికైనారు. అదే సందర్భంలో భారత ప్రభుత్వం విశ్వ విద్యాలయ విద్యా విధానాలలో జరుగవలసిన మార్పులను గూర్చి పరిశీలనలు జరుపటానికి నిపుణులతో ఒక ప్రత్యేక సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఆ సంఘానికి

యీయనే నాయకత్వం వహించి చాలా ఉపయోగకరమైన మార్పులను సూచించారు. 1949 నుంచీ యీయనకు భారత ప్రభుత్వం కేంద్ర మంత్రి హోదాయిచ్చి మాస్కో (రష్యా రాజధాని) లో తన రాయబారిగా నియమించింది. భారత ఉపాధ్యక్ష పదవికి పోటీ చేసేటందుకు గాను యీయన ఆ పదవికి మొన్న మొన్ననే రాజీనామా యిచ్చారు.

చెల్లాయి! ఆయన చేసిన వుద్యోగాలు, నిర్వహించిన బాధ్యతలు యిన్నిటిని నేను ఏకరువు పెట్టుతూంటేనే నువ్వు ఊహించుకోవచ్చు;-యీయన ఎంతటి ప్రతిభావంతుడో. ఈయన అభిమాన శాస్త్రం, తత్వశాస్త్రం. అందులో యీయన అపారమైన కృషి చేశారు. భారతీయ వేదాంతం, భారతీయుల జీవిత దృక్పథం, భగవద్గీత, రానున్న నాగరికత మొదలైన అంశాలమీద యీయన వ్రాసిన గ్రంథాలను ప్రామాణికాలుగా విద్యావంతులు పరిగణిస్తున్నారు. తత్వ శాస్త్రంలో వున్నంత అభిమానం యీయనకు విద్యావిధానాల విషయంలోనూ వున్నది. అందుకనే యీయన ఆంధ్రా, కాశీ విశ్వ విద్యాలయాలకు వైస్‌చాన్సలర్ కాగలిగారు. విశ్వ విద్యాలయ విద్యా విధాన సంస్కరణ సంఘ అధ్యక్షుడుగా వుండి అంత చక్కని సూచనలు చేయగలిగారు. అంతేకాక ఆంధ్ర మహాసభకు అధ్యక్షుడుగా వుండి ఆంధ్ర రాష్ట్రోద్యమం విషయంలో కూడా తీవ్రమైన కృషి చేసివున్నారు.

ఈయన తత్వతః వేదాంతి. ఈయనకు రాజకీయాలలో వుండే కీచులాటలు పెనుగులాటలు సోకవు. భారత రాజ్యాంగ ఉపాధ్యక్ష హోదా అంతటి ప్రధానమైన హోదాలో వుండదగిన వ్యక్తికి యిటువంటి తత్వం వుండటం చాలా అవసరం. ఈ మాదిరి తత్వం కలమనిషిని రష్యావంటి దేశంలో భారత రాయబారిగా పండిట్ నెహ్రూ నియమించారంటే నెహ్రూ ధైర్యాన్ని మెచ్చుకోవలసి వున్నది. అందుకు తగ్గట్టుగా రాధాకృష్ణన్ గారు కూడా మాస్కోలో భారత రాయబారిగా చాలా చాకచక్యంతో వ్యవహరించారు. మరి ఏ దేశపు రాయబారినీ ముఖతః చూడనొల్లని స్టాలిన్ వంటివాడే రాధాకృష్ణన్ గారిని రెండుసార్లు కలుసుకొని సుదీర్ఘంగా సంభాషించాడంటే, అది స్టాలిన్ వుదారత్వం అనటంకంటే రాధాకృష్ణన్ గారి ప్రతిభకు తార్కాణమనే మనం ఎంచవలసి వున్నది. ప్రస్తుత ప్రపంచ రాజకీయాల ధోరణిలో, పరాయిదేశాల వారెవ్వరినీ కన్నెత్తి చూడక, పన్నెత్తి పలుకరించక వుండే స్టాలిన్ వంటి వ్యక్తి యిటీవల రాధాకృష్ణన్ గారిని చూచి అరగంటపైగా సంభాషించాడనే వార్త బయట పడగానే ప్రపంచంలోని పత్రికలన్నీ యీ సమావేశాన్ని గురించి ఎన్నో వ్యాఖ్యానాలు చేశాయి. రాధాకృష్ణన్ గారు మాత్రం తమ సమావేశంలో ఏం జరిగిందీ, ఏ విషయంపై సంభాషణలు జరిపిందీ ఎంతమంది పత్రికలవారు వెంటబడి అడిగినా ఒక్క ముక్కైనా బైట పెట్టలేదు.

ఇంత నిండుతనము, యింతటి మేధా సంపత్తి, యింతటి శక్తి సామర్థ్యాలు, ఋజువర్తనము కల వ్యక్తి ఆంధ్రుడై వుండటమూ, ఆయన మొట్టమొదటి భారత ఉపాధ్యక్షుడుగా పోటీ లేకుండా ఎన్నిక కావటమూ నీకూ, నాకు, మనసోదర ఆంధ్రులకు గర్వ కారణం కాదూ! —వి. ఎన్.

# పిల్లలందరు గొల్లుమన్నారు

(17-వ పేజీ తరువాయి)

"తగలబడ్డట్టేవుంది నీ జిల్లా బోర్డు" అంటూ పేరయ్యశాస్త్రిలు క్లాసులోకి దూరాడు. క్షణకాలం అందరు చకితులైనారు. పేరయ్యశాస్త్రిలుగారి మాటలు బాగా ఎరిగినవారవడంచేత తాతాచార్లు ఏమీ ఆశ్చర్యపడలేదు.

"డబ్బు తెచ్చాడా."

"నా మొహం తెచ్చాడు."

"ఇదేం కర్మ!"

"జిల్లాబోర్డు అక్కౌంటులో, దమ్మిడీ కూడా లేదట." అన్నాడు శాస్త్రిలు నిలువున దహించుకొపొయ్యే కోపంతో. ఆ మాట విని పిల్లలందరు గొల్లుమన్నారు.

★

# విజ్ఞాన వీధులు

(35-వ పేజీ తరువాయి)

గూడు చీదిపి పరీక్షచేసి యుంటే వారికి అసలు సత్యము అవగాహన అయివుండును.

## 4. మొసలి జీవకారుణ్యం

ఎంత కారుణ్యం లేకపోతే, నోట్లోకి - రెండు దవడలూ కలిసే చోటికి సరిగ్గా పళ్ల మధ్యకి-తనంతట తానే ప్రవేశించిన పిట్టని కరకరా నమిలేయకుండా మిగులుస్తుందీ మొసలి? పులినోటి కండ తప్పి బయటపడిందని ఎప్పుడేనా విన్నారా మీరు? మొసలి నోట్లో దూరిన పిట్టమాత్రం నిరపాయంగా బయటికి వచ్చి ఎగిరిపోతుంది. ఎప్పుడో తప్పిజారి ఒక్కమాటు కాదు. మొసలి నోరు తెరచుకుని గట్టుమీద పడుకున్నప్పుడల్లానూ!

మొసలి ఉభయచరం. రాత్రంతా నీళ్ళల్లోనే తిరుగుతూ, నీటిపక్షుల్ని, దప్పి తీర్చుకోడానికి వచ్చిన జంతువుల్ని నడిలేకుండా పట్టుకుని నీటి అడుక్కి లాగుకుపోయి నమిలి వేస్తుంది. బురద నీటిలో ఎప్పుడూ వుండే జలగలు ఈ అవకాశాన్ని దొరకబుచ్చుకుని మొసలి దవడల్లో దూరి పళ్ల యిగుళ్లని పట్టి నెత్తురు పీలుస్తాయి. వీటిని వదిలించుకోడానికి సాధనాంతరం లేక పగటిపూట నీటికి చేరువగా గట్టుమీద నోరు తెరుచుకుని పడుకుంటుంది మొసలి. ట్రోకిలస్ * అనే పిట్ట ఇది కనిపెట్టి తెరచి ఉన్న మొసలి నోటిలో నిర్భయంగా ప్రవేశించి మెత్తని చోట్ల పట్టివున్న జలగల్ని పొడిచి తినేస్తుంది. మొసలి ఈపిట్టకి హాని చెయ్యదు.

* *Cambridge Natural History Vol VIII Page 462.*

★



"నేనేమైనా దయ్యాన్నా; భూతాన్నా? నువ్వు ఆ వరసను ఏడుస్తుంటే నే నెట్లా ఫోటో తీసి ఏడ్చేది?"

## చెప్పు చలవ

(34-వ పేజీ తరువాయి)

తరువాత నాగిరెడ్డి పేరు పేరునా వెదుకుతూ తెచ్చియిచ్చిన తమల పాకు కిళ్ళీలు పెద్దలందరూ సేవించారు. మరికొంతసేపు అక్కడే తాపీగా కూర్చొని పిచ్చాపాటి వేశారు. ప్రొద్దుపోయాక నెంపాదిగా కదిలి వాకిట్లోకి వచ్చారు. జోళ్లకోసం వెదకటం ప్రారంభించారు. ఏవీ? జోళ్లు ఏవీ? నాగిరెడ్డి ఏడీ?

మర్నాడు వూళ్లో కొందరు ప్రోగై చెప్పుకొన్నారు - నాగిరెడ్డి ఆక్రితం సాయంకాలం తన యింటికి వచ్చిన పెద్ద మనుష్యుల చెప్పుల జతలన్నీ పోగుచేసి ప్రక్కయింటి మాలవాడికి తెగనమ్మి, ఆవచ్చిన డబ్బుతో కాఫీ హోటలులో ఫలహారాలుకొని యింటికి పట్టుకు వెళ్ళాడని.

★


## గడియారంచెప్పిన కథ

(32-వ పేజీ తరువాయి)

చేతికర్ర మీనాన్న నిన్ను కొట్టటానికి వుపయోగించే చేతి కర్రలా గుండ్రగా వుండదు ''

సుందరానికి వుడుకుమోతుతనం వచ్చింది — తను నాన్న చేత దెబ్బలు తిన్న విషయం యీ గడియారం గమనించటం ఎందుకూ, అని. "నన్ను మానాన్న ఎప్పుడూ కర్రతో కొట్టనే కొట్టరు'' అనేశాడు.

''పోనీలే. కొట్టకపోతే కొట్టకపోయార్లే. నే చెప్పేది సాంతం విను. ఫకీరు చేతికర్ర గుండ్రగా వుండదని చెప్పాను కాదూ. గుండ్రగా కాక పలకలు పలకలుగా వుండేది. కర్రకు పైఎత్తున వరుసగా కంతలు పొడిచి వుండేవి. ఒక కంతగుండా దారం దూర్చి వుండేది. ఫకీరుకు టైం ఎంతైందీ తెలుసుకో వలసిన అవసరం వచ్చినప్పుడు నడుస్తూ నడుస్తూవున్న వాడల్లా టక్కున ఆగిపోయి కర్రకు కట్టిన దారాన్ని మునివేళ్లతో పుచ్చుకొని కర్ర క్రిందికి నిటారుగా వేలాడేటట్లు వుంచేవాడు. కర్రకు పైభాగాన యిటునుంచీ అటువరకు ఒక రంధ్రం వుండేదని చెప్పాను కదూ; ఆ రంధ్రంలోనికి ఒక చిన్న కర్రపుల్లను దూర్చేవాడు. నిటారుగా వున్న యీ కర్రమీద ఆ పుల్ల తాలూకు నీడ పడుతుంది కదూ. అన్నట్లు; చెప్పటం మరచిపోయా ! ఆ కర్రమీద అడ్డంగా కొన్ని గీతలు వుంటాయి. అడ్డపుల్ల నీడ మొదటి గీతవరకు పడిందనుకో. అప్పుడు దాదాపు వుదయం పదిగంటలని ఫకీరుకు బోధపడుతుంది. ఆ ఫకీర్ల తెలివి తేటలు యింకా ఎంత గొప్పవనుకొన్నావ్! వేసవిలోనూ, శీతాకాలంలోనూ నీడలు ఒక్కలా పడవు. అందుకని చేతికర్రను పలకలు పలకలుగా చెక్కించి ఒకవైపు వేసివి కాలంలో పడేనీడల ప్రమాణాన్ని బట్టీ కొన్ని గీతలు, మరొకవైపు శీతాకాలంలోపడే నీడల ప్రమాణాన్ని బట్టి కొన్ని గీతలు గీయించేవారు. ఋతువునుపట్టి నీడల కొలతకు అదే కర్రపైన వేరు వేరు విధంగా అమర్చిన గీతలను ఆధారంగా తీసుకొనేవారు."



"బలే తేలిక పద్ధతే నే: ఈ మాదిరి కర్ర గడియారం నేనూ ఒకటి తయారు చేసుకోవచ్చునన్నమాట."

"ఓ! నిక్షేపంలాగా. అన్నట్లు; సుందరం! నువ్వు ఎప్పుడైనా ముల్లులేని గడియారాన్ని చూశావా ?"

"ఏడిసినట్లుంది. ముల్లులేని గడియారం కళ్లులేని మనిషి చూడాల్సిందే."

"ఎగతాళి కాదు. నిజంగా ముల్లులేని గడియారాలు వుండేవి. కళ్లువున్న మనుషు లందరూ అవి చూచే టైం ఎంతైందీ తెలుసుకొనేవారు."

"నీదంతా విపరీతంగా వున్నదే! అదెల్లా జరిగేదో చెప్పు చూతాం."

(ఇంకావుంది)



"ఎ ప్లేస్ ఇన్ ది సన్" చిత్రంలో ఎలిజబెత్ టేలర్, మాంట్‌గోమరీ క్లిఫ్ట్.



“ఎ ప్లేస్ ఇన్ ది సన్”లో మాంట్ గోమరీ క్లిఫ్ట్, షెల్లీ వింటర్స్

సమీక్ష

# “ఎ ప్లేస్ ఇన్ ది సన్”

హాలీవుడ్ నిర్మాతలు ప్రారంభించిన ఒక ఉత్తమ సాంప్రదాయం ఏమిటంటే, ప్రపంచ సాహిత్యంలో ఉత్తమంగా పరిగణింపబడే నవలలు, నాటకాలు తీసుకుని చిత్రాలు నిర్మించటం. హాలీవుడ్ నుండి అనేక ఉత్తమచిత్రాలు ఈవిధంగా బయల్దేరాయి. విక్టర్ హ్యూగో, చార్లెస్ డికెన్స్ మొదలైనవారి నవలలు, షేక్స్పియర్, బెర్నార్డ్‌షా మొదలైనవారి నాటకాలు చిత్రాలుగా తీశారు. ఈ చిత్రాలు దాదాపు ఆ రచనలు పొందినంత గౌరవమూ, అంతకంటె ఎక్కువ ప్రజాదరణా కూడా చూరగొన్నాయి. ( ఈ పద్ధతి మన దేశంలో ఒక్క న్యూ థియేటర్స్‌వారే జయప్రదంగా సాగించారు)

మద్రాస్ న్యూఎల్ఫిన్‌స్టన్‌లో ప్రదర్శింపబడుతున్న *"A Place in The Sun"* అనే చిత్రం ప్రసిద్ధ అమెరికన్ నవలా రచయిత థియొడోర్ డ్రీజర్ రచించిన అమెరికన్ ట్రాజెడీ అనే నవల ఆధారంగా తీయబడింది. డ్రీజర్ తన నవలలో అమెరికన్ సమాజ వ్యవస్థలో గల అరాజకాన్ని, భిన్నశక్తుల సంఘర్షణను తత్ఫలితంగా సంభవించే విషాద సంఘటనలను చిత్రించాడు. పారమౌంట్‌వారు డ్రీజర్ నవలలోని సమాజ విమర్శనుమాత్రం వదిలివేసి, మిగతా కథతో చక్కని చిత్రం నిర్మించారు. ఈ చిత్రానికి ఆరు ఎకాడమీ బహుమతులు లభించాయి.

జార్జి ఈస్ట్‌మన్ అనే నిరుద్యోగి యువకుడు ధనికుడైన తన పినతండ్రి ఫ్యాక్టరీలో కార్మికుడుగా ప్రవేశిస్తాడు. తన పక్కన పనిచేసే ఆలిస్ ట్రిప్ అనే కార్మికస్త్రీని ప్రేమించి ఆమెతో సంబంధం ఏర్పరచుకొంటాడు. కొద్దిరోజుల్లోనే అతనికి ఫ్యాక్టరీలో ఉన్నత పదవి దొరుకుతుంది. కార్మిక జీవితాన్ని ఏవగించుకొనే ఈస్ట్‌మన్‌కు ప్రమోషను రావటంతో ధనిక వర్గాలవారితో పరిచయం కలగటం, విలాస జీవితంపై వ్యామోహం ఎక్కువకావటం, ఒక కోటీశ్వరుని కుమార్తెను ప్రేమించటం జరుగుతుంది. ధనిక యువతిని వివాహం చేసుకోగోరుతాడు. కాని ఈలోగానే మొదట అతను ప్రేమించిన కార్మికస్త్రీ గర్భవతి అయి తన్ను వివాహం చేసుకోవలసిందని ఒత్తిడి చేస్తుంది. ధనిక యువతిని వివాహమాడి ఉన్నత వర్గంలో కలిసిపోవటానికి ఆలిస్ ట్రిప్ ప్రతిబంధకంగా

నిలుస్తుంది ఆమెను హత్య చేయాలనే సంకల్పంతో ఈస్ట్‌మన్ ఆమెను ఒక సరస్సుపై నౌకా విహారానికి తీసుకుపోతాడు. ఆమెను నీళ్ళలోకి తోసివెయ్యాలనుకుంటాడు గాని ధైర్యంలేక తటపటాయిస్తాడు. ఇంతలో ప్రమాదవశాత్తు పడవ తలక్రిందులై ఇద్దరూ నీళ్లలో పడతారు. ఆలిస్‌ను రక్షించే ప్రయత్నమైనా చెయ్యకుండా అతడు ఒడ్డు చేరుకుని వచ్చేస్తాడు. పోలీసులతన్ని పట్టుకొని హత్యానేరం మోపుతారు. అతడు నిజానికి స్వయంగా హత్య చెయ్యకపోయినా, హత్య చెయ్యటానికి తగిన కారణం ఉంటంవల్ల అతనిపై నేరం ఋజువవుతుంది. కోర్టువారు మరణశిక్ష విధిస్తారు. ఈస్ట్‌మన్ శిక్షకోసం ఎదురు చూస్తుండగా మతాధికారి వచ్చి అతనిచేత నేరం ఒప్పిస్తాడు. ఈస్ట్‌మన్ తను నిజంగా హత్య చెయ్యకపోయినా ఆ సమయంలో ఆలిస్ మరణాన్నే తాను వాంఛిస్తున్నట్టు ఒప్పుకుంటాడు. అందుచేత అతనికి శిక్ష పడటం ఉచితమేనని నిరూపితమవుతుంది.

ఈ కథను చిత్రనిర్మాత, దర్శకుడు జార్జి స్టీవెన్స్ అతి శక్తివంతంగా చిత్రించారు. కార్మిక స్త్రీగా షెల్లీ వింటర్స్, ధనిక స్త్రీగా ఎలిజబెత్ టేలర్, ఈస్ట్‌మన్‌గా మాంట్‌గోమరీ క్లిఫ్ట్ నటించారు.

ఈ చిత్రం చూస్తుంటే కొన్ని విషయాలు వెంటనే వ్యక్తమవుతాయి. సంభాషణలు అతి క్లుప్తంగా, ముక్తసరిగా ఉంటాయి. కథను ఎక్కువభాగం కెమేరాయే చెబుతుంది. ఒక పాత్ర ముఖకవళికను చూసి ఆ పాత్ర మనస్సులో ఏయే భావాలు కల్లోలిస్తున్నాయో గ్రహించగలం. ముఖ్యంగా కొన్ని ఘట్టాలలో కెమేరా పనితనం అపూర్వంగా వున్నది. సరస్సులో ఈస్ట్‌మన్ ఆలిస్‌తో కలిసి పడవలో విహరిస్తున్నప్పుడు ఆమెను నీళ్ళలో ముంచివెయ్యాలనే ద్రోహభావం, ఆమెమీద అతనికి కలిగిన పైశాచిక ద్వేషం, హత్యను ఉపక్రమించలేని అధైర్యం ఇవన్నీ సగం వెలుగులోను, సగం చీకటిలోను దాగుడుమూతలాడే అతని ముఖంలోనే కనిపిస్తాయి. అలాగే ఆఖరున మతాధికారి వచ్చి ఈస్ట్‌మన్‌ను "ఆ సమయంలో ఏమాలోచిస్తున్నావు? ఆమె మరణాన్ని వాంఛిస్తున్నావా? లేదా?" అని గుచ్చిగుచ్చి అడుగుతున్నప్పుడు అతడు రాతిబొమ్మలాగ ముఖం పెడతాడు. నిశ్చలమైన ఆ ముఖంలో "అవును" అన్న సమాధానం కనిపిస్తుంది. మాంట్‌గోమరీ క్లిఫ్ట్ అభినయం ఈ రెండు ఘట్టాలలోను అత్యుత్తమంగా ఉంది. హృదయగత భావాలను కెమేరాతో పిండి ఇవతలకు లాగటం ఈ చిత్రంలో మన నిర్మాతలు నేర్చుకోవలసిన మొదటిపాఠం.

★

# "కాంచన"

పక్షిరాజావారి "కాంచన" తమిళ చిత్రం మే 1వ తేదీన వెల్లింగ్టన్ టాకీస్‌లో పత్రికలవారికి చూపబడింది. ఈ చిత్రంలోని కథ ఇదివరకే ఆనందవికటన్‌లో ఏడాదిపాటు నడిచిన సీరియల్ నవలద్వారా తమిళనాడులో సుప్రసిద్ధమైంది. కథారచయిత్రి డాక్టర్ లక్ష్మి. మూలంలో కథ చక్కగా ఉండి ఉండవచ్చునుగాని తెరమీదికి తీసుకురావటంలో నిర్మాతలు కృతకృత్యులు కాలేకపోయినట్లు కనిపిస్తుంది. సుమారు మూడున్నర గంటలసేపు ప్రేక్షకుల హృదయాలనుగాని, మెదడునుగాని కదిలించే ఒక్క సన్నివేశంకూడా లేకుండా నడుస్తుంది ఈ చిత్రం.

ఒక యువక జమీందారుంటాడు. అతడు భానుమతి అనే వేశ్యకన్యను ప్రేమిస్తాడు. ఆమెకూడా అతన్ని ప్రేమిస్తుంది. ఆ తరువాత అతడు కాంచన అనే ఒక బీద పిల్లను పెళ్లిచేసుకుంటాడు. కోరి కోరి బీద పిల్లను పెళ్లిచేసుకున్నవాడు ఊరకోకుండా ఆమెను నిత్యం బాధపెడుతూ ఉంటాడు. ఆమెకొక కొడుకుపుడతాడు. భర్త, భర్త అక్కగారు పెట్టే బాధలు భరించలేక ఆమె కొడుకుతో సహా ఇంట్లోంచి పారిపోతుంది. కాని భర్త ఆమెను తిరిగిపట్టుకుని, కొడుకును తెచ్చుకుని, తను ప్రేమించిన వేశ్యకన్య చేతికిస్తాడు పెంచమని



రాగిణీవారి "ధర్మదేవత"లో ముక్కామల



ధూమకేతువు భటులు పట్టి పరమానందాయశిష్యులు. విజయావారి "చంద్రహారం"లో
కె. వి ఎస్ శర్మ, పద్మనాభం. రేలంగి.

ఇలా ఉండగా జమీందారు మిల్లు వ్యాపారంలో నష్టం వస్తుంది అప్పటినుండి అతనికి హృదయ పరివర్తనం కలగటం ప్రారంభమౌతుంది ఇంటినుండి పారిపోయిన కాంచనను తిరిగి ఇవతక్కు రప్పించుకుంటాడు వేశ్యకన్యను అదివరకే ప్రేమించాడుగనుక ఆమెనుకూడా పెళ్లిచేసుకుంటానంటాడు కాంచనకూడా భర్త రెండో పెళ్లి చేసుకోటాని కంగీకరిస్తుంది కాని కాంచన ప్రేమకు అడ్డురావటం తన కిష్టం లేదని చెప్పి అదివరకే క్షయిలా పడివున్న వేశ్యకన్య చనిపోతుంది జమీందారు, కాంచన కులాసాగా ఉంటారు.

క్లుప్తంగా కథ ఇదే కాని ఇంకా చాలమంది పాత్రలు వస్తారు కాంచన తాత, అన్న, అన్న ప్రేమించిన లేడీ డాక్టర్, వేశ్యకన్య యొక్క తల్లి, జమీందారు దగ్గిర ఉండేగుమాస్తా వీరందరికీ కూడా చిత్రంలో స్థానం వున్నది. వీరి సహాయం వలన చిత్రం పొడుగు పెంచటానికి వీలైనది అసలు చిత్రం ప్రారంభమైన గంటవరకు కథ ప్రారంభం కాదు ప్రతిపాత్ర పాడుతూనో, నృత్యం చేస్తూనో తెరమీదికి రావటంమూలాన ఒక్కొక్క పాత్ర ప్రేక్షకులకు పరిచయం కావటానికి పావుగంట పడుతుంది

ఈ చిత్రంలో కాంచనగా లలిత, వేశ్యకన్యగా పద్మిని, జమీందారుగా కె. ఆర్ రామస్వామి నటించారు వీరుగాక టి ఎస్ దొరరాజ్. ఎమ్ ఎన్. నంబియార్, మనోహర్, క దొరస్వామి, కుమారి, సంతానలక్ష్మి, జ్ఞానం, తంగం మున్నగువారు నటించారు సంగీతం ఎస్ ఎమ్ సుబ్బయ్య ప్లేబాక్ పాటలు పెరియనాయకి, వసంతకుమారి, జయలక్ష్మి నిర్మాత, దర్శకుడు శ్రీరాములునాయుడు

సంగీతం కొన్నిచోట్ల దాక్షిణాత్య పద్ధతిలోను, కొన్నిచోట్ల హిందూస్థానీ బాణీలోను ఉన్నది. దర్శకత్వం ఇంతకంటే ఉత్తమంగా ఉండవలసింది. పౌరాణిక చిత్రాలకాలంనాటి సంప్రదాయాలు ఇంకా సాంఘిక చిత్రాలలో కూడా ఉపయోగించబడటం శోచనీయం "ఆత్మ" "అంతరాత్మ" వేరువేరుగా నుంచుని సుదీ


# ★ మన చిత్రాల నిడివి ★

యుద్ధకాలంలో ముడిఫిలిం కొరత మూలంగా మన చిత్రాల పొడుగును బాగా తగ్గించుకోవలసి వచ్చింది తరవాత ఫిలిం నిర్మాతలు ప్రభుత్వంతో దెబ్బలాడి చిత్రాల పొడుగును పెంచేందుకు అనుమతి సంపాదించుకున్నారు తత్ఫలితంగా ఇటీవల చిత్రాలు ఉపద్రవంగా పొడుగు పెరగటం సాగించాయి మూడున్నర, నాలుగు గంటలసేపు కూడా ప్రేక్షకుణ్ణి హాల్లో కూర్చోబెట్టే చిత్రాలు బయలుదేరుతున్నాయి. రెండు మంచి చిత్రాలకు సరిపోయే ఫిలింను ఒక తుక్కు చిత్రం దురాక్రమించటం చూస్తే హృదయం ద్రవీభవిస్తుంది.


మన చిత్రాల నిడివి పెరగటానికి గల అనేక కారణాల్లో కథాదైర్ఘ్యం మాత్రం ఒకటి కానే కాదు ఈమధ్య వెలువడిన కొన్ని తమిళ, తెలుగు చిత్రాలలో కథ ఎంత అల్పమైతే పొడుగు అంత ఎక్కువ కావటం కనిపిస్తున్నది మామూలుగా ఒక ముక్కలో చెప్పవలసిన విషయాన్ని పది మాటల్లో చెప్పే మనిషిని చూసి విసుక్కుంటాము అలాగే పదివేల అడుగుల్లో ప్రదర్శించదగల కథను ఇరవై వేల అడుగులలో చూపించే చిత్రాన్ని చూసికూడా విసుగు కలగక తప్పదు ఆ విధంగా చిత్రం పొడుగును అనవసరంగా పెంచటం దర్శకుని చేతకానితనాన్నే సూచిస్తుంది

ఇటీవల ఒక అమెరికన్ పత్రిక ఇలా రాసింది "ఒక భారతీయ చిత్రంలో ఉద్యోగస్థుడు ఆఫీసునుంచి ఇంటికి వెళ్లటాని చూపించవలసివస్తే అతను కుర్చీలోంచి తాపీగా లేవటం, గేటువరకూ నడవటం, బజారు పోతునా ఇంటవరకూ ష్టంగా మాట్లాడుకోవటం లాంటివి చిత్రంలో చాలా ఉన్నాయి చిరకాలం నుంచి ఒక వ్యక్తికోసం వేచిఉన్న మరొక వ్యక్తి ఆ వ్యక్తి చివరికి కనిపిస్తే రోజూ చూస్తున్న వ్యక్తిని పలకరించినట్టే పలకరిస్తుంది ఇలాంటి అసందర్భాలు చాలా చోట్ల జరుగుతాయి ఈ చిత్రంలో దుఃఖం చూపించవలసివచ్చినప్పుడు సూచనగా ధ్వనించటం ఆధునిక పద్ధతి ఈ చిత్రంలో ప్రతిపాత్ర అవసరం ఉన్నా లేకపోయినా విరివిగా గ్లిసరిన్ కన్నీళ్ళు కార్చటం, వెక్కి వెక్కి ఏడ్వటం జరుగుతుంది

ఈ చిత్రం తెలుగుభాషలో డబ్ చేయబడి ఆంధ్రదేశంలో కూడా ఈ నెలాఖరులోగా విడుదల కాగలదని తెలుస్తున్నది ★



సంఘాన్నెదిరించి తిరుగుతున్న వలపుజంట జానకి, జగ్గయ్యలను రంగస్వామి మందలిస్తున్నాడు
శుభోదయావారి 'ఆదర్శం'



చంద్రం ఇంట బొమ్మలపండగ సందర్భంలో రాజూ-పేద నృత్యం (రాజు సావిత్రి, పేద, కృష్ణవేణి)
పీపుల్స్‌వారి "పల్లెటూరు"

నడవటం, ఇంటిమెట్లు ఒక్కొక్కటే ఎక్కటం, తలుపు తెరవటం ఇవన్నీ తెర మీద కనిపిస్తాయి—వాటి అవసరం లేకపోయినా అదే అమెరికన్ చిత్రంలో అయితే ఉద్యోగస్థుడు కుర్చీలోంచి లేవటం, వెంటనే తన ఇంటి తలుపు తెరిచి ప్రవేశించటం మాత్రమే చూపబడతాయి" మన చిత్రాల నిడివి పెరగటానికి పైన పేర్కొన్నది కొంతవరకూ కారణం.

కాని అన్నిటికంటె చిరాకు పుట్టించే కారణం మరొకటున్నది మన దేశపు చిత్రాలలో పాటలు లేనిదంటూ ఒక్కటైనా మచ్చుకి కనిపించదు పదికి తక్కువ కాకుండా ఇరవైదాటి ఎన్నైనా పాటలుండవచ్చును ఈ సంప్రదాయం మనకు నాటకాలనుంచే వచ్చింది పూర్వం మన నాటకాలన్నిటిలోను పద్యాలు విరివిగా ఉండేవి మొదటగా వచ్చిన పౌరాణిక, సాంఘిక చిత్రాలలో కూడా పద్యాలు పాడేవారు క్రమంగా పద్యాలపై వెగటు పుట్టి అవి మానేసి పాటలకే ప్రాధాన్యం ఇవ్వటం ప్రారంభించారు నాటకాల్లో స్వగతాలెలాంటివో సినిమాల్లో పాటలు అలాంటివి పూర్వపు నాటకాలలో ఒక వ్యక్తి మనోగత రహస్యభావాలను ప్రేక్షకులకు చెప్పవలసివచ్చినప్పుడు ఆ వ్యక్తి చేత స్వగతోపన్యాసం ఇప్పించేవారు ఈ పద్ధతి ఆధునిక నాటకాలలో మానివేశారు సినిమాలలోకి అది రావలసిన అవసరమే లేకపోయింది కాని పాటలు మాత్రం సినిమాలలో ప్రధానస్థానం ఆక్రమించుకున్నాయి అందువల్లనే మన చిత్రాలు అంత ఎక్కువగా పొడుగు పెరగటం జరుగుతోంది

సినిమాలలో పాటలు ఉండరాదని గాని ఉంచవలసిన అవసరం లేదని కాని కాదు ఒక్కొక్క సన్నివేశంలో ఒక పాత్ర పాట పాడటం అవసరమైనా, లేక ఆ పాటవల్ల సన్నివేశానికి అందం చేకూరినా పాటను ప్రవేశపెట్టవచ్చును కాని కేవలం పాత్రధారియొక్క గాననైపుణ్యాన్ని ప్రదర్శించటంకోసమే పాట పాడించటంవల్ల కథాగమనం కుంటుపడిపోతుంది ఎక్కడ పాట ప్రవేశపెడితే బాగుంటుందో తెలియని దర్శకులు, నిర్మాతలు కూడా ఉండటం మూలంగా, ప్రేక్షకులను స్తంభీభూతులనుగా చెయ్యవలసిన సన్నివేశంలో, హఠాత్తుగా నాయకుడో, నాయికో పాట ప్రారంభించటం, రసం బదులు రసాభాసం కలగటం జరుగుతుంది ఇటీవలి ఒక చిత్రంలో మంచంమీదనుంచి లేవలేని జబ్బుస్థితిలోవున్న ఒక పాత్ర మంచంమీద పడుకునివుండి కమ్మని కంఠంతో విషాద గీతం ప్రారంభిస్తుంది ఆమెమీద ఆ క్షణంలో సానుభూతికి బదులు హేళనభావం కలుగుతుంది అదే చిత్రంలో మరొక పాత్ర ఒంటరిగా తోటలో విహరిస్తూ ఎవరో ఎదురుగా ఉన్నట్టే అభినయిస్తూ పాట పాడుతుంది స్వగతాలను

నిరాకరించిన సినిమాలలో పాటలు ఉండటం కూడా అనవసరమే.

అయితే అమెరికన్ చిత్రాలలో కూడా ప్రత్యేకంగా "మ్యూజికల్ కామెడీ" లంటూ కొన్ని ఉన్నాయి. కాని అమెరికన్ చిత్రాలలో పాటలు గాని, ఇతర సంగీతం గాని వ్యక్తిగత విషయంగా చూపబడవు. వారి సంగీతం సామూహికంగా ఉంటుంది గాని స్వగతంగా ఉండదు. అందుచేత అటువంటి సంగీతానికి ఇబ్బంది లేదు.

మన చిత్రాలు నిడివి పెరగటానికి ఈ పాటలు కూడా కొంతవరకూ కారణమే. ఒక్క పాట కూడా లేకుండా అమెరికన్లు అనేక ఉత్తమ చిత్రాలు తీశారు. కాని మన చిత్రాలనుండి పాటలు పూర్తిగా వెంటనే ఎత్తివెయ్యటానికి ఒక ప్రతిబంధకం ఉన్నది. పాటలు లేని సినిమా ఆర్థికంగా విజయం పొందలేకపోవచ్చును. ప్రజాబాహుళ్యానికి అందుబాటులోకి వచ్చే సంగీతాన్ని ఒక్క సినిమా లే ప్రస్తుతం నిర్మిస్తున్నాయనే సంగతి సత్య దూరం కాదు. రేడియోలలోను, పాటకచ్చేరీలలోను వినవచ్చే సంగీతం పండితులకే గాని పామరులకు అభేద్యంగా ఉంటున్నది. అందువల్ల "తేలిక" సంగీతం సినిమారంగంలో తప్ప మరెక్కడా లభ్యం కావటం లేదు. "తేలిక" సంగీతం ఇతరత్రా లభ్యమయ్యేదాకా సినిమాలలో పాటలుండక తప్పదు కాని పాడుగును విపరీతంగా విస్తరించేటన్ని పాటలుండనక్కర్లేదు. ★

# సినిమా వార్తలు

శుభోదయా వారి "ఆదర్శం" షూటింగ్ చాలవరకు అయిపోయింది. జూన్ నెల మొదటివారానికే విడుదల చేయాలని నిర్మాతలు ప్రయత్నిస్తున్నారు.

టి. కె. ప్రొడక్షన్సువారి "పాలేరు" షూటింగ్ జోరుగా జరుగుతున్నది. ఈ చిత్రంలో జగ్గయ్య, కృష్ణవేణి, జానకి, లక్ష్మీకాంత, డా॥ జి. వి. సుబ్బారావు మున్నగువారు నటిస్తున్నారు దర్శకత్వం, సంభాషణలు గోపీచంద్; సంగీతం: పెండ్యాల.

రాగిణీవారి "ధర్మదేవత" ఈనెలలోనే అతిత్వరలో విడుదల చేస్తారని తెలుస్తున్నది.

సిపాయి విప్లవంలో ప్రసిద్ధికెక్కిన ఝాన్సీ లక్ష్మీబాయి జీవితం ఆధారంగా సొహ్రాబ్ మోడీ నిర్మిస్తున్న "ఝాన్సీ కిరాణీ" షూటింగ్ పూర్తయింది. ఈ చిత్రం టెక్నికలర్‌లో తీయబడింది. చిత్రనిర్మాణంలో చాలమంది విదేశీయ నిపుణులు సొహ్రాబ్ మోడీకి సహాయం చేశారు. వీరు మొత్తం 5 నెలలలో 112 షూటింగ్ దినాలలో షూటింగ్ పూర్తిచేశారు.

గజానన్ జాగీర్దార్ నిర్మిస్తున్న "లోకమాన్య తిలక్" తిలక్ వర్ధంతి దినమైన ఆగస్టు 1 నాడు విడుదల కాగలదట. తిలక్ పాత్ర జాగీర్దారే ధరిస్తున్నాడు.

తెలుగుతారలు తమిళ సినిమారంగాన్ని జయించినట్లే బొంబాయి సినిమారంగాన్ని కూడా క్రమంగా ఆక్రమించేటట్లున్నారు. భానుమతి ఇదివరకే అశోక్‌కుమార్‌తో కలిసి "షంషీర్"లో నటిస్తున్నది. ఇటీవల అంజలీదేవిని, అందాలరాణి సూర్యకుమారిని, కూడా హిందీ చిత్రనిర్మాతలు తమ చిత్రాలలోనికి బుక్ చెయ్యాలని సంప్రదింపులు జరుపుతున్నారని తెలుస్తోంది.

తమిళతార వైజయంతీ మాల జయంత్ దేశాయి తీయబోయే కొత్తచిత్రంలోకి బుక్ అయిందట.

ఏప్రిల్ 23 నుండి మే 10 వరకు కాన్స్ నగరంలో జరుగుతున్న అంతర్జాతీయ చలనచిత్ర ప్రదర్శనంలో శాంతారాం తీసిన "అమర్ భూపాలీ" బొంబాయి టాకీస్ వారి "మహల్" చిత్రాలు ప్రదర్శింపబడుతున్నవి.

## క్షామనిధికి ధనసేకరణ

రాయలసీమ క్షామపీడితులకు రాజకీయ పక్షాలతోపాటు, ఇతర ప్రజాహిత సంస్థలతోపాటు సినిమారంగంలోవారు కూడా శక్తివంచన లేకుండా ధనసహాయం సేకరించ బూనుకోవటం హర్షించదగినది. శ్రీ వి. నాగయ్య, ఎన్. టి. రామారావు, జి వరలక్ష్మి తదితర ప్రముఖ నటీనటులు ధనసేకరణకై నాటకాలు వగైరా ప్రదర్శిస్తున్నారు కిందటినెల 25వ తేదీన మద్రాసు కార్పొరేషన్ స్టేడియంలో సూర్యకుమారి, అంజలి, లలిత, పద్మిని, కుమారి కమల, ఘంటసాల, త్యాగరాజభాగవతార్, కృష్ణన్, మధురం తదితరులు అఖిల తారా ప్రదర్శనంలో పాల్గొన్నారు ఈ ప్రదర్శనానికి పురప్రముఖులు పలువురు హాజరై చాల ధనం విరాళం ఇచ్చారు. ★

# హకల్ బెరీ ఫిన్

(31-వ పేజీ తరువాయి)

ఉన్న చోటనుంచి కదలవద్దనీ, కదిలితే ముక్కలు విరగ గొడతానని దబాయించి పారిపోయాడు. అందుకని వాడి చుట్టుపక్కలే ఎక్కడన్నా ఉన్నాడేమోనని అడిగాను. అమ్మయ్య, వాణ్ని పట్టుకున్నారుగదా! బతికాను." అని కల్పించి అన్నాను.

"ఆ పట్టుకున్నారు వాణ్ని. పట్టుకున్న వాళ్ళకి రెండువందల డాలర్లు బహుమతికూడా ఉంది."

"అరెరె. నేనే పెద్దవాణ్నయితే వాణ్ని, పట్టుకుని ఆ డబ్బు సంపాదించుకునేవాణ్ని. అయితే ఇంతకీ వాణ్నెవరు పట్టుకున్నారు?"

"ఎవడో ముసలివాడు. ఆయన పట్టుకున్నాడు. కాని తను అర్జంటుగా ఇంకో ఊరుపోవలసివుందిట. అందుచేత నీగ్రోని అసలు యజమానికి అప్పగించి రెండువందల డాలర్లు పుచ్చుకునేదాకా టైము లేదట. అందుకని సైలాస్ ఫిలిప్స్ అనే ఆయనకి నలభైడాలర్లు పుచ్చుకుని నీగ్రోని అప్పగించాడు. సైలాస్ ఫిలిప్స్ గనక అసలు యజమానికి నీగ్రోనిచ్చివేస్తే ఆ రెండువందలూ ఆయనకే వస్తాయి," అని చెప్పి ఆ అబ్బాయి తనదోవన తను పోయాడు. నేను తిరిగి పడవలోకి పోయి డేరాలో చతికిలపడ్డాను. మళ్లీ కొంతసేపు జిమ్‌ను తలుచుకుని ఏడ్చాను, జిమ్‌ను ఎవరు అమ్మేశారో నా కర్థమైంది. జమీందారు, డాఫిన్ కలిసి ఇన్నిరోజులూ గుసగుసలాడుతూ పన్నినకుట్ర ఇదే నన్నమాట. జిమ్‌ను ఏదోకాడికి అమ్మి డబ్బు సంపాదించాలని ఎత్తువేశారు. మేము వాళ్లకి చేసిన సహాయం, మర్యాద అన్నీ మరిచిపోయి మాకే ద్రోహంచేశారు. తిన్నయింటి వాసాలు లెక్కపెట్టారు. అమాయకుడు, పరమసాధువు అయిన జిమ్‌ను నలభై మురికి డాలర్లకోసం ముక్కూమొహం ఎరగనివాళ్లకి, దేశంకాని దేశంలో ఎలా అమ్మివేయ బుద్ధయింది వాళ్ళకి?

జిమ్‌కు జీవితాంతమూ బానిసతనమే తప్పకపోతే, ఈ దూరదేశంలో పెళ్లాం బిడ్డలకు ఎడంగా బానిసగా ఉంటంకంటే మా ఊళ్లోనే ఉండటం మంచిదనిపించింది. టామ్‌సాయర్‌కు ఉత్తరం రాద్దామనుకున్నాను, జిమ్ ఫలానాచోట ఫలానావాళ్ల యింట్లో బానిసగా ఉన్నట్లు మిస్ వాట్సన్‌తో చెప్పమని. కాని మళ్లీ రాయబుద్ధికాలేదు. ఎందుకంటే మిస్ వాట్సన్‌కు యిప్పటికే జిమ్ పారిపోయినందుకు అతనిమీద కోపం ఉండి ఉంటుంది. ఇప్పుడు జిమ్ తిరిగి దొరికినా అతన్ని తన దగ్గిర ఉంచుకోకుండా ఏ దూరదేశంవాళ్ళకో కోపంకొద్దీ అమ్మివేస్తుంది. అది ఎలాగూ తప్పదు. అదీగాక నాసంగతి బయటపడుతుంది. జిమ్‌ను బానిసతనంనుంచి తప్పించటానికి నేను ప్రయత్నంచేసినట్టు అందరికీ తెలుస్తుంది. తెలిస్తే నా కెవరూ గౌరవమివ్వరు. పురుగును చూసినట్టు చూస్తారు. నీగ్రోను తప్పించటానికి ప్రయత్నించాడనే అవమానం భరించటం కష్టం.

ఆలోచించినకొద్దీ నేను చేసిన పాపం నాకు బోధపడసాగింది న్యాయశాసనం ప్రకారం బానిస అయిన నీగ్రోను పారిపోనివ్వటం అధర్మం, అక్రమం, అని తెలిసికూడా నేను అందుకు సహాయపడ్డాను. నా పాపపు పనిని పైనుంచి దేవుడు ఇంతకాలమూ కనిపెడుతూనే వున్నాడని హఠాత్తుగా తోచింది. అలా తోచగానే ఝల్లున వణికిపోయాను. ఇన్ని రోజులూ దేవుణ్ని తలుచుకోకుండానే గడిపాను హఠాత్తుగా దేవుడు జ్ఞాపకం వచ్చేసరికి నాభయం ఇంతా అంతా అని చెప్పలేను.

కాని ఒక విధంగా మనస్సును సమాధాన పరుచుకోజూచాను. మానాన్న నాకు సరియైన విద్యాబుద్ధులు చెప్పించలేదనీ, అందువల్ల నేను చెడిపోయాను గాని వేరే ఏం లేదనీ అనుకున్నాను. కాని నా అంతరాత్మ "నువ్వు అమ్మగారింట్లో ఉన్నప్పుడైనా బాగుపడటానికి ప్రయత్నించావా? చర్చిలో మనస్ఫూర్తిగా ఎప్పుడైనా ప్రార్థన చేశావా? మీనాన్నమీద ఎందుకు నింద వేస్తావు? అసలు నువ్వు పుట్టుకతోనే చెడ్డ పిల్లడివి," అని దెప్పిపొడిచింది.

'మించిపోయింది లేదు ఇప్పుడైనా దేవుణ్ణి ప్రార్థనచేద్దాం' మనకున్నాను. పడవ మీదనే మోకరించి ఆకాశం కేసి చూశాను. నీగ్రో బానిసను పారిపోనిచ్చిన పాపాన్ని క్షమించమని భగవతుని ప్రార్థించాలనుకున్నాను. కాని ఒక్కమాటా నోటికి రాలేదు. ఎందుకనో నాకు తెలుసు. నా పశ్చాత్తాపం నిజమైన పశ్చాత్తాపం కాదు. అబద్ధపు పశ్చాత్తాపంతో

దేవుణ్ణి వంచించాలను కోవటం శుద్ధ తెలివి తక్కువ. పశ్చాత్తాపం మనస్ఫూర్తిగా ఉంటేనే గాని దేవుణ్ణి ప్రార్థన చెయ్యలేము.

అందుచేత నేను నిజంగా పశ్చాత్తాప పడుతున్నట్లు దేవుణ్ణి నమ్మించాలను కున్నాను. ఒక కాగితం తీసి మిస్ వాట్సన్ కిలా ఉత్తరం రాశాను:

"మిస్ వాట్సన్ గారికి — మీ నీగ్రో బానిస జిమ్ పైక్స్‌విల్ అనే గ్రామానికి రెండు మైళ్ల దిగువన సైలాస్ ఫిలిప్స్ అనే ఆయన ఇంట్లో ఉన్నాడు. మీరు బహుమతి ఇచ్చి జిమ్‌ను విడిపించుకు పోవచ్చును— హాక్ ఫిన్."

ఈ ఉత్తరం రాసిన తర్వాత నా హృదయం తేలిక పడింది. నేను చేసిన పాపానికి ఈవిధంగా పరిహారం చేసుకుంటున్నాను. నన్ను ప్రజలు ఎంత అవమానించినా సరే, ఎంత నీచుడి కింద కట్టినా సరే పాప పరిహారం చేసుకుంటాను. జిమ్‌ను అతని యజమానురాలికి అప్పగించటం నా కర్తవ్యం. నా ఆ కర్తవ్యం చేసేస్తే ఇక నాకు పాపం చుట్టుకోదు. దేవుడు క్షమిస్తాడు, అనుకున్నాను. ఇక దేవుణ్ణి నిష్కల్మష హృదయంతో ప్రార్థించుదామను కున్నాను. కాని ప్రార్థించటానికి బదులు నా మనస్సు జిమ్ మీదికి పోయింది. జిమ్ రూపం, అతని చేష్టలు నాకళ్ల ఎదట ఆడసాగాయి. నెలల తరబడి రాత్రిం బగళ్లు, ఎండనక వాననక, తుపానుల్లో, వరదల్లో, పొగమంచులో, అపాయాల్లో ఒకళ్లకొకళ్లం సహాయంగా ఇంతకాలం ఇంతదూరం ప్రయాణం చేశాము. సరదాగా కబుర్లు చెప్పుకున్నాము. పాడుకున్నాం, నవ్వుకున్నాం. మాకు తెలియకుండానే మా స్నేహం వృద్ధి అయింది. మా స్నేహ బంధం ఎంత గాఢమైనదో జిమ్ లేకపోయే సరికి తెలిసి వచ్చింది. జిమ్ వంటి మిత్రుడు నాకింకెక్కడ దొరకుతాడు? అతనికి అపకారం తలపెట్టి నేనొక్క క్షణం బతక గలనా?

ఇలా అనుకుంటూ నా చేతిలో ఉన్న ఉత్తరం ముక్కను చూశాను. నా చెయ్యి గజగజ వణికిపోతున్నది. ఆ ఉత్తరాన్ని పోస్టు చెయ్యటమో, మానటమో ఏదో ఒకటి నిశ్చయించుకోవాలి. చివరికి "ఆల్ రైట్! నేను నరకానికే పడతాను. జిమ్‌కు అపకారం చెయ్యను," అనుకున్నాను.

ఈనిర్ణయం ఘోరమైనది. భయంకరమైనది. నేను చనిపోయాక ఈ ఘోర పాపం చేసినందుకు శాశ్వత నరక కూపంలో పడిపోతానని నాకు తెలుసు. కాని ఒక నిర్ణయానికి వచ్చాక మళ్లీ వెనక్కి తిరగటం అసంభవం. ఇక నాకు ముక్తిలేదు. నేను జన్మతః పాపాత్ముణ్ణి అయిఉండాలి. కనుక బాగుపడాలని ప్రయత్నించటం అనవసరం. ఒక అమాయకుని కోసం నరకానికి పోవటం కష్టమేమీ కాదు. ఇక ముందుకూడా నా పాపపు పనులు సాగిస్తూనే ఉంటాను. పుణ్యం చెయ్యటం చేతకానప్పుడు పాపం చెయ్యక తప్పుతుందా? ముందు జిమ్‌ను చెరనుండి విడిపించాలను కున్నాను. పడవను ఒకచోట దాచాను. సైలాస్ ఫిలిప్స్ ఇంటి దిశగా బయల్దేరాను. కొంత దూరం పోయాక ఒక రంపపు మిల్లు కనిపించింది. మిల్లు ముందు ఒక బోర్డుమీద "యజమాని—సైలాస్ ఫిలిప్స్" అని రాసి ఉంది. అక్కడొకరిని అడిగాను "ఫిలిప్స్‌గారి ఇల్లెక్కడ?" అని. ఇంకా కొంచెం ముందుకు పోవాలని చెప్పారు. ఇంకా ముందుకు పోయాను. ఫిలిప్స్‌గారి ఇల్లు కనిపించింది. ఇంటి తలుపులు వేసిఉన్నాయి. ఎక్కడా మనుషుల అలికిడి లేదు. బహుశా మిల్లువద్దకో, పొలాలకో పోయి ఉంటారు. చీకటి పడితేగాని ఇంటికి తిరిగిరారు. ఈలోగా ఏం చెయ్యటమా అని ఆలోచిస్తూ, ఆ ప్రదేశమంతా పరీక్షించాను.

(ఇంకా వుంది)



Edited Printed&Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., Madras



## కృష్ణదర్శనం

పి. ఆర్. రాజుగారు (మద్రాసు) టెంపరా రంగులతో రచించిన చిత్రం

Regd. No. M. 4479.